# యేసును నమ్ముచున్నాము

మొదటి పాఠము

## విమోచకుడు

Manuscript

thirdmill

Biblical Education. For the World. For Free.

© 2021 థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్

సర్వహక్కులు ప్రచురణకర్తలవే. ఈ ప్రచురణలోని ఏ భాగమైనను ఏ రూపములోనైనను లేదా ఏ సాధనము ద్వారానైనను ప్రచురణకర్తలైన థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్, ఐఎన్సి, 316 లైవ్ ఓక్స్ బిఎల్విడి, కాసిల్ బెర్రీ, ఫ్లోరిడా 32707, నుండి వ్రాతపూర్వకమైన అనుమతి పొందకుండా పునఃసమీక్షలో క్లుప్తంగా ఉల్లేఖింపబడుట, వ్యాఖ్యానించుట, లేదా పాండిత్యము సంపాదించు ఉద్దేశం కొరకు మినహా పునఃర్ముద్రింపకూడదు.

మరొక విధంగా సుచింపబడితే తప్ప ఇందులోని లేఖన ఉల్లేఖనములన్నియు తెలుగు OV వెర్షన్ నుండి తీసికొనబడినవి. కాపిరైట్ © ది బైబిల్ సొసైటీ అఫ్ ఇండియా.

## థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్

1997లో స్థాపించబడిన థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్ ఒక లాభాపేక్షలేని ఇవాంజెలికల్ క్రైస్తవ పరిచర్యగా లోకమునకు ఉచితముగా బైబిలు సంబంధమైన విద్యను అందించుటకు ప్రతిష్టింపబడింది.

**బైబిలు విద్య. లోకము కొరకు. ఉచితముగా.**

ప్రపంచవ్యాప్తముగా పరిచర్య కొరకు తగిన తర్ఫీదులేని కొన్ని వందల వేల మంది క్రైస్తవ నాయకులకు ఉచిత క్రైస్తవ విద్యను అందించుట మా లక్ష్యమైయున్నది. ఆంగ్లము, అరబిక్, మాండరిన్, రష్యన్, మరియు స్పానిష్ భాషలలో సాటిలేని మల్టీమీడియా సెమినారిని సిద్ధపరచి, విశ్వవ్యాప్తముగా పంచిపెట్టుట ద్వారా మేము ఈ లక్ష్యమును చేధించుచున్నాము. మా పరిచర్య భాగస్వాముల ద్వారా మా పాఠ్యాంశములు ఒక డజను కంటే ఎక్కువ భాషలలో ప్రస్తుతము అనువదించబడుచున్నాయి. ఈ పాఠ్యాంశములలో చిత్రములతో కూడిన వీడియోలు, ముద్రించబడిన ఉపదేశములు, మరియు ఇంటర్నెట్ వనరులు ఉన్నాయి. పాటశాలలు, సమూహములు, మరియు వ్యక్తులు ఆన్లైన్ లో మరియు అధ్యయనము చేయు సమాజములలో ఉపయోగించుటకు అనుగుణంగా ఇవి రూపొందించబడినవి.

అనేక సంవత్సరాలుగా, అవార్డులు సంపాదించిన అత్యుత్తమమైన విషయములు మరియు నాణ్యతగల మల్టీమీడియా పాఠములను ఉత్పత్తి చేయుటకు తగుమాత్రపు ఖర్చుతో కూడిన పద్ధతిని మేము అభివృద్ధి చేశాము. మా రచయితలు మరియు సంపాదకులు వేదాంతవిద్యలో తర్ఫీదు పొందిన విద్యావేత్తలు, మా అనువాదకులు వేదాంత ప్రావీణ్యతకలిగి తాము అనువదించు భాషలలో మాతృభాషా నైపుణ్యత కలిగియున్నవారు, మరియు మా పాఠములు లోకవ్యాప్తముగా అనేక సెమినారీలలో బోధించు వందలమంది గౌరవనీయులైన అధ్యాపకులు మరియు కాపరుల యొక్క మెళకువలను కలిగియున్నాయి. ఇంతేగాక, మా గ్రాఫిక్ డిజైనర్లు, ఉదాహరణలను ఇచ్చువారు, మరియు ప్రొడ్యుసర్లు అద్భుతమైన పరికరములను మరియు టెక్నిక్లను ఉపయోగించి ఉన్నతమైన ప్రమాణములతో పనిచేస్తారు.

మా డిస్ట్రిబ్యూషన్ లక్ష్యములను చేధించుటకు, సంఘములతో, సెమినారీలతో, బైబిల్ కళాశాలలతో, మిషనరీలతో, క్రైస్తవ బ్రాడ్కాస్టర్లతో, శాటిలైట్ టెలివిజన్ వారితో, మరియు ఇతర సంస్థలతో థర్డ్ మిలీనియం వ్యూహాత్మక భాగస్వామ్యములను కలిగియున్నది. ఈ భాగస్వామ్యములు ఇప్పటికే లెక్కలేనన్ని వీడియో పాఠములను స్థానిక నయాకులు, కాపరులు, మరియు సెమినరీ విద్యార్థులకు పంచుటకు

కారణమైయ్యాయి. మా వెబ్సైటులు కూడా డిస్ట్రిబ్యూషన్ కు మాధ్యమాలుగా ఉండి, మా పాఠములతో పాటుగా సహాయకరముగా ఉండుటకు అదనపు వనరులను కూడా అందించుచున్నవి. ఉదాహరణకు, మీ సొంత అధ్యయన సమాజమును ఆరంభించుటను గూర్చిన వనరులు.

థర్డ్ మిలీనియం IRS 501(c)(3) కార్పోరేషన్ గా గుర్తింపుపొందినది. మేము సంఘములు, సంస్థలు, వ్యాపారములు, మరియు ప్రజలు వ్యక్తిగతంగా ఇచ్చు టాక్స్-మినహాయింపైన కానుకల మీద ఆధారపడి పనిచేస్తాము. మా పరిచర్యలను గూర్చి అదనపు సమాచారము కొరకు మరియు మీరు మాతో కలసి పరిచర్య చేయు మార్గములను తెలుసుకొనుటకు, ఈ వెబ్సైటును దర్శించండి http://thirdmill.org.

# విషయ సూచిక

ఉపోద్ఘాతము .......... 1
నిత్యత్వము .......... 2
దైవత్వము .......... 2
స్పష్టమైన కథనములు .......... 3
పాత నిబంధన .......... 3
దైవిక గుణములు .......... 4
త్రిత్వము .......... 5
సత్తాశాస్త్ర .......... 6
మితవ్యయ సంవిధానం .......... 7
ఆలోచన .......... 8
సృష్టి .......... 11
సృష్టి వారము .......... 12
మానవాళి యొక్క పతనము .......... 16
వ్యక్తిగత పరిణామాలు .......... 17
సార్వత్రిక పరిణామాలు .......... 23
మానవాళి కొరకు నిరీక్షణ .......... 26
విమోచనము .......... 27
హేతువు .......... 27
త్రిత్వము .......... 28
సృష్టి .......... 30
విశ్వాసులు .......... 31
వాగ్దానములు .......... 31
కార్యము .......... 34
దేవుని రాజ్యమును ఆరంభించుట .......... 35
విధేయత .......... 36
పునరుత్థానము .......... 38
ఆరోహణము .......... 38
ముగింపు .......... 40
యేసు రాకడ .......... 41
సంఘటనలు .......... 42
సాధారణ పునరుత్థానము .......... 42
అంతిమ తీర్పు .......... 43
సృష్టి నూతనపరచబడుట .......... 44
ఫలితములు .......... 46



వీడియోలు, అధ్యయన మార్గదర్శిలు, మరియు ఇతర నిధుల కొరకు థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్ ను thirdmill.org నందు సందర్శించండి.

దేవుని మహిమ ........................................................................................ 47
విమోచనా ఆనందము ................................................................................ 50
**ముగింపు ........................................................................................................ 51**



వీడియోలు, అధ్యయన మార్గదర్శిలు, మరియు ఇతర నిధుల కొరకు థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్ ను thirdmill.org నందు సందర్శించండి.

# యేసును నమ్ముచున్నాము

మొదటి పాఠము

విమోచకుడు

## ఉపోద్ఘాతము

ఒక ఆట పడవను నిర్మించిన బాలుని గూర్చి ఒక పాత కథ ఉన్నది. ఆ పడవకు జాగ్రత్తగా రంగులు వేసి దానికి చిన్న తెరచాపలను నిర్మించాడు. ఆ పడవ సిద్ధమైన తరువాత, దానిని ఒక కాలువలోనికి వదిలాడు. అది కొంత సమయము చాలా చక్కగా ప్రయాణించిన తరువాత నీటి ఉరవడికి కొట్టుకుపోయింది. ఆ బాలుడు పడవ కొరకు చాలా వెదికాడుగాని, అది దొరకలేదు. కొంతకాలం తరువాత, తాను తయారుచేసిన ఆ పడవను ఒక అంగడి అలమరలో చూసి ఆశ్చర్యపోయాడు. ఆ బాలుడు లోనికి పరుగెత్తుకెళ్లి, "నా పడవ ఆ అలమరలో ఉంది!" అని అన్నాడు. "క్షమించాలి బాబు, అది నీకు కావాలంటే దాని వెల చెల్లించాలి" అని అంగడిలో కూర్చున్న వ్యక్తి అన్నాడు. ఆ పడవను తిరిగి కొనుటకు కావలసిన డబ్బును సంపాదించుటకు, ఆ బాలుడు కొన్ని వారములు పని చెయ్యాల్సివచ్చింది. ఆ పడవను కొని, అంగడిలో నుండి బయటకు వస్తూ, "చిన్న పడవా, మరలా నువ్వు నా దానవయ్యావు. నేను నిన్ను తాయారు చేశాను, నీ కొరకు వెతికాను, నిన్ను తిరిగికొన్నాను," అని ఆ బాలుడు అన్నాడు.

అనేక విధాలుగా, యేసు మరియు ఆయన ప్రజలకు మధ్య ఉన్న అనుబంధము ఈ చిన్న బాలుడు మరియు పడవకు మధ్య ఉన్న అనుబంధమును పోలియున్నది. దేవుని కుమారుడు మనలను చేశాడు, కాని మనము పాపములో పడిపోయి దారి తప్పిపోయాము. అయితే ఆయన మనలను ఎన్నడూ మరచిపోలేదు. నశించినవారిని వెదకి రక్షించుటకు ఆయన ఈ భూమి మీదికి వచ్చాడు. ఆయన మనలను కనుగొన్న తరువాత, మనలను విమోచించుటకు కావలసిన మూల్యమును ఆయన చెల్లించాడు — ఆయన సొంత మరణము అను వెల.

*యేసును నమ్ముచున్నాము* అనే మన పాఠ్యక్రమములో ఇది మొదటి పాఠం. ఈ పాఠ్యక్రమములో, క్రీస్తు శాస్త్రము, అనగా క్రీస్తు సిద్ధాంతము, అని పిలువబడు వేదాంతశాస్త్ర శాఖను గూర్చి మనము నేర్చుకుందాము. ఈ పాఠములన్నిటిలో, కొన్ని వేల సంవత్సరాలుగా క్రీస్తు అనుచరులు ఉద్ఘాటించిన యేసు క్రీస్తు యొక్క వ్యక్తిత్వము మరియు కార్యములను గూర్చిన వేర్వేరు సత్యములను మనము పరిశీలన చేద్దాము. మొదటి పాఠమైన దీనికి మేము "విమోచకుడు" అని పేరు పెట్టాము, ఎందుకంటే యేసు పాపులను పాపము నుండి విమోచించి, తండ్రి మహిమ కొరకు మరియు మన ఆనందము కొరకు ఆయన తుదకు సృష్టిని పునరుద్ధరించు విధానము మీద దృష్టిపెడతాము.

విమోచకుడైన యేసు అను ఈ పాఠంలో, దేవుని కుమారుడైన యేసుక్రీస్తు యొక్క వ్యక్తిత్వము మరియు కార్యములను నాలుగు వేర్వేరు కాలములలో పరిగణిద్దాము. మొదటిగా, లోకము సృజించబడక ముందు నిత్యత్వములో ఆయన ఉనికి మరియు ప్రణాళికను చూద్దాము. రెండవదిగా, సృష్టి యొక్క ఆరంభ కాలములో ఆయన కార్యములను గూర్చి సమీక్ష చేద్దాము. మూడవదిగా, మానవాళి పాపములోనికి పడినది మొదలుకొని నేటి యుగము వరకు విస్తరించిన విమోచనా యుగమును గూర్చి మాట్లాడదాము. మరియు నాల్గవదిగా, ఆయన తిరిగి వచ్చినప్పుడు సంభవించు చరిత్ర యొక్క ముగింపును పరిశీలిద్దాము. నిత్యత్వముతో ఆరంభిద్దాము.



వీడియోలు, అధ్యయన మార్గదర్శిలు, మరియు ఇతర నిధుల కొరకు థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్ ను thirdmill.org నందు సందర్శించండి.

# నిత్యత్వము

క్రైస్తవులమైన మనము యేసును గూర్చి ఆలోచన చేయునప్పుడు మరియు మాట్లాడునప్పుడు అనేకసార్లు, ఆయన భూమి మీద నివసించిన జీవితము మీద, పరలోకములో ఆయన ప్రస్తుతము చేయుచున్న కార్యము మీద ఎక్కువ దృష్టిపెడతాము. మరికొన్నిసార్లు భవిష్యత్తులో ఆయన తిరిగివచ్చినప్పుడు యేసు చేయు కార్యములను గూర్చి బైబిలు బోధను కూడా పరిగణిస్తాము. ఇవన్నీ చాలా ప్రాముఖ్యమైన బోధనలే. కాని వాస్తవమేమిటంటే, యేసు క్రీస్తుగా మనకు సుపరిచితమైన త్రిత్వములోని రెండవ పురుషమూర్తి మన నిత్య దేవుడైయున్నాడు. కాబట్టి, ఒక వేదాంతశాస్త్ర దృష్టికోణము నుండి ఆయనను గూర్చి మనము ఆలోచన చేసినప్పుడు, చరిత్రలో మునుపటి కాలము నుండి ఆరంభించుట, చరిత్ర యొక్క ఆరంభమునకు ముందు నుండే చరిత్ర అంతటిలో మన విమోచన కొరకు ఆయన ప్రణాళిక వేయుచున్నాడు మరియు కార్యము చేయుచున్నాడు అని చూచుట సహాయకరముగా ఉంటుంది.

సర్వలోకము యొక్క సృష్టికి ముందు ఉన్న నిత్యత్వము యొక్క స్వభావమును గూర్చి వేదాంతవేత్తల మధ్య సంపూర్ణ సమ్మతి లేదు. సమయము స్వయంగా సృష్టిలో ఒక భాగము కాబట్టి, దేవుడు సృష్టిని చేయుటకు ముందు ఉన్న కాలమును గూర్చి మాట్లాడుట అసాధ్యమని కూడా కొందరు సూచిస్తారు. కాబట్టి, ఈ పాఠంలో, విశ్వమును సృజించుటకు ముందు దేవుని యొక్క ఉనికిగా నిత్యత్వమును గుర్తించుదాము. నిత్యత్వములో, దేవుడు మాత్రమే ఉనికిలో ఉండెను. మరియు ఆయన తండ్రి, కుమార, పరిశుద్ధాత్మలుగా త్రిత్వములో ఉనికిలో ఉండెను.

నిత్యత్వమును గూర్చిన మన చర్చ మూడు భాగములుగా విభాగించబడుతుంది. మొదటిగా, క్రీస్తు దైవత్వమును గూర్చి బైబిలు బోధను పరీక్షిద్దాము. రెండవదిగా, త్రిత్వములో ఆయన పాత్రను మనము చూద్దాము. మరియు మూడవదిగా, ఆయన నిత్య ఆలోచనను మనము వివరిద్దాము. దేవుని కుమారుడైన యేసు క్రీస్తు యొక్క దైవత్వముతో ఆరంభిద్దాము.

## దైవత్వము

ఇప్పుడు, బైబిలు నిత్యత్వము నుండి ఉనికిలో లేదు. అది కాలము మరియు చరిత్రలో వ్రాయబడినది. మరియు క్రొత్త నిబంధన ఆరంభమయ్యే వరకు యేసును త్రిత్వములో ఒక విభిన్నమైన పురుషమూర్తి అని అది స్పష్టముగా బయలుపరచదు. అయినను, యేసు నిత్యత్వము నుండి దేవుడైయున్నాడని లేఖనము బోధిస్తుంది. కాబట్టి, ఆయన దైవత్వమును గూర్చి క్రొత్త నిబంధనలో లేఖనము బయలుపరచు విషయములు సర్వలోకమును సృజించక ముందు కూడా ఆయన కలిగియున్నాడు. మరియు నిత్యమూ ఆయన వాటిని కలిగియుంటాడు. హెబ్రీ. 13:8లో ఇలా వ్రాయబడియున్నది:

> **యేసుక్రీస్తు నిన్న, నేడు, ఒక్కటేరీతిగా ఉన్నాడు; అవును యుగయుగములకును ఒక్కటే రీతిగా ఉండును (హెబ్రీ. 13:8).**

యేసు దైవత్వము క్రొత్త నిబంధనలో అనేక విధాలుగా స్పష్టము చేయబడింది. మొదటిగా, ఆయన దైవత్వమును గూర్చి లేఖనములో అనేక స్పష్టమైన కథనములు ఉన్నాయి. రెండవదిగా, ఆయన దైవత్వమును బయలుపరచు విధముగా క్రొత్త నిబంధన లేఖనములు పాత నిబంధనను ఆయనకు అన్వయిస్తాయి. మరియు మూడవదిగా, కొన్ని లేఖన భాగములు ఆయనకు దైవిక గుణములను ఆపాదిస్తాయి. యేసు దైవత్వమునకు అనేక రుజువుల యొక్క ఉదాహరణలను స్పష్టమైన కథనములతో ఆరంభించి ఒక్కొక్కటిగా చూద్దాము.

## స్పష్టమైన కథనములు

ఆయనను సూటిగా దేవుడు అని సంబోధిస్తూ అనేక లేఖన భాగములు యేసు దైవత్వమును గూర్చి స్పష్టముగా బోధిస్తున్నాయి. ఉదాహరణకు, యోహాను 20:28లో, అపొస్తలుడైన తోమా యేసును "నా దేవా" అని పిలచాడు. తీతు 2:13లో, పౌలు యేసును "మన మహాదేవుడును మన రక్షకుడైన యేసుక్రీస్తు" అని పిలుస్తున్నాడు. 2 పేతురు 1:1లో, పేతురు యేసును "మన దేవుని యొక్కయు రక్షకుడైన యేసుక్రీస్తు యొక్కయు" అని పిలుస్తున్నాడు. మరియు 1 యోహాను 5:20లో, యోహాను యేసును "నిజమైన దేవుడును నిత్యజీవమునైయున్న" అని పిలుస్తున్నాడు. అయితే యేసుకు దైవత్వ గుణములను స్పష్టముగా ఆపాదించు సుపరిచితమైన లేఖనభాగము యోహాను 1:1, అక్కడ మనము ఈ మాటలను చదువుతాము:

> ఆదియందు వాక్యముండెను, వాక్యము దేవుని యొద్ద ఉండెను, వాక్యము దేవుడై యుండెను (యోహాను 1:1).

"వాక్యము దేవుడైయుండెను" అని, ఆయన ఆది నుండి అనగా లోకము సృష్టింపబడక ముందు నుండి దేవుడైయుండెను అని ఈ వచనము స్పష్టముగా చెబుతుంది. ఈ అధ్యాయములోని తరువాత భాగము, అనగా 14-18 వచనాలలో, తాను మాట్లాడుతున్న ఆ వాక్యము క్రీస్తే అని యోహాను స్పష్టముగా తెలియపరుస్తున్నాడు. ఈ విధముగా, యేసు దేవుడు అనుటలో యోహాను ఎలాంటి సందేహమును చూపలేదు. ఆయన ఎల్లప్పుడూ అన్ని విధాలుగా సంపూర్ణముగా దేవుడైయున్నాడు.

## పాత నిబంధన

రెండవదిగా, యేసు దేవుడు అని స్పష్టమైన ప్రకటనలు చేయుటతో పాటుగా, దేవునిని గూర్చి అనేక పాత నిబంధన సంబోధనలను ఉపయోగించు విధముగానే క్రొత్త నిబంధన కూడా యేసు యొక్క దైవత్వమును కనుపరచుతుంది.

అనేక సందర్భాలలో, పాత నిబంధనలోని యెహోవాతో ఆయనను సరిపోల్చుతూ క్రొత్త నిబంధన రచయితలు యేసును దేవునిగా గుర్తించారు. పాత నిబంధనలో, దేవుడు యెహోవా నామము ద్వారా తనను తాను ప్రజలకు బయలుపరచుకున్నాడు, దీనిని సాధారణంగా "ప్రభువు" అని అనువదించవచ్చు. క్రొత్త నిబంధనలోని అనేక చోట్ల, ప్రభువైన యెహోవాకు సంబంధించిన లేఖనభాగములను స్పష్టముగా సంబోధిస్తూ, అవి యేసును గూర్చి మాట్లాడుచున్నవని చెప్పారు.

ఉదాహరణకు, మార్కు 1:2-3 మలాకీ 3:1 మరియు యెషయా 40:3ను సంబోధిస్తూ, ప్రభువు వచ్చుటకు ముందు ఒక ప్రవక్త లేక సందేశకుడు వస్తాడని చెప్పాడు. అయితే బాప్తిస్మమిచ్చు యోహాను యేసు కొరకు మార్గమును సరాళము చేసినప్పుడు ఈ ప్రవచనములు నెరవేర్చబడ్డాయని మార్కు చెప్పాడు. ఈ విధముగా, మలాకీ మరియు యెషయా ప్రవచించిన ప్రభువైన యెహోవా యేసేనని మార్కు సూచిస్తున్నాడు.

యేసు మరియు యెహోవాకు మధ్య ఇంచుమించు ఇలాంటి అనుబంధమునే ఫిలిప్పీ 2:11లో పౌలు చూపుతూ, ప్రాథమిక క్రైస్తవ ప్రకటనయైన యేసే ప్రభువు అను విషయమును ప్రస్తావిస్తున్నాడు. మరియు యోహాను 1:1-3లో, ఆదియందు దేవుడు లోకమును సృజించిన దేవుని వాక్యముగా యోహాను యేసును గుర్తిస్తున్నాడు. ఇది ఆది. 1:1 యొక్క స్పష్టమైన ప్రకటనగా ఉంది, అక్కడ మోషే "ఆదియందు దేవుడు భూమ్యాకాశములను సృజించెను" అని వ్రాశాడు. సృష్టిలో యేసు యొక్క పాలుపంపులను గూర్చిన ఈ సంబోధన, ఆయన నిజముగా దేవుడు అని సూచిస్తుంది.

### దైవిక గుణములు

మూడవదిగా, యేసు దేవుడని నిర్ధారించుటకు స్పష్టమైన ప్రకటనలను మరియు పాత నిబంధనను ఉపయోగించుటతో పాటుగా, క్రొత్త నిబంధన రచయితలు ఆయనకు దైవిక గుణములను కూడా ఆపాదించారు — కేవలం దేవుడు మాత్రమే కలిగియుండదగిన గుణములు. ఉదాహరణకు, హెబ్రీ. 1:3లో ఇలా వ్రాయబడియున్నది:

> **ఆయన దేవుని మహిమ యొక్క తేజస్సును, ఆయన తత్వము యొక్క మూర్తిమంతమునైయుండి, తన మహత్తుగల మాటచేత సమస్తమును నిర్వహించుచు (హెబ్రీ. 1:3).**

ఇక్కడ, కుమారుడు దేవునితోను, ఆయన మహిమతోను కుమారుని దైవత్వమును రుజువుచేయు విధముగా సరిపోల్చబడ్డాడు. అంతేగాక, కుమారునిలో దేవుని యొక్క అపరిమితమైన సృజనాత్మక శక్తి మరియు కొనసాగించు శక్తి ఉన్నాయి. ఏ పరిమిత మానవమాత్రుడు కూడా అపరిమితమైన శక్తిని కలిగియుండలేడు; కేవలం అపరిమితమైన దేవుడు మాత్రమే కలిగియుండగలడు. కాబట్టి, కుమారుడు స్వయంగా దేవుడైయుండవలెను. యోహాను 1:1-2లో ఈ విధముగా చెబుతూ యోహాను యేసు యొక్క దైవత్వమును ఉద్ఘాటించాడు:

> **ఆదియందు వాక్యముండెను, . . . ఆయన ఆది యందు దేవునియొద్ద ఉండెను (యోహాను 1:1-2).**

"ఆదియందు" వాక్యముండెను అని యోహాను చెప్పినప్పుడు, సృష్టికి ముందు నుండే నిత్యత్వములో దేవుడు ఉనికిలో ఉన్నాడని ఆది. 1:1 బోధించు విధముగానే కుమారుడు కూడా సృష్టికి ముందు నుండే నిత్యత్వములో ఉనికిలో ఉన్నాడని చెబుతున్నాడు. మరొక మాటలో, కుమారుడు సృష్టింపబడలేదు. ఆయన నిత్యత్వము నుండి తండ్రియైన దేవునితో కూడా ఉనికిలో ఉన్నాడు. కేవలం

దేవుడు మాత్రమే నిత్యము ఉనికిలో ఉండు గుణమును కలిగియుండగలడు కాబట్టి, కుమారుడు కూడా దేవుడైయుండాలి.

క్రీస్తులో సంపూర్ణ దైవత్వము ఉన్నదని మనము చూశాము కాబట్టి, త్రిత్వములో కుమారుడు మరియు ఇతర పురుషమూర్తులకు మధ్య ఉన్న అనుబంధాలను చూచుటకు మనము సిద్ధముగా ఉన్నాము.

## త్రిత్వము

త్రిత్వ సిద్ధాంతము క్రైస్తవ విశ్వాసమునకు అత్యంత ప్రాముఖ్యమైన అంశముగా ఉన్నది. ఒక వైపున, దేవుడు మన అవగాహనా సామర్థ్యమునకు ఎంతో మించినవానిగా ఉన్నాడని త్రిత్వ సిద్ధాంతము బోధిస్తుంది. దేవుడు ఆశ్చర్యకరునిగాను అద్భుతమైనవానిగాను ఉన్నాడు కాబట్టి ఆయనను ఆరాధించునట్లు ఇది మనలను పురికొల్పాలని త్రిత్వ సిద్ధాంతము మనకు బోధిస్తుంది. కాని మరొక వైపున, ఈ సిద్ధాంతము క్రైస్తవ్యమును ఇతర మతముల కంటే భిన్నముగా చూపుతుంది. కొన్ని మతములు దేవుని ఒకనిగా మాత్రమే చూస్తే, మరికొన్ని అనేక దేవుళ్లను విశ్వసిస్తాయి, కాని లేఖన సిద్ధాంతమైన త్రిత్వము దేవుడు ఒక భావనలో ముగ్గురిగాను, మరొక భావనలో ఒకనిగాను ఉన్నాడని బోధిస్తుంది. చారిత్రికముగా, ఈ విశేషమైన క్రైస్తవ సిద్ధాంతము మనము క్రీస్తును అంగీకరించుటకు మూలాధారముగా ఉండినది.

త్రిత్వము అను పదము బైబిలులో కనిపించదుగాని, దేవునిలో ముగ్గురు పురుషమూర్తులు ఉన్నారుగాని, ఒకే సారము ఉన్నది అనే బైబిలు ఆలోచనను అది వ్యక్తపరుస్తుంది. 'పురుషమూర్తి" అనే పదము ఒక ప్రత్యేకమైన, స్వయంచైతన్యముగల, వ్యక్తిగతమైన మూర్తిమత్వమును సంబోధిస్తుంది. దేవునిలోని ముగ్గురు పురుషమూర్తులు తండ్రి, కుమార, పరిశుద్ధాత్మలు అని లేఖనము బోధిస్తుంది. 'సారము' అనే పదము దేవుని ప్రాథమిక స్వభావమును లేక ఆయన కలిగియున్న అభౌతిక పదార్థమును సూచిస్తుంది.

> తండ్రియైన దేవుడు, కుమారుడైన దేవుడు, మరియు పరిశుద్ధాత్మ దేవుడు అను ముగ్గురు పురుషమూర్తుల ఐక్యతలో ఏకైక దేవుడు నిత్యత్వము నుండి ఉనికిలో ఉన్నాడని క్రైస్తవ త్రిత్వ సిద్ధాంతము బోధిస్తుంది. దేవుని గూర్చి ఈ అవగాహనను పొందుకొనుటకు క్రైస్తవులు కొన్ని శతాబ్దాల పాటు లేఖనాలతో పాటు పడవలసివచ్చింది. ఈ సిద్ధాంతము యొక్క అభివృద్ధికి ఆరంభము తిరిగిలేచిన మరియు మహిమపరచబడిన క్రీస్తును ఆదిమ క్రైస్తవ సంఘము ఆరాధించుటతో జరిగింది; యేసు దేవుడు అని లేఖనములు స్పష్టముగా బోధిస్తాయి. కుమారుడు కూడా తండ్రితో ఒకే స్వభావము కలిగియున్నాడని చెప్పుట ద్వారా వారు దీనిని వ్యక్తపరచారు. అయితే క్రైస్తవులు క్రీస్తును ఆరాధించుట మరియు దేవుని యొక్క ఏకత్వము మధ్య సంధి ఎలా చేయగలిగారు? ఇక్కడ వ్యక్తిత్వము మరియు స్వభావము మధ్య వ్యత్యాసము చూపుట మూలమైయున్నది. తండ్రియైన దేవుడు మరియు కుమారుడైన దేవుడు ఉనికిలో ఏకమైయున్నను వ్యక్తిత్వములో వేరుగా

ఉన్నారని ఉద్ఘాటించునట్లు ఆదిమ క్రైస్తవులు లేఖనము ద్వారా పురికొల్పబడ్డారు. సారాంశంలో, ఒకే దేవుడు తండ్రి, కుమార, పరిశుద్ధాత్మ అను ముగ్గురు పురుషమూర్తులలో నిత్యత్వములో నుండి ఉనికిలో ఉన్నాడు.

— డా. కీత్ జాన్సన్

వేదాంతవేత్తలు త్రిత్వమును సాధారణంగా రెండు దృష్టికోణముల నుండి వివరించారు. ఒక వైపున, వారు త్రిత్వములోని సభ్యుల మధ్య ఉన్న సత్తాశాస్త్ర అనుబంధాలను గూర్చి మాట్లాడారు. మరొక ప్రక్క వారు, మితవ్యయ సంవిధాన అనుబంధాలను గూర్చి మాట్లాడారు. త్రిత్వములో ఉన్న సత్తాశాస్త్ర అనుబంధములతో ఆరంభించి ఈ రెండు ఆలోచనలను క్లుప్తంగా చూద్దాము.

## సత్తాశాస్త్ర

"సత్తాశాస్త్ర" అనే పదం "అస్తిత్వమునకు సంబంధించిన" అని అర్థమునిస్తుంది. కాబట్టి, త్రిత్వములోని పురుషమూర్తుల మధ్య ఉన్న సత్తాశాస్త్ర అనుబంధములను మనము పరిగణించినప్పుడు, వారు ఒకరితో ఒకరు ఎలా ఏకమైయున్నారు, మరియు వారు ఏక దైవిక సారమును లేక స్వభావమును ఎలా పంచుకొనుచున్నారు అను విషయముల మీద దృష్టిపెడతాము. దేవునిలోని పురుషమూర్తులు ముగ్గురు ఒకే దైవిక సారమును పంచుకొనుచున్నారు కాబట్టి, వారు అమితత్వము, నిత్యత్వము, మరియు మార్పులేనితనము వంటి ఒకే దైవిక గుణములను కలిగియున్నారు.

ఫిలిప్పీ. 2:5-8లో త్రిత్వములోని ఈ అంశమును గూర్చి పౌలు ఈ విధముగా మాట్లాడాడు:

> క్రీస్తుయేసు . . . దేవుని స్వరూపము కలిగినవాడైయుండి, దేవునితో సమానముగా ఉండుట విడిచిపెట్టకూడని భాగ్యమని యెంచుకొనలేదు గాని మనుష్యుల పోలికగా పుట్టి, దాసుని స్వరూపమును ధరించుకొని, తన్ను తానే రిక్తునిగా చేసికొనెను. మరియు, ఆయన ఆకారమందు మనుష్యుడుగా కనబడి, మరణము పొందునంతగా, అనగా సిలువమరణము పొందునంతగా విధేయత చూపినవాడై, తన్నుతాను తగ్గించుకొనెను. (ఫిలిప్పీ. 2:5-8)

ఈ వాక్యభాగము యేసును గూర్చి అనేక విషయములను చెబుతుంది. అయితే "దేవుని స్వరూపము కలిగినవాడైయుండి" అను ప్రకటన మీద దృష్టిపెడదాము. ఈ కథనములో, కుమారుడు తండ్రియైన దేవుని యొక్క స్వభావమును లేక సారమును పంచుకొనుచున్నాడని పౌలు స్పష్టముగా బోధించాడు. పరిశుద్ధాత్మ విషయములో కూడా ఇదే సత్యమని ఇతర లేఖన భాగములు సూచించుచున్నాయి. వీరంతా ఒకే దైవిక అస్తిత్వము కలిగినవారైయున్నారు. యోహాను 10:30లో యేసు ఇలా సెలవిచ్చాడు:

> నేనును తండ్రియును ఏకమైయున్నాము (యోహాను 10:30)

యేసు చేసిన ఈ ఆశ్చర్యకరమైన ప్రకటనను వినిన అవిశ్వాసులు ఆయన తనను తాను దేవుడు అని పిలచుకొనుచున్నాడని అర్థము చేసుకొని, దైవదూషణ చేసినందుకు ఆయనను రాళ్లతో కొట్టాలనుకున్నారు.

సత్తాశాస్త్ర త్రిత్వమును గూర్చి బైబిలు చేయుచున్న బోధను మనము పరిగణించాము గనుక, ఇప్పుడు త్రిత్వములో మితవ్యయ సంవిధాన అనుబంధములను గూర్చి లేఖనములు ఏమి చెబుతున్నాయో చూద్దాము.

## మితవ్యయ సంవిధానం

"మితవ్యయ సంవిధానం" అనే పదము, "గృహనిర్వాహకత్వమునకు సంబంధించిన" అని అర్థమునిస్తుంది. కాబట్టి, త్రిత్వములోని మితవ్యయ అనుబంధములను గూర్చి మనము మాట్లాడునప్పుడు, వేర్వేరు పురుషమూర్తులుగా తండ్రి, కుమార పరిశుద్ధాత్మలు ఒకరితో ఒకరు ఎలాంటి అనుబంధం కలిగియుంటారు మరియు ఎలా సంభాషించుకుంటారు అనే విషయము మీద మనము ఆసక్తి చూపుచున్నాము. మనము ఇంతకు ముందు చూసినట్లుగా, సత్తాశాస్త్ర దృష్టికోణములో, కుమారుడు తండ్రి మరియు పరిశుద్ధాత్మ కలిగియున్న అదే దైవిక సారమును కలిగియున్నాడు. అయితే వారి మితవ్యయ అనుబంధముల లోపల, కుమారుడు తండ్రి చిత్తమునకు అప్పగించుకొనుచున్నాడు, మరియు పరిశుద్ధాత్మ మీద అధికారము కలిగియున్నాడు. యోహాను 6:38లో యేసు సెలవిచ్చినట్లు:

> నా యిష్టము నెరవేర్చుకొనుటకు నేను రాలేదు; నన్ను పంపిన వాని చిత్తము నెరవేర్చుటకే పరలోకము నుండి దిగి వచ్చితిని (యోహాను 6:38).

యోహాను 8:28-29లో ఆయన సెలవిచ్చినట్లు:

> నా అంతట నేనే యేమియు చేయక, తండ్రి నాకు నేర్పినట్టు ఈ సంగతులు మాటలాడుచున్నాననియు మీరు గ్రహించెదరు. నన్ను పంపినవాడు నాకు తోడైయున్నాడు; ఆయన కిష్టమైన కార్యము నేనెల్లప్పుడును చేయుదును గనుక ఆయన నన్ను ఒంటరిగా విడిచిపెట్టలేదు (యోహాను 8:28-29).

త్రిత్వము యొక్క మితవ్యయములో, కుమారుడు ఎల్లప్పుడూ తండ్రి అధికారమునకు చిత్తమునకు ఆధీనములో ఉంటాడు. తండ్రికి కుమారుని మీద అధికారము ఉన్నట్లే, తండ్రి కుమారులకు పరిశుద్ధాత్మ మీద అధికారము ఉన్నది. యోహాను 15:26లో ఈ విధముగా చెబుతూ, కుమారుడు పరిశుద్ధాత్మ మీద తాను కలిగియున్న అధికారమును గూర్చి మాట్లాడాడు:

> తండ్రి యొద్ద నుండి మీ యొద్దకు నేను పంపబోవు ఆదరణకర్త . . . వచ్చినప్పుడు, ఆయన నన్ను గూర్చి సాక్ష్యమిచ్చును (యోహాను 15:26).

కుమారుని పంపుటకు తండ్రి అధికారము కలిగియుండినట్లే, ఆత్మను పంపు అధికారము కుమారుడు కలిగియుండెను.



వీడియోలు, అధ్యయన మార్గదర్శిలు, మరియు ఇతర నిధుల కొరకు థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్ ను thirdmill.org నందు సందర్శించండి.

ఇప్పుడు, త్రిత్వములోని పురుషమూర్తుల మధ్య ఏనాడు ఎలాంటి సంఘర్షణ జరగలేదు. తండ్రి, కుమార, పరిశుద్ధాత్మలు ఎల్లప్పుడూ సమ్మతిస్తారు. వారు ఏక మనస్సుగలవారు. ఇదే విధముగా, వారి అనుబంధముల యొక్క మితవ్యయ సంవిధానములో, ఒక స్పష్టమైన వరుస క్రమము ఉంది, మరియు తండ్రి సర్వోన్నత అధికారము కలిగియుంటాడు, తరువాత కుమారుడు, మరియు తుదకు పరిశుద్ధాత్మ అధికారం కలిగియుంటారు.

త్రిత్వము యొక్క స్వభావమును మరియు త్రిత్వములోని పురుషమూర్తుల మధ్య ఉన్న అనుబంధాలను పూర్తిగా అర్థము చేసుకొనుట మనకు అసంభవమైన పని. లేఖనము బయలుపరచు విషయములు సత్యమని విశ్వాసము ద్వారా మనకు తెలుసు. కాని త్రిత్వములోని అనేక విషయములు మన ఆలోచనకు మించినవని మనము ఒప్పుకోవాలి. ఈ విధంగా, మన రక్షణ కొరకు త్రిత్వములోని సభ్యులంతా కలసి పని చేస్తారనే సత్యములో మనము ఎంతో ఆదరణను ప్రోత్సాహమును పొందుకోవచ్చు. కుమారుడు చేసిన ప్రాయశ్చిత్తము ద్వారా తండ్రి మనలను క్షమిస్తాడు. మనలను పునరుజ్జీవపరచుటకు, మన రక్షణను పరిపూర్ణము చేయుటకు కుమారుడు తిరిగివచ్చునంత వరకు మన జీవితాలను నూతనపరచుటకు తండ్రి కుమారులిరువురు ఆత్మను పంపుతారు.

యేసు యొక్క దైవత్వమును మరియు త్రిత్వమును చూచుట ద్వారా నిత్యత్వములో యేసు యొక్క వ్యక్తిత్వము మరియు కార్యమును మనము పరిశీలించాము. కాబట్టి, ఇప్పుడు ఆయన నిత్య ఆలోచనను పరిశీలన చేద్దాము.

## ఆలోచన

నిత్య ఆలోచన అను వేదాంత పదము, చాలాసార్లు "నిత్య శాసనము" అని పిలువబడుతుంది, మరియు ఇది సృష్టిని చేయుటకు ముందు సర్వలోకము కొరకు దేవుడు నియమించిన ప్రణాళికలను సంబోధిస్తుంది. అపొ. 2:23, రోమా. 8:28-30, మరియు 1 పేతురు 1:2 వంటి చోట్ల దేవుని నిత్య ఆలోచన ప్రస్తావించబడింది.

దేవుని ప్రణాళికల యొక్క స్వభావము మరియు ప్రభావమును గూర్చి పలు వేదాంతశాస్త్ర పరంపరలు పలు నమ్మకములను కలిగియున్నాయి. దేవుని నిత్య ప్రణాళికలో చరిత్రలోని ప్రతి సూక్ష్మ వివరణ కూడా మిళితమైయున్నదని కొందరు నమ్ముతారు. దేవుడు కొన్నిటిని మాత్రమే నిర్ణయించాడుగాని అన్నిటిని కాదు అని ఇతరులు నమ్ముతారు. అయితే క్రీస్తు సాధించినది దేవుని ప్రణాళికలో కేంద్ర భాగముగా ఉన్నదని మనమంతా ఒప్పుకుంటాము — దేవుడు ఆయనలో రక్షణను అనుగ్రహించాడని, మరియు క్రీస్తు ఎన్నడును మాట తప్పడని. ఎఫెసీ. 1:6, 11-12లో మనము చదువునట్లుగా:

> మనము తన [దేవుని] యెదుట పరిశుద్ధులమును నిర్దోషులమునై యుండవలెనని జగత్తు పునాది వేయబడకమునుపే, ప్రేమచేత ఆయన క్రీస్తులో మనలను ఏర్పరచుకొనెను . . . మరియు క్రీస్తునందు ముందుగా నిరీక్షించిన మనము తన మహిమకు కీర్తికలుగజేయవలెనని, దేవుడు తన చిత్తప్రకారమైన

> సంకల్పమునుబట్టి మనలను ముందుగా నిర్ణయించి, ఆయన యందు స్వాస్థ్యముగా ఏర్పరచెను (ఎఫెసీ. 1:6, 11-12).

క్రీస్తులో దేవుడు చేసిన కార్యము ఒక దుర్ఘటన కాదు లేక అనుకోకుండా ఎదురైన ఒక ప్రశ్నకు పరిష్కారం కాదు; అది దేవుని నిత్య శాసనము ద్వారా నిర్ణయించబడింది. ఇప్పుడు, క్రీస్తును గూర్చి దేవుని యొక్క నిత్య ఆలోచనను గూర్చి మనము ఆలోచన చేయుచుండగా, రెండు విషయముల మధ్య వ్యత్యాసము చూపుట ఉపయోగకరముగా ఉంటుంది: భవిష్యద్ జ్ఞానము మరియు ఉద్దేశము. యెషయా 46:10లో దేవుని నిత్య ఆలోచన యొక్క ఈ రెండు అంశములు స్పష్టముగా కనిపిస్తాయి. దేవుడు చెప్పిన మాటలను వినండి:

> నా ఆలోచన నిలుచుననియు నా చిత్తమంతయు నెరవేర్చుకొనెదననియు,
> చెప్పుకొనుచు ఆది నుండి నేనే కలుగబోవువాటిని తెలియజేయుచున్నాను.
> పూర్వకాలమునుండి నేనే యింక జరుగనివాటిని తెలియజేయుచున్నాను
> (యెషయా 46:10).

ఆయన భవిష్యద్ జ్ఞానమును గూర్చి, ఆరంభము నుండి అనగా లోకమును సృజించక మునుపు నుండి జరుగబోవు సంగతులన్నియు ఆయన ఎరిగియున్నాడని దేవుడు చెబుతున్నాడు. మరియు ఆయన ఉద్దేశమును గూర్చి, "నా ఆలోచన నిలుచుననియు నా చిత్తమంతయు నెరవేర్చుకొనెదననియు" అని ఆయన సెలవిస్తాడు. ఈ రెండు ఆలోచనలను మరింత వివరంగా చూద్దాము.

ఒక వైపు, భవిష్యద్ జ్ఞానము అనే పదమును, చరిత్రలో జరగబోవు విషయములను గూర్చి సృష్టికి ముందు నుండే దేవుడు కలిగియుండిన జ్ఞానమును సంబోధిస్తుంది అని నిర్వచించవచ్చు. తండ్రి, కుమార, పరిశుద్ధాత్ములు సర్వజ్ఞానులైయున్నారు. మరియు వారి జ్ఞానము భవిష్యత్తును కూడా ఎరిగినదిగా ఉన్నది. యెషయా 46:10లో ఈ ఆలోచనను చూచుటతో పాటుగా, యెషయా 42:9, మరియు 45:11-13; మరియు అపొ. 15:17, 18 వంటి చోట్ల కూడా చూడవచ్చు.

మరొక వైపు, సర్వలోకమును సృష్టించుటలో దేవుడు కలిగియుండిన ఉద్దేశమును అనేక విధాలుగా వర్ణించవచ్చు. ఈ పాఠంలో, క్రీస్తులో ఆయన రాజ్యము ద్వారా తన మహిమను కనుపరచి తనను తాను ఘనపరచుకొనుటకు దేవుడు లోకమును సృష్టించాడు అని మనము క్రోడీకరించవచ్చు. కీర్తనలు 145:1-21, 1 తిమోతి 1:17, హెబ్రీ. 1:1-13, 1 పేతురు 1:20-2:9, మరియు ప్రకటన 1:5-6 వంటి అనేక లేఖన భాగములలో ఈ ఉద్దేశము వ్యక్తపరచబడింది.

ఈ మధ్య శతాబ్దములలో, ఆయన రాజ్యమును గూర్చి దేవుడిచ్చిన నిత్య శాసనమును విమోచనా నిబంధన అని వివరించుట సహాయకరముగా ఉంటుంది అని కొంతమంది వేదాంతవేత్తలు కనుగొన్నారు. త్రిత్వములోని పురుషమూర్తులు లోకమును సృష్టించక మునుపే విమోచనను సాధ్యపరచి పడిపోయిన సృష్టి నిమిత్తము దానిని ఉపయోగించాలని ఒక పవిత్రమైన నిర్ణయానికి వచ్చారని లేఖనము సూచిస్తుంది. ప్రత్యేకముగా, పడిపోయిన మానవాళిని పాప పరిణామాల నుండి విమోచించుటకు నరవతారము దాల్చి మరణిస్తానని కుమారుడు వాగ్దానము చేశాడు. మరియు పాపుల విమోచన కొరకు ప్రాయశ్చిత్తముగా కుమారుని బలిని అంగీకరిస్తానని తండ్రి వాగ్దానము చేశాడు. విమోచించబడిన



వీడియోలు, అధ్యయన మార్గదర్శిలు, మరియు ఇతర నిధుల కొరకు థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్ ను thirdmill.org నందు సందర్శించండి.

పాపులకు రక్షణను అన్వయిస్తానని పరిశుద్ధాత్మ వాగ్దానము చేసినట్లు కూడా కొందరు వేదాంతవేత్తలు నమ్ముతారు.

> అది తన ప్రజల కొరకు తండ్రి రక్షణ కార్యమును ఆలోచించు ఒప్పందమైయున్నది. కుమారునికి ఒక శరీరమును అనగా భౌతిక శరీరమును అనుగ్రహించుట ద్వారా కుమారుడు వచ్చి నరవతారము దాల్చునట్లు ఆయన నిర్ధారించాడు. మరియు ఈ లోకమునకు వచ్చి ఆయన జీవితమును సిలువ మీద అర్పించి — అనగా పరిపూర్ణ జీవితమును — సిలువ మీద అర్పించి దేవుని ప్రజల కొరకు ప్రత్యామ్నాయమగుటకు కుమారుడు అంగీకరించాడు. అంతేగాక, క్రీస్తు కార్యమును దేవుని ప్రజలకు అన్వయించుట కొరకు పరిశుద్ధాత్మను పంపుట విమోచనా నిబంధనలో భాగమైయున్నది.
>
> — డా. జెఫ్ లోమాన్

విమోచనా నిబంధన మన అవగాహన కొరకు ప్రాముఖ్యమైయున్నది, ఎందుకంటే తన నరవతారములో యేసు ఇంతకు ముందే చేసిన మరియు చేస్తూ ఉన్న కార్యములను అది ఎత్తి చూపుతుంది మరియు వివరిస్తుంది. విమోచనా నిబంధనలో ఉన్న వాగ్దానములు కీర్తనలు 110, మరియు ఎఫెసీ. 1:3-6 వంటి చోట్ల ప్రస్తావించబడినవి. మరియు 1 పేతురు 1:20, మరియు ప్రకటన 13:8 వంటి చోట్ల ఊహించబడినవి. ఉదాహరణకు, యేసు పలికిన మాటలు యోహాను 6:38-40లో ఇలా ఉన్నాయి:

> నా యిష్టము నెరవేర్చుకొనుటకు నేను రాలేదు; నన్ను పంపిన వాని చిత్తము నెరవేర్చుటకే పరలోకము నుండి దిగి వచ్చితిని. ఆయన నాకు అనుగ్రహించిన దానియంతటిలో నేనేమియు పోగొట్టుకొనక, అంత్యదినమున దాని లేపుటయే నన్ను పంపినవాని చిత్తమైయున్నది. కుమారుని చూచి ఆయనయందు విశ్వాసముంచు ప్రతివాడును నిత్యజీవము పొందుటయే నా తండ్రి చిత్తము; అంత్యదినమున నేను వానిని లేపుదును (యోహాను 6:38-40).

> విమోచన అనునది లోకమును సృష్టించక మునుపు దేవునిలో రూపొందిన నిత్య ఉద్దేశమునకు సంబంధించిన విషయమైయున్నది. దీనిలో మర్మములన్నిటిని మనము వెలికితీయలేము. స్పష్టముగా, దేవుడు అమితమైనవాడు మరియు కొన్ని సంగతులను దేవుడు మనకు బయలుపరచలేదు గనుక అవి మన నుండి మరుగుచేయబడియున్నవి, కాని దీనిని గూర్చి దేవుడు బయలుపరచిన విషయములన్నిటిని మనము అర్థము చేసుకోవాలనుకొనుచున్నాము, మరియు త్రియేక దేవునిలో ఒక నియమము రూపించబడినదని మరియు అది నిత్యత్వములో ఆయన మహిమ యొక్క ప్రకటనగా ఉంటుందని లేఖనమంతటా అనేక సూచనలు ఉన్నాయి. కాబట్టి దేవుడు తప్ప జీవులన్నీ ఆయన మహిమను

> ఆస్వాదిస్తాయి, మరియు ఆ ఆస్వాదింపు నిరంతరము పెరుగుతూనే ఉంటుంది. మరియు ఒక విమోచనా ఉద్దేశము ద్వారా దేవుడు దీనిని చేశాడని, శిక్షార్హులైన మానవులను తీసుకొని వారికి విమోచనను కలిగించుటకు దీనిని చేశాడని లేఖనము సెలవిస్తుంది. కాబట్టి లేఖనముల ప్రకారం, జగత్తుకు పునాది వేయబడక మునుపు, లోకము సృష్టించబడక మునుపు, ఈ నిబంధనా ఏర్పాటు చేయబడినది, దీనిలో తండ్రి ప్రజలను ఎన్నుకుంటాడు, కుమారుడు వచ్చి మరణించి ప్రజలను విమోచిస్తాడు, తరువాత ప్రజలు పాపములను ఒప్పుకొని క్రీస్తును హత్తుకొనునట్లు పాపమను శాపమును తొలగించి పరిశుద్ధాత్ముడు ప్రజలను ఆకర్షిస్తాడు.
>
> — డా. థామస్ నెట్టెల్స్

దేవుని నిత్య ఆలోచన విశ్వాసులందరికీ గొప్ప ఆదరణను కలిగించునదిగా ఉంటుంది. దేవుడు విశ్వమును సృష్టించక ముందు, ఆయన మహిమను కనుపరచుటకు, మరియు ఆయన దయార్ధ పరిపాలనలో మానవాళి నివసించుటకు సౌకర్యవంతమైన స్థానముగా ఉండుటకు ఆయన సృష్టిని రూపించాడు. మరియు ఆయన భవిష్యద్ జ్ఞానము కలిగియున్నాడు కాబట్టి, ఆయనను ఏది ఆశ్చర్యపరచదు. మానవాళి పాపములోనికి పడిపోవుట దేవుని ఆశ్చర్యపరచలేదు. మరియు మన రక్షణ అనుకోకుండా జరిగిన ఒక అపాయముకు ఆయన కనుగొనిన చివరి-నిమిష పరిష్కారము కాదు. భిన్నముగా, ప్రతిది ఆయన ప్రణాళిక ప్రకారంగా జరుగుతుంది. మరియు ఇది ఎంత అద్భుతముగా అనిపించినప్పటికీ, ఇదే దేవుడు — సర్వసృష్టికి సృష్టికర్త మరియు నిర్మాణకుడైన — నజరేయుడైన యేసుగా మానవ రూపం దాల్చాడు. మనలను మరియు సృష్టియావత్తును ఆయన నిత్య ఉద్దేశముల ద్వారా పునరుద్ధరించుటకు ఆయన సృష్టిలోనికి ప్రవేశించాడు.

నిత్యత్వములో కుమారుని గూర్చి మనము చర్చించాము కాబట్టి, సృష్టి యొక్క ఆరంభ కాలము వైపుకు మన దృష్టిని త్రిప్పుదాము.

## సృష్టి

ఈ పాఠంలో మన ఉద్దేశముల కొరకు, సృష్టి యొక్క ఆరంభ కాలమును సృష్టి చేయబడిన వారము మొదలుకొని మానవాళి పాపములోనికి పడిపోవుట మరియు ఏదెను వనములో నుండి త్రోసివేయబడుట వరకు గల కాలముగా నిర్వచిద్దాము. ఈ సన్నివేశములను బైబిలులో అనేకసార్లు ప్రస్తావించుట జరిగింది. అయితే ముఖ్యముగా ఆది. 1-3 అధ్యాయములలో బైబిలు వీటిని వివరిస్తుంది.

సృష్టి సమయములో కుమారుని యొక్క కార్యమును రెండు అంశములను చర్చించుట ద్వారా చూద్దాము: మొదటిగా, దేవుడు లోకమును ఉనికిలోనికి తెచ్చిన సృష్టి వారము; మరియు రెండవదిగా, మానవాళి పాపములోనికి పడిపోవుట. సృష్టి వారముతో ఆరంభిద్దాము.



వీడియోలు, అధ్యయన మార్గదర్శిలు, మరియు ఇతర నిధుల కొరకు థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్ ను thirdmill.org నందు సందర్శించండి.

## సృష్టి వారము

ఇప్పుడు, దేవుడు లోకమును సృష్టించుటను గూర్చి క్రైస్తవులు మాట్లాడునప్పుడు, మన ఆలోచన సాధారణంగా తండ్రియైన దేవుని యొక్క వ్యక్తిత్వము వైపుకు మళ్లుతుంది. అయితే సృష్టిని చేసినప్పుడు కుమారుడు దేవుని ప్రక్కన ఉన్నాడని, మరియు తండ్రి లోకమును ఆయన ద్వారా లేక ఆయన మూలముగా సృజించాడని లేఖనము బోధిస్తుంది. యోహాను 1:1-3 మరియు హెబ్రీ. 1:2 వంటి చోట్ల ఈ సత్యములు బోధించబడ్డాయి.

> కుమారుడైన దేవుడు లోకమునకు సృష్టికర్త అని మనము ఆలోచన చేసినప్పుడు, మన దృష్టికి వచ్చే లేఖన భాగము కొలస్సీ 1వ అధ్యాయములో ఉన్నది, అది ఒక ఘనమైన లేఖనభాగము, మరియు సమస్తము ఆయన ద్వారా చేయబడినవని, సమస్తము ఆయన కొరకు చేయబడినవని, మరియు సమస్తము ఆయనలో ఉనికిలో ఉన్నవని ఆ లేఖనభాగము మనకు జ్ఞాపకము చేస్తుంది, మరియు తరువాత అది ఒక అభ్యాసిక విషయమును తెలియజేస్తుంది. దీని అర్థము ఏమిటంటే ఈ సృష్టిని రూపించి సృజించినవాడు, స్వాభావిక నియమము మరియు సొంత దైవిక చిత్తముల యొక్క కలయిక ద్వారా దానిని కొనసాగించువాడు, మరియు ఈ సృష్టిలో భాగముగాను ఆత్మ ద్వారా పునఃసృష్టించబడినవారిగాను మనము ఎదుర్కొను ప్రతి సమస్యను ఆయన వ్యక్తిగతముగా ఎరిగియున్నాడు అనే నిశ్చయతను మనము కలిగియుండవచ్చు. కాబట్టి నేడు దేవుని నిజమైన ఉద్దేశము మరియు దేవుని దైవకృతముతో అనుబంధము కలిగియున్నామను ఆశీర్వాదము మనకు ఉన్నది.
>
> — డా. జేమ్స్ డి. స్మిత్ III

ఉదాహరణకు, సృష్టిలో కుమారుని యొక్క పాలుపంపులను గూర్చి కొలస్సీ. 1:16 చెబుతున్న మాటలను వినండి:

> ఏలయనగా ఆకాశమందున్నవియు భూమియందున్నవియు, దృశ్యమైనవిగాని, అదృశ్యమైనవిగాని . . . సర్వమును ఆయనయందు సృజింపబడెను, సర్వమును ఆయనద్వారాను ఆయననుబట్టియు సృజింపబడెను (కొలస్సీ. 1:16).

ఈ లేఖనభాగములో, సృష్టి కుమారుని ద్వారా సాధించబడినదని, లేక కొన్ని అనువాదములు తెలియపరచునట్లుగా, ఆయన "ద్వారా" చేయబడినదని పౌలు స్పష్టముగా చెబుతున్నాడు.

> సృష్టి యొక్క ఆరంభములో కుమారుడు లోగోస్ గా అనగా సత్య వాక్కుగా ఉనికిలో ఉన్నాడు. కాబట్టి ఆది. 1లో "వెలుగు కమ్మని" దేవుడు పలికాడు. "జలములొకచోటనే కూర్చబడి, ఆరిన నేల కనబడునుగాక" అని దేవుడు పలికాడు. తరువాత, "వాక్యము శరీరధారియాయెను" అని యోహాను సువార్తలో



వీడియోలు, అధ్యయన మార్గదర్శిలు, మరియు ఇతర నిధుల కొరకు థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్ ను thirdmill.org నందు సందర్శించండి.

యోహాను ప్రకటించాడు. కాబట్టి మనము సర్వలోకమును అదే విధముగా అర్థము చేసుకుంటాము — సృష్టికర్త నుండి సృష్టిలోనికి, దేవుని నుండి మానవాళికి. ఎందుకని? ఎందుకంటే దేవుని పాలించు నియమము ద్వారా మనము లోకమును అర్థము చేసుకుంటాము. మరియు ఈ నియమము ఊహాత్మకమైనది కాదు. ఇది సత్యము, వాక్యము, ఇది లోగోస్. కాబట్టి సర్వలోకము దేవుని లోగోస్ ద్వారా పాలించబడుతుంది కాబట్టి దాని ఆధారంగా లోకమును అర్థము చేసుకోవచ్చు.

— డా. స్టీఫెన్ ఛాన్, అనువాదం

క్రొత్త నిబంధనను చదువునప్పుడు, మనము అనేక ఆశ్చర్యకరమైన విషయములను కనుగొనవచ్చని, పాత నిబంధనను ఒక నూతనమైన వెలుగులో చదవవచ్చని మీకు తెలుసా. ఉదాహరణకు, యోహాను సువార్త యొక్క పరిచయ భాగములో మనము కనుగొను ఒక విషయము ఏమిటంటే, క్రీస్తు ఆది నుండి ఉనికిలో ఉన్నాడు. పాత నిబంధనలోని ప్రతి వచనములో క్రీస్తు ఉన్నాడు. అయితే మనము ఆదిలోని సృష్టిలో పరిశీలన చేస్తే అక్కడ దేవుని లోగోస్ అనగా వాక్యమైన క్రీస్తు ఉన్నాడని, ఆయన ద్వారా దేవుడు లోకములను చేశాడని యోహాను చెబుతున్నాడు. తరువాత కొలస్సీ పత్రికను పరిశీలన చేస్తే, అక్కడ కుమారుడు లోకమును సృజించుట మాత్రమే గాక, ఆయన సమస్తమును ఉనికిలోనికి తెచ్చాడని పౌలు అంటాడు, మరియు దేవుడు పలికాడని — అనగా మౌఖిక సృష్టి చేశాడని — ఆదికాండములో మనకు తెలియజేయబడింది. ఆయన వాక్కు ద్వారా పలికాడు. మరియు ఆ వాక్కు క్రీస్తు అని మనము అర్థము చేసుకుంటాము.

— డా. ఆర్. ఆల్బర్ట్ మొహ్లర్, జూ.

ఆసక్తికరముగా, సృష్టిని గూర్చి బైబిలు ఇచ్చు కథనము భూమ్యాకాశములను సృజించుటకు ముందు ఏమి జరిగినదో అను విషయము మీద దృష్టి పెట్టకుండా మొదలవుతుంది. బదులుగా, ఆయన చిత్తానుసారముగా — లోకము కొరకు ఆయన కలిగియుండిన నిత్య ప్రణాళికలను అనుసరించి — దేవుడు సర్వలోకమును ఆజ్ఞాపించిన మరియు నింపిన విధానమును గూర్చి మాట్లాడుటకు అది సమయమును కేటాయిస్తుంది. ఆది. 1:1 సృష్టి వృత్తాంతము నకు శీర్షికగా ఉన్నది, మరియు దేవుడు సృష్టికర్త అని మనకు తెలియజేస్తుంది. ఆది. 1:2 లోకము యొక్క ఆరంభ పరిస్థితిని మనకు తెలియజేస్తుంది. అక్కడ మనం ఇలా చదువుతాము:

> భూమి నిరాకారముగాను శూన్యముగాను ఉండెను; చీకటి అగాధ జలముపైన కమ్మియుండెను (ఆది. 1:2).

దేవుడు లోకమును ఆజ్ఞాపించి నింపక ముందు, అది నిరాకారముగాను క్రమములేకుండాను ఉండెను; మరియు అది శూన్యముగా జీవులు లేకుండా ఉండెను. ఈ స్థితిలో, దేవుని మహిమకరమైన

రాజ్యముగా ఉండుటకు లోకము తగినదిగా లేకుండెను. కాబట్టి, సృష్టిని నింపుటకు మరియు ఆజ్ఞాపించుటకు ఆయన ఆరు దినములు గడిపాడు. మరియు ఆయన ఈ కార్యములను చేసిన విధానము లోకము కొరకు ఆయన కలిగియుండిన పరిమాణములను మరియు నిత్య ఉద్దేశమును బయలుపరచింది.

సృష్టిని చేసిన మొదటి మూడు దినములలో, దేవుడు లోకమునకు ఒక రూపును ఇచ్చాడు. ఆయన వాక్కు యొక్క శక్తి ద్వారా, ఆయన వెలుగును చీకటి నుండి, ఆకాశమును సముద్రము నుండి, మరియు ఆరిన నేలను నీటి నుండి వేరుచేశాడు. మరియు తాను తరువాత చేయబోవుచున్న జంతువులకు ఆహారముగా ఉండుటకు మొక్కలను చేశాడు.

సృష్టిని చేసిన తదుపరి మూడు రోజులలో, దేవుడు శూన్యముగా ఉన్న లోకమును నింపి, ఆయన రాజ్యము క్రమముగా నియంత్రించబడునట్లు పాలించబడునట్లు చేశాడు. ఆయన కాలములను నియంత్రించుటకు సూర్య, చంద్ర నక్షత్రములను చేశాడు మరియు పగటిని ఏలు బాధ్యత సూర్యునికి మరియు రాత్రిని ఏలు బాధ్యత చంద్రునికి ఇచ్చాడు. తరువాత నీటిలో నివసించుటకు చేపలను జలచరములను, ఆకాశమును నింపుటకు పక్షులను, మరియు ఆరిన నేలను నింపుటకు భూమి మీద నివసించుటకు జంతువులను చేశాడు. తరువాత భూమిని నింపుటకు మరియు నీరు, ఆకాశము మరియు భూమి మీద ఉన్న జీవులను పాలించుటకు ఆయన మానవాళిని సృజించాడు. ఆది. 1:27-28లో మానవుని యొక్క సృష్టి వృత్తాంతమును వినండి:

> దేవుడు తన స్వరూపమందు నరుని సృజించెను; దేవుని స్వరూపమందు వాని సృజించెను; స్త్రీనిగాను పురుషునిగాను వారిని సృజించెను. దేవుడు వారిని ఆశీర్వదించెను; ఎట్లనగా “మీరు ఫలించి అభివృద్ధిపొంది విస్తరించి భూమిని నిండించి దానిని లోపరచుకొనుడి; సముద్రపు చేపలను ఆకాశ పక్షులను భూమిమీద ప్రాకు ప్రతి జీవిని ఏలుడని” దేవుడు వారితో చెప్పెను (ఆది. 1:27-28).

> మానవాళితో దేవునికి ఉన్న వాస్తవిక అనుబంధము ఈ పదముల ద్వారా వర్ణించబడవచ్చని లేఖనము, ముఖ్యముగా ఆదికాండము మనకు తెలియజేస్తుంది: మొట్టమొదటిగా, మానవులు దేవుని సృష్టి యొక్క ఉన్నత శిఖరముగా ఉన్నారు. ఆరవ దినము చివరిలో “మన స్వరూపమందు నరుని సృజించెదము అని దేవుడు పలికెను,” అని అది చెబుతుంది. మరియు దేవుని స్వరూపములోను పోలికెలోను ఆయన మానవుని, స్త్రీనిగాను పురుషునిగాను సృజించెను. కాబట్టి మానవులకు ఈ శిఖర సంబంధమైన అనుబంధము ఉన్నది, దేవుడు చేయాలనుకున్న ప్రతిదానికి, అనగా ఆయన పోలికెను, స్వరూపమును సృష్టిలో ఉంచుటకు మూలరాయిగా వారిని ఉంచాడు. కాబట్టి, అదే వాస్తవమును ఆదికాండము రెండవ అధ్యాయము ఈ విధంగా వివరిస్తుంది: దేవుడు ఆదామును మంటిలో నుండి చేసి ఆయనలోనికి జీవమును ఊదాడు, మరియు దేవుడు ఆయన దైవిక జీవమును ఆదాముతో పంచుకున్నాడు. కాబట్టి, దేవునితో



వీడియోలు, అధ్యయన మార్గదర్శిలు, మరియు ఇతర నిధుల కొరకు థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్ ను thirdmill.org నందు సందర్శించండి.

> మానవునికి ఉన్న వాస్తవిక అనుబంధమును ఈ విధంగా వివరించవచ్చు: మానవులు దేవుని స్నేహితుల వలె, దేవుని బిడ్డల వలె, సృష్టిలో దేవుని భాగస్వాముల వలె, దేవుని సేవించుటకు, కాని దేవుని సేవించుటకు మాత్రమేగాక ముఖ్యముగా దేవుని తెలుసుకొనుటకు మరియు ప్రేమించుటకు సృజించబడ్డారు.
>
> — డా. స్టీవ్ బ్లేక్ మోర్

సృష్టి వారములోని ఆరవ రోజు చివరికి, ఆయన విశేషమైన రాజ్యముగా ఉండుటకు దేవుడు విశ్వమును సృజించాడు, మరియు ఆయనకు మహిమతెచ్చు విధముగా భూమిని పాలించుటకు మనుష్యులను నియమించాడు. ఈ విషయమును మనస్సులో ఉంచుకొని, కొలస్సీ. 1:16ను మరొక సారి చూద్దాము, అక్కడ సృష్టిలో కుమారుని పాత్రను గూర్చి పౌలు ఇలా వ్రాస్తున్నాడు:

> ఏలయనగా ఆకాశమందున్నవియు భూమియందున్నవియు, దృశ్యమైనవిగాని, అదృశ్యమైనవిగాని, అవి సింహాసనములైనను ప్రభుత్వములైనను ప్రధానులైనను అధికారములైనను, సర్వమును ఆయనయందు సృజింపబడెను, సర్వమును ఆయనద్వారాను ఆయననుబట్టియు సృజింపబడెను (కొలస్సీ. 1:16).

ఈ వాక్య భాగములో, పౌలు సింహాసనములు, ప్రభుత్వములు, ప్రధానులు మరియు అధికారములను గూర్చి మాట్లాడుతున్న విషయమును గమనించండి. బైబిలులో, సృష్టి కేవలం ఉనికికి సంబంధించినది మాత్రమే కాదు. అది రాజకీయ అధికారమునకు సంబంధించినది కూడా. విశేషమైన ఆయన కుమారుని అధికారము క్రింద దేవుని విశేషమైన రాజ్యముగా ఉండుటకు లోకము ఉనికిలో ఉన్నది. హెబ్రీ. 1:2లోని ఈ మాటలలో కూడా మనము ఇదే అనుబంధమును చూస్తాము:

> ఈ దినముల అంతమందు కుమారుని ద్వారా [దేవుడు] మనతో మాటలాడెను. ఆయన ఆ కుమారుని సమస్తమునకును వారసునిగా నియమించెను. ఆయన ద్వారా ప్రపంచములను నిర్మించెను (హెబ్రీ. 1:2)

ఇక్కడ, హెబ్రీ పత్రిక రచయిత కుమారుడైన దేవుడు సృష్టియందు ఉనికిలో ఉన్నాడు అను ఆలోచనను "ఆయన సమస్త విషయములకు వారసుడు," అనగా ఆయన ప్రతి విషయమునకు యజమానిగా ఉండి సృష్టియావత్తును పరిపాలిస్తున్నాడు అనే సత్యముతో జతపరచాడు. వాస్తవానికి, ఈ ఆలోచన అధ్యాయము అంతటిలో కనిపిస్తుంది.

దేవుని విశేషమైన రాజ్యమును సేవించుట సృష్టి యొక్క ఉద్దేశమైయున్నదని బైబిలు తరచుగా తెలియజేస్తుంది. ఈ రాజ్యము విశేషమైన దేవుని కుమారుని ద్వారా పాలించబడుతుంది అని, మరియు ఆయన ద్వారా మరియు ఆయనయందు సృష్టి చేయబడినదని క్రొత్త నిబంధన స్పష్టము చేస్తుంది. కుమారుని యొక్క సృష్టించు కార్యము ఆయన రాజత్వము మరియు అధికారమునకు వ్యక్తీకరణగా ఉన్నదని కూడా మనము చెప్పవచ్చు. ఆయన సృష్టిని చేశాడు కాబట్టి, ఆయనకు సృష్టి మీద

అధికారము ఉంది. కాబట్టి, ప్రతి సృష్టము కూడా దాని యొక్క రాజుగా కుమారునికి ఇష్టపూర్వకముగా విధేయతతో సమర్పించుకొనవలసిన బాధ్యత ఉన్నది.

> క్రైస్తవ విశ్వాసములోని ఒక రహస్య సత్యము ఏమనగా, మన ప్రభువును రక్షకుడైన యేసు క్రీస్తు మనలను విమోచించుట మాత్రమేగాక, విశ్వమును సృష్టించుటలో కూడా ఆయన ముఖ్యమైన పాత్రను పోషించాడు. మన ప్రభువు మరియు రక్షకుడు విమోచకుడైయున్నాడు, కాని ఆయన మరి సంపూర్ణంగా సృష్టికర్తగాను విమోచకునిగాను ఉన్నాడు. దీనిలో మన కొరకు అనేక ప్రాముఖ్యమైన భావనలు ఉన్నాయి. దానిలో ఒకటి ఏమనగా, సర్వమును సృష్టించినవాడైన మన రక్షకుడు ఎంత గొప్పవాడో అది మనకు జ్ఞాపకము చేస్తుంది. ఇది ఒక అద్భుతమైన ఆలోచన. కుమారుడు ఏ విధంగా కూడా తండ్రి కంటే తక్కువవానిగా గాక, మన అద్భుతమైన మరియు మహత్తుగల లోకము యొక్క సృష్టిలో ఆయన సంపూర్ణముగా పాలివాడైయున్నాడు అని నమ్మునట్లు మనలను ఇది పురికొల్పుతుంది. యేసు క్రీస్తు యొక్క హృదయము సంఘము కొరకు మాత్రమేగాక, సృష్టి క్రమము అంతటి కొరకు మరియు సృష్టములు అన్నిటి కొరకు ఎదురుచూస్తుంది, మరియు క్రీస్తులో మనము అంత్య దినములలో వస్తుందని ఎదురుచూచు విమోచన ఈ మూలుగుచున్న సృష్టి కొరకు కూడా విమోచన అవుతుంది అని కూడా ఇది మనకు జ్ఞాపకము చేస్తుంది అని నా ఆలోచన. చివరిగా, యేసు క్రీస్తును అనుసరించువారి హృదయము కూడా యేసు యొక్క హృదయవాంఛను కలిగియుంటుంది అని, లోకమును గూర్చి మరియు లోకములోని నివాసులను గూర్చి వారి యొక్క సృష్టికర్త వలెనె మనము కూడా శ్రద్ధ వహించాలని జ్ఞాపకము చేస్తుంది అని నా ఆలోచన.
>
> — డా. గ్లెన్ స్కోర్గి

సృష్టి వారము దృష్టిలో సృష్టిలో కుమారుని యొక్క కార్యమును మనము పరిగణించాము కాబట్టి, మానవాళి పాపములోనికి పడిపోవుటను గూర్చి చర్చించుటకు సిద్ధముగా ఉన్నాము.

## మానవాళి యొక్క పతనము

మానవాళి పాపములోనికి పడిపోయిన కథనము దుఃఖకరమైనదేగాని సుపరిచితమైనది. ఆదికాండము 2లో దేవుడు మన మొదటి తల్లిదండ్రులైన ఆదాము హవ్వలను సృజించి, వారిని అందమైన ఏదెను వనములో ఉంచాడు. తోటను సాగుచేసి, తోటను సర్వలోకములోనికి మానవజాతి వ్యాపింపజేయునట్లు సంతానమును కను బాధ్యత వారికి ఇవ్వబడినది, తద్వారా సర్వలోకము దేవుని కొరకు యోగ్యమైనదిగా మార్చబడవలసియుండినది. అయితే ఆదికాండము 3లో, సాతాను సర్పము రూపమును ధరించుకొని, తిరస్కరించబడిన మంచి చెడ్డల తెలివినిచ్చు వృక్ష ఫలము తినునట్లు హవ్వను



వీడియోలు, అధ్యయన మార్గదర్శిలు, మరియు ఇతర నిధుల కొరకు థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్ ను thirdmill.org నందు సందర్శించండి.

శోధించాడు. హవ్వ తినిన వెంటనే, కొంత భాగమును ఆదామునకు ఇచ్చినది, అతడు కూడా తిన్నాడు. ఇది మానవాళి చూపిన మొదటి అవిధేయత. ఆదాము హవ్వలు సర్పము మాటలు విని దేవుని దైవకృతము మరియు ఆయన ఆజ్ఞకు అవిశ్వాసముతో స్పందించారు.

కాబట్టి, ఆదికాండము 3లో, ఆదాము, హవ్వ మరియు సర్పమును శపిస్తూ దేవుడు ఈ పాపమునకు స్పందించాడు. ఈ శాపములోని తీర్పులు మానవాళి అవిధేయతకు పరిణామములను క్రోడీకరించి, సృష్టి కొరకు దేవుడు కలిగియున్న ఉద్దేశముల యొక్క నెరవేర్పును ఆలస్యం చేశాయి.

అయితే దీనంతటిలో కుమారుడైన దేవుని యొక్క పాత్ర ఏమిటి? మానవాళి పాపము చేసినప్పుడు వారిని శపించుటలో కుమారుడు తండ్రి మరియు పరిశుద్ధాత్మతో పాలుపంచుకున్నాడు అని చెబుతూ కుమారుని కార్యమును మనము క్రోడీకరించవచ్చు, మరియు ఈ శాపముల నుండే మానవాళిని విడిపించుటకు వాగ్దానము చేయబడిన రాబోవు మెస్సీయ ఆయనే.

మానవాళి పతనములో కుమారుడైన దేవుని యొక్క పాత్రను మూడు మార్గములలో పరీక్ష చేద్దాము. మొదటిగా, పతనము యొక్క వ్యక్తిగత పరిణామాలను చూద్దాము. రెండవదిగా, దాని యొక్క సార్వత్రిక పరిణామాలను చూద్దాము. మరియు మూడవదిగా, పతనము తరువాత మానవాళికి ఇవ్వబడిన నిరీక్షణను గూర్చి క్లుప్తంగా ప్రస్తావిద్దాము. పతనము యొక్క వ్యక్తిగత పరిణామాలను చూచుటతో ఆరంభిద్దాము.

## వ్యక్తిగత పరిణామాలు

> రోమా. 5వ అధ్యాయము ప్రకారం, మానవాళి పాపములోనికి పడిపోవుటకు కలిగిన కొన్ని పరిణామాలను గూర్చి మాట్లాడుతూ, ఆదామును గూర్చి చెబుతూ, ఒక మానవుని ద్వారా పాపము లోకములోనికి ప్రవేశించగా, అందరు ఆయనలో పాపము చేశారు, అనగా ఆయనలో పాపము చేశారు కాబట్టి మరణము ప్రజలందరికీ సంక్రమించింది. అతడు మానవ జాతి అంతటికి ప్రతినిధిగా ఉన్నాడు. అతడు పాపము చేసినప్పుడు, అతని అపరాధము మానవ జాతి అంతటి మీద పడింది. అంతేగాక, అతని దుష్ట స్వభావము కూడా అందరికీ బదిలీ చేయబడింది. ఈ విధముగా ఆలోచన చెయ్యండి, దేవుడు ఆదామును సృష్టించినప్పుడు ఆయనలో ఒక విషపు డబ్బాను పెట్టాడు అనుకుందాం — ఇది నిజం కాదు, కాని ఈ విధముగా ఊరకే ఆలోచన చెయ్యండి — మరియు నీవు ఒకవేళ నా చిత్తమునకు విరోధముగా వెళ్తే ఆ డబ్బా పగిలిపోతుంది అని ఆదాముతో దేవుడు చెప్పాడు అనుకోండి. అయితే, ఆదాము దేవుని చిత్తమును మీరాడు కాబట్టి, చిన్న డబ్బా పగిలిపోయి, అది అతని మనస్సును కలుషితం చేసింది — అతడు సరిగా ఆలోచన చేయలేదు, అతని హృదయమును కలుషితం చేసింది — అతడు సరైన విషయములను ప్రేమించలేదు, అతని చిత్తమును కలుషితం చేసింది — అతడు సరైన వస్తువులను ఎన్నుకోలేదు. తరువాత ఆదాముకు పిల్లలు పుట్టినప్పుడు, ఆ భ్రష్ట స్వభావము ఆయన పిల్లలకు కూడా ప్రాకింది కాబట్టి మానవ జాతి అంతా ఈ

> భ్రష్ట స్వభావముతోను దేవుని మీద తిరుగుబాటు చేయు స్వభావముతోను ఉనికిలోనికి వచ్చింది.
>
> — డా. ఫ్రాంక్ బార్కర్

తెగిపోయిన సహవాసము. మానవాళి పాపములోనికి పడిపోవుట యొక్క వ్యక్తిగత పరిణామాలను వివరించుటకు అనేక మార్గములు ఉన్నాయి. అయితే ఈ పాఠంలోని మన ఉద్దేశముల కొరకు, మనము దేవుడు మరియు మానవుల మధ్య తెగిపోయిన సహవాసముతో ఆరంభించి నాలుగు ఆలోచనల మీద దృష్టి పెడదాము.

> మానవాళి పాపములోనికి పడిపోవుట అంటే దేవునికి విరోధముగా తిరుగుబాటు చేయుట — అతని స్వభావమునకు ప్రతీకగా ఉన్న నైతిక ఆజ్ఞలను ఉల్లంఘించుట. మరియు ఆ తిరుగుబాటు ప్రతి స్థాయిలోనూ ఒక విషాదకరమైన ఎడబాటుకు దారితీసింది — అన్నిటి కంటే ముఖ్యముగా దేవుని నుండి ఎడబాటు. ఆయన సృష్టిగా, ఆయన రూపములో చేయబడినవారిగా, ఆయనకు మహిమను తెచ్చువారిగా, మనము దానిని చేయకూడదు. మనము దేవుని మహిమను పొందలేకపోతున్నాము, మరియు మనము ఆయనకు విరోధముగా తిరుగుబాటు చేసినప్పుడు, ఆయన కావాలనే ఈ సృష్టిని శపించి దేవునికి మరియు ఆయన సృష్టికి మధ్య ఒక ఎడబాటును తీసుకొనివస్తాడు. కాబట్టి, మానవాళి అనుభవించు ఎడబాటు, అనగా మన అత్యున్నత భద్రతకు, ప్రాముఖ్యతకు మరియు గుర్తింపుకు మూలమైన విధానమును మరియు దేవుని సృష్టిగా ఉండుటను కోల్పోవుట జరిగింది, తద్వారా మనము దేవుని నుండి దూరమయ్యాము. మనము ఒకరికొకరము కూడా దూరమైయ్యాము, మానవులు తమ సమస్త ఆనందమును, తమ గుర్తింపును, తమ సంతృప్తిని దేవునిలో పొందుకొనవలసియున్నారు కాబట్టి అలా జరగనప్పుడు మనము లోకములోని వస్తువులను వెదకుతాము. తరువాత, ప్రజలు ప్రేమ ఆప్యాయతలకు కారణములుగా ఉండుటకు బదులుగా, ఈ లోకములోని వస్తువుల కొరకు పోటీపడుతూ తమ గుర్తింపు కొరకు వెదకుచు, ఇతర ప్రజల నుండి కూడా విడిపోయారు.
>
> — డా. కే. ఎరిక్ థోయెన్స్

తాను చేసిన సృష్టములతో నివాసముండుటకు స్థానముగా ఉండునట్లు దేవుడు ఈ లోకమును రూపొందించాడు. అయితే ఆదాము హవ్వల పాపం వారిని దేవుని నుండి దూరం చేసింది; వారితో ఆయన సహవాసము తెగిపోయింది. వారి అవిధేయత వారిలో అవమాన భావనను కలిగించింది, మరియు దేవుని సన్నిధిలోని సంతృప్తిని మరియు నిశ్చయతను వారు కోల్పోయారు. కాబట్టి, తోటలో దేవునితో నడచుటకు మరియు మాట్లాడుటకు బదులుగా వారు ఆయన సన్నిధి నుండి దాగుకొన్నారు. మరియు



వీడియోలు, అధ్యయన మార్గదర్శిలు, మరియు ఇతర నిధుల కొరకు థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్ ను thirdmill.org నందు సందర్శించండి.

ఈ సహవాసము కేవలం మానవ దృక్కోణములో మాత్రమే తెగిపోలేదు; దేవుడు కూడా వారి సన్నిధిని తిరస్కరించి ఏదెను వనము నుండి వారిని వెళ్లగొట్టాడు. ఫలితంగా, మానవులు కలిగియుండిన గొప్ప అవసరతలలో ఒకటి ఈ అనుబంధమును పునరుద్ధరించుట.

అంతేగాక, దేవునితో మానవుల అనుబంధం తెగిపోవుటకు ఫలితంగా, ఆదాము హవ్వలు ఒకరి మధ్య ఒకరు కలిగియుండిన సహవాసము కూడా తెగిపోయింది. ఇది వారు ఒకరిని చూసి ఒకరు సిగ్గునొందుట, మరియు తమను తాము అంజూర ఆకులతో కప్పుకొనుటలో స్పష్టమవుతుంది. మరియు దీనిని మనము ఆది. 3:16లో దేవుడు మానవులను శపించిన విధానములో చూడవచ్చు, అక్కడ వివాహములో కలహమునకు పాపము కారణమని మనకు తెలుపబడింది. కాబట్టి, ఈ మానవ అనుబంధాలను పునరుద్ధరించగల విమోచన కూడా మానవులకు అవసరమైయున్నది.

అపరాధ భారం. ఆదాము యొక్క పాప అపరాధ భారమును మానవాళి అంతా మోయుట పతనము యొక్క రెండవ వ్యక్తిగత పరిణామమైయున్నది. రోమా. 5:18లో పౌలు ఈ సమస్యను వివరించిన విధానమును వినండి.

> కాబట్టి తీర్పు ఒక్క అపరాధమూలమున వచ్చినదై, మనుష్యుల కందరికిని శిక్షావిధి కలుగుటకు ఏలాగు కారణమాయెనో . . . (రోమా. 5:18).

ఆదాము చేసిన ఒక అవిధేయ కార్యము మానవాళి అంతటి యొక్క శిక్షకు కారణమైయ్యింది అని పౌలు బోధించాడు. మరొక మాటలో, దేవుడు ఆదాము యొక్క పాపమును పడిపోయిన ప్రతి మానవుని ఖాతాలో జమ చేస్తాడు, కాబట్టి మనమంతా ఆ మొదటి అవిధేయతకు అపరాధులమైయున్నాము. ఆదాము మానవాళి అంతటికి నిబంధనా నాయకునిగా ఉన్నాడు కాబట్టి ఇలా జరిగింది. అతడు తనకు మాత్రమే గాక, తన భార్యకు, మరియు స్వాభావిక మానవ ఉత్పత్తి వలన కలుగు ప్రతి మానవునికి ప్రాతినిధ్యం వహించాడు. ఫలితంగా, ఈ అపరాధ భారము నుండి, అది తీసుకొనివచ్చు నిత్య శిక్ష నుండి విడిపించు విమోచన మనకు అవసరమైయున్నది.

భ్రష్టత్వము. భ్రష్టత్వము మనము ప్రస్తావించు పతనము యొక్క మూడవ వ్యక్తిగత పరిణామమైయున్నది. వేదాంతశాస్త్ర పదమైన "భ్రష్టత్వము" పాపము మానవ స్వభావమును భ్రష్టు పట్టించుటను సంబోధిస్తుంది. భ్రష్టత్వ సీమలను పలు వేదాంతశాస్త్ర పరంపరలు పలు విధాలుగా అర్థము చేసుకుంటాయి. అయితే దేవుని దయను పొందుట నుండి అది మనలను నివారిస్తుంది అని ఇవాంజెలికల్ క్రైస్తవులు అందరు సమ్మతిస్తారు. మానవ స్వభావము యొక్క భ్రష్టత్వమును గూర్చి లేఖనము రోమా. 3:9-18తో సహా అనేక చోట్ల మాట్లాడుతుంది.

ఉదాహరణకు, రోమా. 3:10-12లో వ్రాయబడిన ఈ మాటలను వినండి.

> నీతిమంతుడు లేడు, ఒక్కడును లేడు, గ్రహించువాడెవడును లేడు, దేవుని వెదకువాడెవడును లేడు. అందరును త్రోవ తప్పి యేకముగా పనికిమాలినవారైరి; మేలుచేయువాడు లేడు, ఒక్కడైనను లేడు (రోమా 3:10-12).

ఈ వచనములలో, మానవ భ్రష్టత్వమును గూర్చి లేఖనములో ఉన్న స్థిరమైన బోధలను ఎత్తి చూపుటకు పౌలు అనేక పాత నిబంధన వచనములను కలిపాడు.

రోమా. 3లో, మన స్వభావము భ్రష్టు పట్టినది గనుక, నీతిమంతుడు ఒక్కడు కూడా లేడు, మేలు చేయువాడు ఒక్కడు కూడా లేడు అని పౌలు బోధించాడు. ఎవరికీ అవగాహన లేకుండా మన ఆలోచనా శక్తి కూడా భ్రష్టు పట్టింది. మరియు ఎవరూ దేవుని వెదకకుండునట్లు మన చిత్తము కుడా ప్రభావితము చేయబడింది. వాస్తవానికి, మన పరిశుద్ధమైన దేవుని ఎదుట మానవ స్వభావము పనికిమాలినదిగా అయ్యింది అని కూడా పౌలు చెప్పాడు. ఆయన ఆశీర్వాదమునకు మనము యోగ్యులము కాము, మరియు మనలను విమోచించుటకు మనము చేయగలిగినది ఏమి లేదు. మనలను విమోచించుటకు మరొకరి అవసరత మనకు ఉన్నది.

> మీకు తెలుసా, ఇరవైయ్యవ శతాబ్దం ఆరంభమైనప్పుడు, లోకములో, ముఖ్యముగా పాశ్చాత్య లోకములో విజ్ఞాన పరిజ్ఞాన ఎదుగుదల కారణంగా, విద్యా వ్యాప్తి కారణంగా, నూతన ఆవిష్కరణల కారణంగా — సాంకేతిక విజ్ఞానము, ప్రగతి, మొదలగు వాటి కారణంగా — తత్వవేత్తలు, సామాజిక విజ్ఞానులు మరియు ఉదారవాద వేదాంతవేత్తల మధ్య గొప్ప ఆశాపూర్ణత ఉండేది, మరియు ఇరవైయ్యవ శతాబ్దము యుద్ధము ఉండదని శాంతియుతమైన యుగముగా ఉంటుంది అనే గొప్ప ఆశాపూర్ణత ఉండేది. మానవ తర్కము ఇరవైయ్యవ శతాబ్దమును ఏలుతుంది అని, తార్కికమైన మానవులు ఒకరినొకరు చంపరనే ఆలోచన ఉండేది. కాబట్టి, శాంతితో ఉండు శతాబ్దములోనికి మనము అడుగిడబోతున్నాము అనే బలమైన నిరీక్షణ ఉండేది. ఇలాంటి ఆలోచనలో ఉన్న సమస్య ఏమిటో మీకు తెలుసు ... మార్క్స్ వాదములో కూడా ఇదే సమస్య ఎదురయ్యింది, దానిలో ఒక ఆశాపూర్ణతతో కూడిన మానవశాస్త్రము ఉండేది మరియు దానిలో పాపమును గూర్చిన సిద్ధాంతము లేదు కాబట్టి అది సామాజిక విషాదములకు దారి తీసింది. తరువాత ఏమి జరిగింది? మొదటి ప్రపంచ యుద్ధము జరిగింది. బొల్షివిక విప్లవం జరిగింది. తరువాత హోలోకోస్ట్, రెండవ ప్రపంచ యుద్ధము, హిట్లర్, నాజీవాదము, ఇంకా అనేక విషాదాలు జరిగాయి. ఫలితంగా, సారాంశంలో చెబితే, ఇరవైయ్యవ శతాబ్దములో, పదకొండు కోట్ల ఇరవై ఎనిమిది లక్షల మంది యుద్ధములో హతమార్చబడ్డారు. నేను కేవలం యుద్ధములను గూర్చి మాత్రమే మాట్లాడుతున్నాను. వ్రాయబడిన ఆధారములను లెక్కిస్తే మరణించిన నాగరికులు మరియు సైనికులు యొక్క సంఖ్య ఇది. ఇవి అంతకు ముందు నాలుగు శతాబ్దములలో కలిగిన మరణాలను కలిపి చూసినన్ని మరణాలు. ఇది మనకు ఏమి చెబుతుంది? ఏదో సమస్య ఉన్నదని తెలియజేస్తుంది. సామాజిక పరిస్థితులు మాత్రమే గాక, జ్ఞాన పురోగతి అంతటి మధ్యలో, విజ్ఞాన ప్రగతి మరియు నాకరికతల మధ్యలో, మానవ స్వభావములో ఏదో ఒక ప్రాథమిక సమస్య ఉన్నది. దానిని క్రైస్తవులమైన మనము "పాపము" అని పిలుస్తాము. మీడియాలో, విద్యా శాఖలలో మరియు ఇతర చోట్ల ఇది సుపరిచితమైన పదము కాదు, అయినను రెయిన్హోల్డ్ నైబర్ చెప్పినట్లు, క్రైస్తవ పాప సిద్ధాంతము సిద్ధాంతములన్నిటిలో తక్కువ

ప్రసిద్ధిగాంచిన సిద్ధాంతమైయున్నది, కాని దీని కొరకు ప్రతి చోట ఎంతో అద్భుతమైన అనుభావిక ఆధారము ఉన్నది.

— డా. పీటర్ కుజ్మిక్

శ్రమ, బాధ మరియు మరణము. సమస్త మానవాళి శ్రమ, బాధ మరియు మరణమును అనుభవించుట ఆరంభించినది అనునది పతనము యొక్క నాలుగవ వ్యక్తిగత పరిణామమైయున్నది.

మానవాళి పాపములోనికి పడిపోవుటకు ముందు, జీవితము పరిపూర్ణముగాను సంపూర్ణముగాను ఉండేది. మానవాళి బాధను, లేక కష్టమును, లేక అనారోగ్యమును, లేక మరణమును అనుభవించలేదు. అయితే ఆదాము హవ్వలు పాపము చేసిన తరువాత దేవుడు వారిని, వారి యొక్క స్వాభావిక సంతతిని శపించాడు.

> సరే, పతనమునకు పరిణామముగా, దేవుడు స్త్రీ పురుషులకు మాత్రమేగాక సృష్టి యావత్తుకు తీర్పు తీర్చాడు. కాబట్టి, ఉదాహరణకు, ఆదాము హవ్వలు పతనమునకు ముందు చేసిన పని, తరువాత పరిశ్రమగా మారింది, కాబట్టి మానవాళికి పనితో ప్రేమించు-ద్వేషించు అనుబంధం ఆరంభమైయ్యింది. స్త్రీ పురుషులకు మధ్య ఉన్న అనుబంధము కూడా భ్రష్టుపట్టి చెడిపోయింది. పిల్లలకు జన్మనిచ్చుట — దేవుని స్వరూపములను పునరుత్పత్తి చేయుటకు దేవుడిచ్చిన వరము — బాధగా మారింది, మరియు సాధారణంగా మాట్లాడితే, ఆస్వాదించుటకు దేవుడు ఆదాము హవ్వలకు ఇచ్చిన మంచి వస్తువులన్ని వారు ఆస్వాదించుట కొనసాగించారుగాని, అవి ఏదో ఒక విధముగా భ్రష్టుపట్టబడి, సంపూర్ణంగా ఆస్వాదించబడలేదు.

— డా. సైమన్ వైబర్ట్

మానవాళిని దేవుడు శపించిన విధానము ఆది. 3:16-19లో వ్రాయబడియున్నది, అక్కడ మనము ఇలా చదువుతాము:

> ఆయన స్త్రీతో నీ ప్రయాసమును నీ గర్భవేదనను నేను మిక్కిలి హెచ్చించెదను; వేదనతో పిల్లలను కందువు; . . . ఆయన ఆదాముతో . . . నీ నిమిత్తము నేల శపింపబడియున్నది; ప్రయాసముతోనే నీవు బ్రదుకు దినములన్నియు దాని పంట తిందువు; అది ముండ్ల తుప్పలను గచ్చపొదలను నీకు మొలిపించును; . . . నీవు నేలకు తిరిగి చేరువరకు నీ ముఖపు చెమట కార్చి ఆహారము తిందువు . . . (ఆది. 3:16-19).

ఈ శాపములు మానవాళికి కేవలం బాధ మరియు శ్రమను మాత్రమే కలిగించలేదు; దేవుడు వారికి ఇచ్చిన పనులను నెరవేర్చుటలో కూడా అవి వారికి ఆటంకం కలిగించాయి. వృద్ధి చెంది భూమిని

నింపమని, భూమిని సాగు చేసి దానిని భద్రపరచమని, భూమిని పాలించి దేవుని రాజ్యమును వ్యాపింపజేయమని మానవాళికి ఇవ్వబడిన బాధ్యతలను నెరవేర్చుట కూడా కష్టతరమైయ్యింది.

అంతేగాక, మానవాళి అంతా మరణమును అనుభవించుట ఆరంభించింది. మరియు ఈ శాపములు మానవ తరములన్నిటికీ వ్యాపించాయి. కాబట్టి, మానవాళి కొరకు దేవుడు కలిగియున్న ఉద్దేశములను మనము ఎన్నడైనా నెరవేర్చవలసియుంటే, ఈ ఆటంకముల నుండి మనలను విమోచించి ఆశీర్వాదకరమైన ఆనందకరమైన ఉనికిలోనికి మనలను విమోచించుటకు ఒక విమోచకుని యొక్క అవసరత ఉన్నది.

> మానవాళి యొక్క పతనమునకు పరిణామాలు ఏమనగా మానవ జాతి దాని సొంత మార్గమునకు తిరిగినది. పాపము అనగా దేవుని ఆజ్ఞలను ఉల్లంఘించుట అయ్యున్నది మరియు మానవులు పరిపూర్ణులు కారు. వారు ఇక దేవుని స్థాయిని చేరుకోలేరు. కాబట్టి, పతనము తరువాత మనము దేవుని నుండి దూరమయ్యాము, మరియు మానవాళి అంతా మరణము యొక్క వాస్తవికతను అనుభవించింది. ఏ భేదము లేకుండా ఒక్కరు కూడా దేవుని దృష్టిలో నీతిమంతులుగా లేరు. మానవులు దేవుని స్వరూపములైనప్పటికీ, వారు భ్రష్టులయ్యారు. క్రీస్తులో విమోచన లేకుండా, ఆయనను స్వాభావికముగా ఎవ్వరూ వెదకలేరు. మరియు మనము దేవుని మంచితనము యొక్క స్థాయిలను చేరుకోలేము.
>
> — డా. స్టీఫెన్ ఛాన్, అనువాదం

> మానవులకు విమోచకుడు కావలి మరియు ఈ కారణము చేత దేవుడు వారి యొక్క విమోచకునిగా ఉండాలి: దేవునికి విరోధముగా పాపము చేయు స్వభావము. దేవుడు విశ్వమును ఉనికిలోనికి తెచ్చే వ్యక్తిత్వములేని శక్తి కాడు. దేవుడు వ్యక్తిగతమైనవాడు — త్రిత్వ సిద్ధాంతము, దేవుడు తండ్రి, కుమారుడు మరియు పరిశుద్ధాత్మయైయున్నాడు. దేవుడు సన్నిహితముగా, అద్భుతముగా వ్యక్తిగతమైనవాడైయున్నాడు. కాబట్టి, మన పాపము వ్యక్తిగతముగా దేవునికి విరోధముగా చేయబడినది. లేఖనములను నేను అవగాహన చేసుకున్న ప్రకారం, మన పాపము అన్నిటి కంటే ఎక్కువగా మన సృష్టికర్తను మోసము చేయుట. మరియు, మన పాపము మోసము చేయుటను పోలియున్నది కాబట్టి, దానిని సరిచేయుటకు మనము ఏమి చేయలేము. మోసము చేసినప్పుడు మోసపోయిన వారు మాత్రమే ఏదో ఒకటి చేయగలరు. అందు వలనే, దేవుడు మన అనుబంధము యొక్క విరిగినతనమును తీసుకొని దానిని సరిచేస్తేనే మనము విమోచన పొందగలము. పాపము మానవ పరిస్థితి మీద ప్రభావము చూపిన విధానమును బట్టి కూడా మనకు విమోచాకుడు కావాలి. అది మనలను పట్టించింది. మనము దేవునికి తిరుగుబాటు చేసి మన మీద మనము ధ్యాస పెట్టినప్పుడు, అది

> మనలను ఒక గురుత్వాకర్షణ శక్తిలో పట్టించింది మరియు దేవుని కృపా కనికరము లేకుండా మన హృదయాలను మరియు జీవితాలను దేవుని వైపుకు తిప్పలేము, మరియు మన సొంత పాపముల నుండి తప్పించుకోలేము. కాబట్టి దేవునితో మొదటిగా సంధి ఏర్పరచు విమోచకుడు మాత్రమే మనలను రక్షించగలడు, మరియు మన పాప పరిస్థితిలోనికి ప్రవేశించి పాపపు శక్తిని తీసివేయగలవాడు మాత్రమే మనలను రక్షించగలడు.
>
> — డా. స్టీవ్ బ్లేక్ మోర్

మానవాళి పాపములోనికి పతనమగుట ద్వారా వచ్చు వ్యక్తిగత పరిణామాలను చూసిన పిమ్మట, దాని యొక్క సార్వత్రిక పరిణామాలను చూచుటకు మనము సిద్ధముగా ఉన్నాము.

## సార్వత్రిక పరిణామాలు

మానవాళి దేవుని రాజ్య ప్రణాళికలకు ఎంత ప్రాముఖ్యమైన వారిగా ఉన్నారంటే, మన తిరుగుబాటు సర్వలోకము మీదికి శాపమును కొనితెచ్చింది. ఆ సమయము నుండి, మానవ సమాజము దేవుని మహిమ కొరకు గాక సొంత మహిమ కొరకు నివసించుట ఆరంభించింది. మనము ఒకరితో ఒకరము అన్యాయముగాను అక్రమముగాను వ్యవహరించాము. మరియు మనము తరచుగా దేవుని చిత్తమునకు విరోధముగా తిరుగుబాటు చేశాము, ఒక దయగల రాజు మరియు సృష్టికర్తగా ఆయన పరిపూర్ణమైన మహిమను భూమి మీద ఆయన రాజ్యము ప్రతిబింబించలేకపోయింది. ప్రాకృతిక ప్రపంచము కూడా ప్రభావితము చేయబడింది. కుళ్ళిపోవుట మరియు మరణము భూమిని మరియు దానిలోని సృష్టములను భ్రష్టుపట్టించి కృశింపజేసింది. సృష్టిలోని ప్రతి అంగమునకు రక్షణ మరియు విమోచన కావాలి.

ఈ పాఠంలో, పతనము యొక్క రెండు సార్వత్రిక పరిణామాల మీద దృష్టిపెడదాము, అది దేవుని రాజ్య రాకడను ఆలస్యం చేసింది అను వాస్తవముతో ఆరంభిద్దాము.

**దేవుని రాజ్యము ఆలస్యమగుట.** ఆది. 2:8లో మనము చదువునట్లు, దేవుడు లోకమును సృజించినప్పుడు, ఏదెను వనము మాత్రమే పరదైసు వలె ఉండేది. మిగిలిన లోకమంతా అభివృద్ధి లేనిదిగాను క్రూర అరణ్యముగాను ఉండేది. ఆది. 1:28 ప్రకారం, భూమిని లోపరచుకొనుట మానవుని బాధ్యతయైయుండినది, అనగా, సర్వలోకము దేవుని ప్రత్యేకమైన తోటగా ఉండునట్లు దానిని సాగుచేసి దానిలో మానవ సమాజములను స్థాపించు బాధ్యత వారికి ఇవ్వబడినది. దేవుని సేవక రాజులుగా మనము దానిని యేలవలసియుండినది, మరియు ఆయన మహిమగల పరలోక రాజ్యము ఆయన భూమి మీద ఉన్న సృష్టి అంతటిలో వ్యాపింపజేయు బాధ్యత మనకు ఇవ్వబడినది. ఈ పని పూర్తైన తరువాత, ఆయన ప్రత్యేకమైన భూలోక రాజ్యముగా లోకమును స్వాధీనపరచుకొనుట దేవుని ప్రణాళికయైయుండినది.

అయితే మానవాళి పాపములోనికి పడిపోవుట లోకము యొక్క సరైన సాగును మరియు దాని మీద మన పరిపాలనను ఆలస్యం చేసింది. మరియు అది దేవుని రాజ్య రాకడను కూడా ఆలస్యం చేసింది. సాగుచేసి పాలించుటకు మనము చేసిన ప్రయత్నాలను కూడా పాపము పాడుచేసింది, మరియు మన

లోకము దేవుడు స్వాధీనపరచుకొనుటకు తగినదిగా లేకపోయింది. నిస్సందేహంగా, మానవులు భూమిని సఫలీకృతముగా నింపారు. అయితే మనము స్థాపించిన సమాజములు మనకు ఆజ్ఞాపించబడిన సమాజములంత పరిపూర్ణముగా ఉండలేకపోయాయి. యుద్ధములు, నేరము, కలహము, మరియు అబద్ధ మతము వ్యాప్తి చెందాయి, మరియు సంఘములో కూడా దేవుని పట్ల విశ్వాసము మరియు సమర్పణలేమిగల ప్రజలను ఎక్కువగా మనము చూస్తాము. మరియు లోకములో ఉన్న ఈ పాపము కారణంగా, దేవుని రాజ్యము పరిపూర్ణముగా ఉనికిలోనికి రాలేదు. 2 పేతురు 3:11-12లో పేతురు ఈ సమస్యను గూర్చి మాట్లాడుతున్నాడు:

> **దేవుని దినపు రాకడకొరకు కనిపెట్టుచు, దానిని ఆశతో అపేక్షించుచు, మీరు పరిశుద్ధమైన ప్రవర్తనతోను భక్తితోను ఎంతో జాగ్రత్తగలవారై యుండవలెను (2 పేతురు 3:11-12).**

ఒక విధముగా, ఆయనకు నచ్చినప్పుడు దేవుడు ఈ భూమి మీదికి రాజ్యమును తీసుకొనిరాగలడు, ఎందుకంటే లోకములోని పాపమును తనకు నచ్చినప్పుడు శుద్ధి చేసే శక్తి దేవునికి ఉన్నది. అయితే విమోచకుడైన యేసు క్రీస్తు ద్వారా దీనిని చేయుట దేవుని ప్రణాళికయైయుండినది. మరియు ఈ లేఖనభాగములో, ఈ లోకములో ఉన్న భ్రష్టత్వముకు వ్యతిరేకముగా పోరాడుట ద్వారా, మనము సృష్టిని దాని యొక్క వాస్తవిక ఉద్దేశము వైపుకు నడిపించవచ్చు, మరియు దేవుడు భూమి మీద నివసించుటకు వచ్చు సమయమును త్వరపెట్టవచ్చు అని పేతురు బోధించాడు.

నిరర్థకత్వమునకు లోనగుట మనము ప్రస్తావించు పతనము యొక్క రెండవ సార్వత్రిక పరిణామమైయున్నది.

**నిరర్థకత్వమునకు లోనగుట.** శ్రమ మరియు బాధ మానవ అనుభవములోనికి ప్రవేశించినప్పుడు, మిగిలిన సృష్టి అంతటి యొక్క శాంతి మరియు ఫలమునకు ఆటంకం కలిగినది. నేల శపించబడింది, మరియు అది ముండ్ల తుప్పలను గచ్చ పొదలను మొలిపించుట ఆరంభించింది, మరియు సృష్టి యావత్తు గలిబిలి మరియు భ్రష్టత్వము ద్వారా ప్రభావితము చేయబడింది.

రోమా. 8:20-22లో, సృష్టి వ్యర్థపరచబడి, అది నాశనమునకు లోనయిన దాస్యములో ఉండినది, మరియు ప్రసవవేదన వలె మూలుగుచున్నదని పౌలు ఈ శాపమును వివరించాడు. మరొక మాటలో, అది అందించవలసియుండిన మంచి ఉత్పత్తిని సృష్టి ఇక ఉత్పత్తి చేయలేదు, మరియు దేవుడు ఆశించిన పూర్ణమైన లోకముగా ఉండే సామర్థ్యమును కూడా అది కోల్పోయింది.

ఇది ఎంత సత్యమో మన చుట్టూ ఉన్న లోకమును ఒక సారి చూస్తే నిర్ధారణ అవుతుంది. మన సముద్రతీరములలో గాలి తుఫానులు గలిబిలి కలిగిస్తున్నాయి. భూకంపములు పట్టణములను మరియు గ్రామాలను నాశనం చేస్తున్నాయి. వరదలు కొన్ని సార్లు గ్రామాలు గ్రామాలనే తుడిచిపెడుతున్నాయి. పురుగులు, జంతువులు మరియు రోగము పంటలను నాశనం చేస్తున్నాయి. అనారోగ్యం మరియు గాయములు కొన్ని లక్షల మందికి శ్రమను మరణమును కలిగించాయి. పతనము యొక్క పరిణామాలు ప్రతి చోట కనిపిస్తాయి. మరియు దేవుడు ఈ లోకమును మరలా సరిగా చేయగల ఏకైక మార్గము సృష్టిని ఈ శాపము నుండి విమోచించుటయే.



వీడియోలు, అధ్యయన మార్గదర్శిలు, మరియు ఇతర నిధుల కొరకు థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్ ను thirdmill.org నందు సందర్శించండి.

ఆదాము హవ్వలు పాపము చేసినప్పుడు సృష్టికి మరియు మానవాళికి కలిగిన పరిణామాలు మానవాళి సృష్టించబడిన ఉద్దేశము కారణంగా చాలా విశాలమైనవిగా ఉండినవి. మానవులు భూమిని పాలించుటకు స్త్రీ పురుషులుగా చేయబడ్డారని ఆదికాండము మనకు తెలియజేస్తుంది. ఈ విధముగా, దేవునికి సృష్టికి మధ్య మధ్యవర్తిగా, మానవులు చేసిన పని యొక్క ప్రభావం సృష్టియావత్తు మీద పడింది. కాబట్టి, ఇది ఆదాము మంటి నుండి చేయబడుటలో స్పష్టపరచబడింది, మరియు సృష్టించబడిన వస్తువుల యొక్క గమ్యం మానవులు చేయు క్రియలతో ముడిపడిపోయింది. ఆదాము హవ్వలు పాపము చేయుటలో మనము గురుగులను చూశాము మరియు లోకము ఇప్పుడు జీవమునకు సృష్టికి విరోధముగా నిలబడింది. ఈ విధముగా, సృష్టిని నడిపించుటకు బదులుగా లేక దేవుని క్రమములో మరియు దేవునితో అనుబంధములో సృష్టిని నడిపించుటకు బదులుగా, దీనికి వ్యతిరేకము జరిగింది మరియు మానవ పాలన, మానవ దుశాసనము సృష్టిని నాశనములోనికి దేవుని నుండి దూరముగా నడిపించింది. పౌలు ఈ అంశమును గూర్చి రోమా. 8లో మాట్లాడుతూ అంటాడు, లోకములో కొనసాగుచున్న శ్రమలు – అవి ప్రకృతి వైపరీత్యాలు కావచ్చు, మనము కలిగియున్న అనారోగ్యము కావచ్చు – సృష్టి నిరర్థకత్వమునకు అప్పగించబడుటకు సంబంధించినవే, మరియు అది మన చేతులలో పెట్టబడగా దానిని మనము పాపపు పాలనలో విసర్జించాము. అయితే సృష్టిని గూర్చి మానవ రీతిలో మాట్లాడుతూ ఆయన అంటాడు, "దేవుని కుమారుల ప్రత్యక్షత కొరకు సృష్టి మిగుల ఆశతో తేరి చూచుచు కనిపెట్టుచున్నది." ఎందుకంటే, మానవాళి చేసిన కార్యము కారణంగా సృష్టి శపించబడినట్లే, సృష్టి రక్షింపబడగలదు కూడా, మరియు మనము మునుపెన్నడూ చూడని విధముగా మానవాళి ద్వారా దేవుని ఆధీనంలో సృష్టియావత్తు సరిగా పనిచేయగలదు, కాని రెండవ ఆదాము వచ్చి మానవాళి యొక్క వాస్తవిక ఉద్దేశమును నెరవేర్చి దేవుని పరిపాలనలో అది ఉండవలసిన విధముగా సృష్టికి ఆజ్ఞను ఇచ్చి దాని యొక్క సరియైన పరిపాలనను జరిగించినప్పుడు ఇది నెరవేరుతుంది. మరియు ఇది యెషయా 11లో ఆశించబడుట మనము చూస్తాము, అక్కడ ఆయన జంతు రాజ్యములో, మానవులకు జంతువులకు మధ్య శాంతిని పునరుద్ధరించిన పిమ్మట ఒక మహిమకరమైన సృష్టి నియమము కొరకు మనము ఎదురుచూచుచున్నాము. మరియు ఇది ఆయన స్వరూపములుగా దేవుని చిత్తమును నెరవేర్చునట్లు దేవునికి సృష్టికి మధ్య మధ్యవర్తి పాత్రను పోషించు విధానము మీద ఆధారపడియున్నది.

— డా. జాన్ మెకిన్లే



వీడియోలు, అధ్యయన మార్గదర్శిలు, మరియు ఇతర నిధుల కొరకు థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్ ను thirdmill.org నందు సందర్శించండి.

మానవాళి పాపములోనికి పడిపోవుటకు వ్యక్తిగత పరిణామాలు మరియు సార్వత్రిక పరిణామాలను మనము పరిగణించాము కాబట్టి, పతనము తరువాత కుమారుడు మనకు అనుగ్రహించిన నిరీక్షణను చూచుటకు మనము సిద్ధముగా ఉన్నాము.

## మానవాళి కొరకు నిరీక్షణ

మానవాళి విమోచన కొరకు ప్రణాళికను బయలుపరచుటకు దేవుడు ఎక్కువ సమయమును తీసుకోలేదు. వాస్తవానికి, దేవుడు వారిని శపించాడు అనే సత్యములో మానవాళి కొరకు నిరీక్షణ యొక్క మొదటి సూచనలు కనిపించాయి. ఆది. 2:17లో, మంచి చెడ్డల తెలివినిచ్చు జీవ వృక్షఫలమును తింటే మానవాళిని చంపుతానని దేవుడు హెచ్చరించాడు. అయితే ఆదాము హవ్వలు విసర్జించబడిన వృక్ష ఫలమును తినప్పుడు, వారు వెంటనే మరణించలేదు. బదులుగా, వారి మరణములను ఆలస్యము చేయుట ద్వారా దేవుడు కొంత కరుణను వారికి చూపాడు. మరియు కొంత కాలము వరకు ఆయనను సేవించుటకు మానవాళికి అవకాశమిచ్చి ఆయన మరింత కరుణను చూపాడు. ఆయన సృష్టి ప్రణాళికలో నుండి వారిని నిర్మూలించుటకు బదులుగా, మానవాళిని తన కార్యముల యొక్క కేంద్ర భాగములో ఉంచుట కొనసాగించాడు.

తరువాత దేవుడు మరింత కరుణగల పని చేశాడు: అపవాది యొక్క ప్రణాళికలను నాశనము చేసి దేవుని ప్రజలను నమ్మకత్వములోనికి నడిపించుటకు ఒక విమోచకుని పంపుతానని ఆయన వాగ్దానం చేశాడు. విమోచకుని గూర్చి చేయబడిన ఈ మొదటి ప్రస్తావనను “మొదటి సువార్త” అని అంటారు, మరియు అది ఆదాము హవ్వలు పాపము చేసినప్పుడు సర్పమును దేవుడు శపించుటలో కనిపించింది.

ఆది. 3:15లో ఈ శాపమును చూడండి:

> మరియు నీకును స్త్రీకిని నీ సంతానమునకును ఆమె సంతానమునకును వైరము కలుగజేసెదను. అది నిన్ను తలమీద కొట్టును; నీవు దానిని మడిమె మీద కొట్టుదువని చెప్పెను (ఆది. 3:15).

పతనములో, ఆదాము హవ్వలు దేవునికి వేరుగా తిరుగుబాటు చేసిన సర్పముతో జతకలిసారు. అయినను, దేవుడు తన ప్రజలను విడిచిపెట్టలేదు. సర్పమును శపించుటలో, సర్పమును ఓడించుట ద్వారా స్త్రీ సంతతి తుదకు మానవాళిని విమోచిస్తాడని దేవుడు వాగ్దానం చేశాడు.

ఈ సర్పమే అపవాది అని ప్రకటన 12:9 మరియు 20:2 బోధిస్తుంది. కాబట్టి, ఈ మొదటి సువార్త ఒక జంతువును శపించు వాగ్దానము మాత్రమే కాదు అని ఇవాంజెలికల్ వేదాంతవేత్తలు తరచుగా అర్థము చేసుకున్నారు. బదులుగా, సర్పము యొక్క తలను చితకద్రొక్కుటకు విమోచకుని పంపుతానని దేవుడిచ్చిన వాగ్దానము పాపము యొక్క పరిణామాల నుండి మానవ జాతిని విమోచిస్తానని చేసిన వాగ్దానమైయున్నది – అపవాదితో వారు చేసుకున్న అనుబంధము నుండి వారిని తొలగించుటకు, మరియు రాజ్యములోని నమ్మకమైన పౌరులుగా వారితో ఆయన యొక్క సహవాసమును పునరుద్ధరించుటకు.



వీడియోలు, అధ్యయన మార్గదర్శిలు, మరియు ఇతర నిధుల కొరకు థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్ ను thirdmill.org నందు సందర్శించండి.

ఈ ఆదిమ సువార్త రూపకములు ఆది. 3:21లో కొనసాగుతాయి, అక్కడ ఆదాము హవ్వల దిగంబరత్వమును మరియు అవమానమును కప్పిపుచ్చుటకు దేవుడు వారికి చర్మ వస్త్రములను అనుగ్రహించాడు. ఇది దేవుని యొక్క కొనసాగు ప్రేమను మరియు మానవాళి కొరకు ఆయన ఇచ్చిన దైవకృతమును మాత్రమే కనుపరచలేదుగాని, దేవుని ప్రజలను విమోచించి వారి పాపమును కప్పుటకు ఇవ్వబడు ఒక సంపూర్ణమైన బల్యర్పణ దినము కొరకు ఎదురుచూసింది. మరియు క్రొత్త నిబంధన స్పష్టము చేయుచున్నట్లు, ఈ బల్యర్పణ దేవుని కుమారునిదైయుంటుంది.

నిత్యత్వములో కుమారుని గూర్చి, సృష్టిలో ఆయన కార్యమును గూర్చి మనము చూశాము కాబట్టి, మన మూడవ ముఖ్య అంశమును చూచుటకు మనము సిద్ధముగా ఉన్నాము: విమోచనలో దేవుని కార్యము.

## విమోచనము

ఆదాము హవ్వలు పాపములో పడిపోవుట మానవాళి కొరకు మరియు సృష్టియావత్తు కొరకు తీవ్రమైన పరిణామములను కలిగించింది. అయితే దేవుడు మన పాపము కంటే గొప్పవాడు. మన మొదటి తల్లిదండ్రులు మానవ జాతిని నాశనములోనికి నడిపిన వెంటనే, దేవుడు మన కొరకు ఆయన కలిగియుండిన ప్రణాళికలను బయలుపరచాడు. ఆరంభము నుండే, పాపులకు రక్షణను కలిగించి సృష్టించబడిన లోకమును పునరుద్ధరించుటకు తండ్రి ఆయన కుమారుని విమోచకునిగా నియమించాడు.

విమోచన యొక్క చారిత్రిక యుగము ఆది. 3వ అధ్యాయములో పతనముతో ఆరంభమై, యేసు తిరిగివచ్చినప్పుడు భూమ్యాకాశముల యొక్క ముగింపు వరకు కొనసాగుతుంది అని గుర్తించవచ్చు. ఈ విమోచనా కాలములో కుమారుని యొక్క కార్యము పాపుల యొక్క క్షమాపణ మరియు రక్షణ ద్వారా ముఖ్యముగా చిత్రీకరించబడింది. పతనము తరువాత వెంటనే హవ్వ సంతతిలో ఒకరు భవిష్యద్ విమోచనను అనుగ్రహిస్తారు అనే దాని ఆధారంగా ఆదాము హవ్వలు దేవుని కరుణను పొందుకునప్పుడే కుమారుడు పాపులను రక్షించుట ఆరంభించాడు. మరియు ప్రతి యుగములోను ఆయన పాపులను రక్షిస్తు వస్తున్నాడు — పాపములను ఒప్పుకొని, విశ్వాసముతో ఆయన తట్టు తిరుగువారందరిని.

మూడు ముఖ్య ఆలోచనలను గూర్చి చర్చించుట ద్వారా విమోచనా కాలములో కుమారుని యొక్క పాత్రను మనము పరిశీలన చేద్దాము: మొదటిగా, పాపులను విమోచించుటకు కుమారుడు కలిగియుండిన హేతువు; రెండవదిగా, పాపుల యొక్క విమోచనమును నిశ్చయించిన తండ్రి కుమారునితో చేసిన వాగ్దానము; మరియు మూడవదిగా, ఈ విమోచనమును నెరవేర్చుటకు కుమారుడు చేసిన కార్యము. పాపులను విమోచించుటకు కుమారుడు కలిగియుండిన హేతువుతో ఆరంభించుదాము.

### హేతువు

పాపులను విమోచించుట కొరకు కుమారుడు కలిగియున్న హేతువు చాలా క్లిష్టమైనది, మరియు దీనిని అనేక విధాలుగా వివరించవచ్చు. త్రిత్వమునకు మహిమను తేవాలని ఆయన కలిగియుండిన ఆశ

ద్వారా ఆయన పురికొల్పబడ్డాడు. సృష్టి దాని ఉద్దేశమును నెరవేర్చాలనే ఆశ ద్వారా ఆయన పురికొల్పబడ్డాడు. కరుణ, న్యాయముల కొరకు అయన కలిగియుండిన వాంఛ ద్వారా ఆయన పురికొల్పబడ్డాడు. అయితే విమోచన కొరకు కుమారుడు కలిగియుండిన హేతువులలో లేఖనము వర్ణించు సుపరిచితమైన మాటలలో ఒకటి "ప్రేమ" — దేవునిపై ప్రేమ, సృష్టిపై ప్రేమ మరియు మానవులపై ప్రేమ. మరియు ఈ ప్రేమ కేవలం కుమారునికి మాత్రమే పరిమితము కాలేదు; త్రిత్వములోని ముగ్గురు పురుషమూర్తులు దీనిని పంచుకున్నారు.

> దేవుడు ప్రేమయైయున్నాడు గనుక మనలను విమోచించుటకు ఆయన పురికొల్పబడ్డాడు. దీనిని గూర్చి లేఖనములు స్పష్టముగా మాట్లాడతాయి — 1 యోహాను 4:8లో "దేవుడు ప్రేమస్వరూపి." యోహాను 3:16 లోకములో అత్యంత సుపరిచితమైన బైబిలు వచనమైయున్నది, "దేవుడు లోకమును ఎంతో ప్రేమించెను," అయితే రక్షించి విమోచించుటకు ఆయనను ఏది పురికొల్పుతుంది? ఆయన ప్రేమ. ఆయనను యెరుగాలని, ఆయనతో అనుబంధములో నివసించాలని, ఆయనలో పరిపూర్ణులు కావాలని, సృష్టి నిమిత్తము, ముఖ్యముగా మానవ సృష్టి నిమిత్తము ఆయన కలిగియుండిన కోరిక మరియు రూపకల్పన, ప్రజలు ఆయనను తెలుసుకొనుటకు ఒక మార్గమును సిద్ధపరచింది, మరియు ప్రేమించు మంచి దేవునిగా ఆయనను మహిమపరచింది. కాబట్టి మన కొరకు దేవుడు కలిగియున్న ప్రేమ మనలను విమోచించునట్లు ఆయనను పురికొల్పుతుంది.
>
> — డా. స్టీవ్ బ్లేక్ మోర్

విమోచనలో కుమారుడు పాత్ర వహించుటకు దేవుని ప్రేమ హేతువైయున్నదని మూడు ఆలోచనలను పరిగణించుట ద్వారా చూద్దాము, త్రిత్వములోని ముగ్గురు పురుషమూర్తుల మధ్య ఉన్న ప్రేమతో ఆరంభిద్దాము.

### త్రిత్వము

ఆయన మనలను ప్రేమించాడు కాబట్టి దేవుడు మానవాళిని విమోచించుటకు నిర్ణయించుకున్నాడు అనుటకు ఏ సందేహము లేదు. అయితే మనము కొన్నిసార్లు మరచిపోయే విషయము ఏమిటంటే, మానవాళి కొరకు దేవుడు కలిగియున్న ప్రేమ తండ్రి కుమారుని మీద కలిగియున్న ప్రేమలో ఒక అంశమైయున్నది. మనలను రక్షించుటకు తండ్రి తీసుకున్న నిర్ణయాన్ని ఎఫెసీ. 1:4-6లో పౌలు వివరించిన విధానమును వినండి:

> తన ప్రియునియందు తాను ఉచితముగా మనకనుగ్రహించిన తన కృపామహిమకు కీర్తి కలుగునట్లు, తన చిత్త ప్రకారమైన దయాసంకల్పముచొప్పున, యేసుక్రీస్తు ద్వారా తనకు కుమారులనుగా స్వీకరించుటకై, మనలను ముందుగా తన కోసము నిర్ణయించుకొని, మనము తన యెదుట పరిశుద్ధులమును నిర్దోషులమునై



వీడియోలు, అధ్యయన మార్గదర్శిలు, మరియు ఇతర నిధుల కొరకు థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్ ను thirdmill.org నందు సందర్శించండి.

> యుండవలెనని జగత్తు పునాది వేయబడకమునుపే, ప్రేమచేత ఆయన క్రీస్తులో మనలను ఏర్పరచుకొనెను (ఎఫెసీ 1:4-6).

తాను ప్రేమించు, యేసు క్రీస్తులో, మరియు క్రీస్తు ద్వారా మనలను విమోచించుటకు దేవుడు నిర్ణయించుకున్నాడని ఈ చిన్న లేఖన భాగములో మూడు సార్లు పౌలు ప్రస్తావిస్తున్నాడు. మరియు ఆయన ఇక్కడ తెలియజేయాలనుకొనుచున్న ఒక విషయము ఏమనగా, కుమారుని మీద తండ్రి కలిగియున్న ప్రేమలో నుండి మన కొరకు దేవుడు కలిగియున్న ప్రేమ పుడుతుంది. త్రిత్వము-మధ్య ఉన్న ప్రేమ మన విమోచన యొక్క ముఖ్య హేతువుగా ఉన్నది. రోమా. 8:39 మరియు 1 తిమోతి 1:14లో కూడా మనము ఇలాంటి బోధలనే చూడవచ్చు.

కుమారుని యెడల తండ్రి కలిగియున్న ప్రేమ మన విమోచనకు ఎంతో ముఖ్యమైయున్నదనే సత్యమును క్రొత్త నిబంధన మరలా మరలా ప్రస్తావిస్తుంది. మత్తయి 3:17, మరియు 17:5; మరియు 2 పేతురు 1:17లో మనము చూచునట్లు, యేసు బాప్తిస్మము మరియు రూపాంతరములో తండ్రి దీనిని నిర్ధారించాడు. యోహాను 3:35 మరియు 5:20-23లో విమోచించుటకు మరియు తీర్పు తీర్చుటకు తనకు ఉన్న అధికారమును వర్ణిస్తూ యేసు దీనిని ప్రస్తావించాడు. కొలస్సీ. 1:13-14లో, విమోచన అనేది తండ్రి ప్రేమించు కుమారుని రాజ్యములో పౌరత్వమని పౌలు వివరిస్తున్నాడు.

అయితే ఈ ప్రేమ దిశలేనిది కాదు. అది మహిమపరచబడుటకు మరియు విధేయతను అందుకొనుటకు, దేవుని మహిమ హెచ్చించబడి ప్రచురించబడుటకు, ఆయన ఉద్దేశములు నెరవేర్చబడుటకు, సృష్టియావత్తు మీద ఆయన పరిపాలన గుర్తించబడి స్తుతింపబడుటకు త్రిత్వములోని సభ్యులు కలిగియున్న ఆశను కలిగియున్నది. సృష్టి కొరకు దేవుడు కలిగియున్న ఉద్దేశములలో మానవాళి కేంద్రమైయున్నది కాబట్టి, మన విమోచన త్రిత్వములోని ప్రేమ యొక్క స్వాభావిక పరిణామమైయున్నది.

> మనము లేకుండా ఆయన ఉండలేడు కాబట్టి దేవుడు మనలను విమోచించుట లేదు లేక విమోచింపబడిన మానవాళి లేకుండా ఆయన ఒంటరితనమును అనుభవిస్తున్నాడు కాబట్టి ఆయన మనలను విమోచించుట లేదని గుర్తించుట ఎంతో అవసరము. దేవుడు స్వతంత్రుడు. ఆయనకు అవసరతలు లేవు. ఆయనకు మన అవసరత లేక మిగిలిన సృష్టి యొక్క అవసరత ఏ విధముగా లేదు. కాబట్టి దేవుడు అవసరతను తీర్చుకొనుటకు సృష్టించుట లేదని మనకు తెలుసు. ఆయన అవసరతలో ఉండి విమోచన ఇచ్చుటలేదు. ఆయన విమోచన కార్యమును, సృష్టిని మరియు చేయు ప్రతిదానిని తన మహిమ నిమిత్తము, ఆయన స్వభావమును ప్రచురపరచుటకు చేస్తున్నాడు, తద్వారా ఆయన మహిమను ప్రచురపరచు ఆకాశములు మొదలుకొని ఆయన స్వరూపములో చేయబడిన మానవాళి వరకు ఆయన మహిమను ప్రతిబింబించువారిగా ఉండాలి, వారి ద్వారా ఆయన తన స్వభావమును చూపుతాడు, తన పరిశుద్ధతను, ఆయన యోగ్యతను మరియు సౌందర్యమును కనుపరుస్తాడు. ఉన్నతమైన ముగింపు కొరకు ఆయన

> సమస్తమును చేస్తాడు. అయితే, ఆయన ఎందుకు విమోచిస్తాడు? విమోచించబడిన సృష్టి ద్వారా ఆయన మహిమను కనుపరచుటకు ఆయన విమోచిస్తాడు.
>
> — డా. కే. ఎరిక్ థోయెన్స్

## సృష్టి

రెండవదిగా, సృష్టి పట్ల దేవుడు కలిగియున్న ప్రేమ కూడా విమోచనలో కుమారుని యొక్క పాత్రను పురికొల్పింది. విమోచనలో కుమారుని యొక్క పాత్ర సృష్టి కొరకు దేవుడు కలిగియున్న ప్రేమ ద్వారా పురికొల్పబడింది అను విషయము అనేక విధాలుగా రుజువవుతుంది. ఆయన చేసిన ప్రతి దాని కొరకు ఒక సృష్టికర్తగా ఆయన కలిగియున్న శ్రద్ధలో, ముఖ్యముగా ఆయన స్వరూపములో చేయబడిన మానవాళి మీద ఆయన కలిగియున్న ప్రేమలో దీనిని మనము చూడవచ్చు.

దీనికి ఉత్తమమైన ఉదాహరణ యోహాను 3:16-18, అక్కడ మనము ఈ విధముగా చదువుతాము:

> దేవుడు లోకమును ఎంతో ప్రేమించెను. కాగా ఆయన తన అద్వితీయకుమారునిగా పుట్టిన వానియందు విశ్వాసముంచు ప్రతివాడును నశింపక నిత్యజీవము పొందునట్లు ఆయనను అనుగ్రహించెను. లోకము తన కుమారుని ద్వారా రక్షణ పొందుటకేగాని లోకమునకు తీర్పు తీర్చుటకు దేవుడాయనను లోకములోనికి పంపలేదు. ఆయనయందు విశ్వాసముంచువానికి తీర్పు తీర్చబడదు; విశ్వసింపనివాడు దేవుని అద్వితీయకుమారుని నామమందు విశ్వాస ముంచలేదు గనుక వానికి ఇంతకు మునుపే తీర్పు తీర్చబడెను (యోహాను 3:16-18).

యోహాను లోకము అను పదమును అనేక విధాలుగా ఉపయోగించాడని మనము గుర్తించాలి. అనేక సందర్భాలలో, ఆయన విశ్వమును, భూమిని, సమస్త మానవాళిని, అనేకమంది ప్రజలను, దేవుని వ్యతిరేకించు ప్రజలను, మరియు మానవ విలువలు ఆచారముల వ్యవస్థలను సంబోధించుటకు ఉపయోగించాడు. అయితే ఈ సందర్భములో, అతడు ఇక్కడ సృష్టిని లేక సృష్టిలోని మానవాళిని సంబోధించుట కొరకు ఈ పదమును ఉపయోగించాడు.

దేవుని ప్రేమ లోకమును రక్షించుటకు ఆయనను పురికొల్పింది అనేది యోహాను 3:16-18 యొక్క మౌలిక ఆలోచనయైయున్నది. లోకము ఆయన మహిమగల రాజ్యముగా ఉండి, ఆయన సేవకులు మరియు స్వరూపములైన మానవాళి ద్వారా నింపబడి పాలించబడాలని ఆయన కోరాడు. కాబట్టి, మానవులలో నుండి ఒక విశ్వసించు శేషమును విమోచించుటకు ఆయన తన కుమారుని పంపుటకు నిర్ణయించుకున్నాడు. విశ్వాసులను రక్షించుట ద్వారా, దేవుడు ఒక నూతన మానవాళిని సృష్టిస్తాడు. తరువాత ఆయన భూమ్యాకాశములను ఆయన మహిమగల రాజ్యముగా మరియు ఆయన నూతనముగా విమోచించిన మానవాళికి గృహముగా నూతనపరచుతాడు. రోమా. 8:20-22; 2 పేతురు 3:13; మరియు ప్రకటన 21:1-4 వంటి వాక్యభాగాలలో ఈ ఆలోచనను మనము చూడవచ్చు.

## విశ్వాసులు

మూడవదిగా, విశ్వాసుల పట్ల దేవుడు కలిగియున్న ప్రేమ కూడా విమోచనలో కుమారుని పాత్రను పురికొల్పింది. లేఖనములోని అనేక భాగాలలో, దేవుడు విశ్వాసులను ప్రత్యేకముగా ప్రేమించినట్లు మనము చూడవచ్చు. ఆయన మనతో సహవాసము చేయాలని, మనలను దీవించాలని ఆశించుచున్నాడు. మనము ఆయనను తిరిగి ప్రేమించాలని, ఆయనతో నిత్య అనుబంధము ఆస్వాదించాలని ఆయన కోరుచున్నాడు. వాస్తవానికి, విశ్వాసులపట్ల దేవుని ప్రేమ ఎంత విశేషమైనదంటే, మనము పుట్టక మునుపే దేవుడు మనలను ఎరిగియుండి ప్రేమించాడని బైబిలు బోధిస్తుంది. దీనిని మనము రోమా. 8:29-39; ఎఫెసీ. 1:4-12; మరియు 1 పేతురు 1:2లో చూడవచ్చు. విమోచనను సాధించుట కొరకు కుమారుని పంపుటకు తండ్రి కలిగియున్న హేతువులో, దేవుని చిత్తమును జరిగించుటకు కుమారుడు కలిగియున్న ఆశలో విశ్వాసుల పట్ల దేవుడు కలిగియుండిన ప్రేమ ముఖ్యమైన భాగమైయున్నదని లేఖనము స్పష్టము చేస్తుంది. ఇది యోహాను రచనలలో, ముఖ్యముగా యోహాను 16:27; మరియు 1 యోహాను 3:16, మరియు 4:10-19లో మరింత స్పష్టముగా అగుపడుతుంది.

దేవుడు చేయు ప్రతి పని కూడా కొంత వరకు తన ప్రజల కొరకు ఆయన కలిగియున్న ప్రేమ ద్వారా పురికొల్పబడుతుంది అని చెప్పుట అతిశయోక్తి కాదు. మరియు దేవుని ప్రేమ అత్యంత పరిపూర్ణముగాను సంపూర్ణముగాను ఆయన కుమారునిలో బయలుపరచబడింది. జీవితములో మనమంతా సంఘర్షణలను ఎదుర్కొంటాము, మరికొన్ని సార్లు దేవుడు మనలను ప్రేమిస్తున్నాడు అన్న విషయమును కూడా సందేహిస్తాము. అయితే మనము సంఘర్షించునప్పుడు లేక సందేహించునప్పుడు దేవుడు మనలను తక్కువ ప్రేమించడు. ఆయన మన పాపమును సంఘర్షణను ఎరిగియుండి కూడా మనలను ప్రేమిస్తున్నాడు అన్నది వాస్తవము. ఆయనయందు మనము విశ్వాసముంచక ముందే, మన పాపము నుండి తప్పించుకోవాలని ఆలోచించక ముందే, దేవుడు మనలను ఎంతగానో ప్రేమించి మనలను విమోచించుటకు తన కుమారుని నియమించాడు. అది ఎంతో పెద్ద పరిహారముగా ఉన్నది — మన పాపముల భారము క్రింద యేసు శ్రమనొంది మరణించవలసి వచ్చింది. అయితే దీనిని ఆయన ప్రేమ కొరకు చేశాడు. ఇప్పుడు ఆయన పునరుత్థానములో, తన ప్రజల కొరకు దేవుడు కలిగియున్న విమోచించు ప్రేమకు యేసు సజీవ సాక్ష్యమయ్యాడు.

విమోచన కొరకు దేవుడు కలిగియున్న హేతువును మనము చూశాము కాబట్టి, ఇప్పుడు విమోచనను నిశ్చయపరచిన దైవిక వాగ్దానములను చూద్దాము.

## వాగ్దానములు

దేవుని వాగ్దానములు మారనివి. అవి ఎన్నడు మారవు, ఆయన వాటి నుండి ఎన్నడు వైదొలగడు. దేవుడు వాగ్దానము చేసిన ప్రతిదానిని ఆయన నిశ్చయముగా నెరవేర్చుతాడు. ఇప్పుడు విమోచనలో కుమారుని యొక్క పాత్రను అర్థము చేసుకొనుటకు ఇది ఎంతో ప్రాముఖ్యమైనది ఎందుకంటే, విమోచన అనునది తండ్రి మరియు కుమారుని మధ్య గల వాగ్దానముల మీద నాటబడియున్నది.

ఈ పాఠంలో ఇంతకు ముందు మనము చూసినట్లు, త్రిత్వములోని పురుషమూర్తులు కొంతమంది "విమోచనా నిబంధన" అని పిలుచు ఒక ఒడంబడికను చేసుకున్నారు, దానిలో పతనమైన మానవాళిని విమోచించుటకు వారు వాగ్దానము చేశారు. ఈ విమోచనా నిబంధన పాపములోనికి పడిపోయిన తరువాత విమోచనను ఏర్పాటు చేయుటకు సిద్ధపరచిన మరొక నిబంధనలోనికి దారి తీసింది అని మనము చూడబోతున్నాము. ఈ తదుపరి నిబంధనను వేదాంతవేత్తలు "కృపా నిబంధన" అని పిలచారు. ఒక వైపు తండ్రి, మరొక వైపు కుమారుడు మరియు విమోచించబడిన మానవాళి మధ్య ఒక పవిత్రమైన ఏర్పాటు చేయబడింది. మరియు మానవాళి పాపములోనికి పడిపోవుట మొదలుకొని, యేసు మహిమలో తిరిగివచ్చినప్పుడు దాని యొక్క అంతిమ నెరవేర్పుకు మధ్య ఉన్న విమోచనా కాలమంతటిని అది నియంత్రిస్తుంది.

ఈ నిబంధనలో, కుమారుని ద్వారా, ప్రత్యేకముగా యేసు క్రీస్తులో కుమారుని యొక్క నరవతారము ద్వారా సృష్టి కొరకు మరియు మానవాళి కొరకు తన రాజ్య ప్రణాళికలను నెరవేర్చుతాను అని దేవుడు వాగ్దానము చేశాడు. దేవుడు ఎన్నుకున్న దావీదు వంశములో మానవునిగా నరవతారము దాల్చుటకు, మరియు విమోచనా నిబంధనలో ముందుగా నియమించబడిన ఆంక్షలన్నియు నెరవేర్చుటకు కుమారుడు వాగ్దానము చేశాడు. పతనమైన మానవాళి కొరకు ఆయన ప్రాయశ్చిత్త మరణము పొందాడు, మరియు పశ్చాత్తాపము ద్వారాను విశ్వాసము ద్వారాను ఆయన తట్టు తిరుగువారు పాపము యొక్క ప్రభావము నుండి, భ్రష్టత్వము నుండి అపరాధ భారము నుండి విమోచించబడతారు. మరియు ఈ వాగ్దానములతో పాటుగా, కుమారుడు రక్షించిన వారికి రక్షణ యొక్క లాభములను అన్వయించుటకు పరిశుద్ధాత్మను పంపుటకు తండ్రి కుమారులిరువురు నిర్ణయించుకున్నారు.

ఆయన ప్రజలతో చేసిన కృపా నిబంధనను నిర్ధారించుటకు దేవుడు చేసిన నిబంధనా వేడుకల యొక్క సంఖ్య ఆధారంగా వేదాంతవేత్తలు కృపా నిబంధనను ఆరు నిర్వహణలుగా విభజిస్తారి. నిబంధనా వేడుక జరిగినప్పుడు దేవుని ప్రజలకు నాయకత్వము వహించిన మనుష్యుల పేర్ల ద్వారా ఈ నిర్వహణలు గుర్తించబడతాయి.

ఇది ఆది. 3లో పతనము తరువాత దేవుని నిబంధన ప్రజలకు నాయకునిగా ఆదాముతో ఆరంభమవుతుంది. దీనిని సాధారణంగా, "ఆదాము నిబంధనా నిర్వహణ" అంటారు, లేక సులువుగా "ఆదాము నిబంధన" అంటారు. ఈ నిర్వహణలో, విమోచన మొదటిగా ఆది. 3:15లో మానవాళికి ఆపాదించబడింది, తరువాత అది "మొదటి సువార్త"గా గుర్తించబడింది.

తరువాతది, ఆది. 6-9లో నోవహుతో చేయబడిన పునరుద్ధరణ నిబంధన. నోవహు నిబంధనా నిర్వహణలో, కుమారుని యొక్క విమోచన కార్యము ముగియు వరకు మానవాళి భద్రపరచబడునట్లు సృష్టిని స్థిరముగా ఉంచుతానని దేవుడు వాగ్దానము చేశాడు.

దీని తరువాత, దేవుడు అబ్రాహాముతో నిబంధన చేశాడు, మరియు ఇది ఆది. 15, 17లో వర్ణించబడింది, మరియు ఆది. 22లో పునరుద్ఘాటించబడింది. ఈ నిబంధన అబ్రాహాము కుటుంబమునకు విశేషమైన అధికారములను బాధ్యతలను ఇచ్చింది, మరియు ఆయన వారసులలో ఒకడు విమోచకుడవుతాడని వాగ్దానము చేయబడింది. గలతీ. 3 ప్రకారం, ఈ ప్రత్యేకమైన వారసుడు యేసే.

గలతీ 3:16లో పౌలు ఏమి వ్రాశాడో వినండి:



వీడియోలు, అధ్యయన మార్గదర్శిలు, మరియు ఇతర నిధుల కొరకు థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్ ను thirdmill.org నందు సందర్శించండి.

> అబ్రాహామునకును అతని సంతానమునకును వాగ్దానములు చేయబడెను; ఆయన అనేకులను గూర్చి అన్నట్టు నీ సంతానములకును అని చెప్పక ఒకని గూర్చి అన్నట్టే నీ సంతానమునకును అనెను; ఆ సంతానము క్రీస్తు (గలతీ 3:16).

అబ్రాహాము నిర్వహణ నిబంధనలో ఉన్న వాగ్దానములు అబ్రాహాముతో మాత్రమేగాక క్రీస్తుతో కూడా చేయబడినవని పౌలు గుర్తించాడు. ఆయన నమ్మకమైన ప్రజలకు నిబంధనా ఆశీర్వాదములను — ముఖ్యముగా పాప విమోచన ఆశీర్వాదమును — తీసుకొనివచ్చు వాగ్దానము చేయబడిన విమోచకుడు దేవుని కుమారుడే.

తరువాత నిబంధన మోషే దినములలో ఇశ్రాయేలుతో చేయబడిన నిబంధన, అది నిర్గమ. 19-24 మరియు ద్వితీయోపదేశకాండములో వివరించబడింది. మోషే నిబంధనా నిర్వహణలో లేక "మోషే నిబంధన"లో, నజరేయుడైన యేసుగా కుమారుడు నరవతారము దాల్చినప్పుడు ఇచ్చు బలికి సాదృశ్యముగా ఉన్న బలుల వ్యవస్థను దేవుడు స్థాపించాడు. ఈ మోషే బలులు సృష్టికి ముందు తండ్రి కుమారులు చేసిన వాగ్దానములకు దృశ్య నిర్ధారణలుగా ఉన్నాయి. మరియు ఈ బలుల ద్వారా, కుమారుడు తుదకు కలిగించు విమోచన యొక్క ముందు రుచిని నమ్మకమైన దేవుని ప్రజలు పొందుకున్నారు.

ఈ కాలములో, ఇశ్రాయేలు రాజులైన యాజక సమూహముగాను పరిశుద్ధ జనాంగముగాను స్థాపించబడిరి. దేవుని నిబంధన పట్ల వారు చూపిన విధేయత ద్వారా, కుమారుడు తుదకు పరిపాలించు భూలోక రాజ్యమును వారు నిర్మించవలసియుండెను.

ఐదవ నిబంధన నిర్వహణ, మరియు పాత నిబంధన కాలము యొక్క ఆఖరి నిర్వహణ, దావీదు ఆధీనంలో జరిగినది, దీనిని తరచుగా "దావీదు నిబంధన" అని పిలుస్తారు. దావీదు యొక్క కృపా నిబంధన నిర్వహణను గూర్చి 2 సమూ. 7, కీర్తనలు 89, 132 వంటి చోట్ల ప్రస్తావించబడింది. ఈ కాలములో, దావీదు వంశములో విమోచకుడు జన్మిస్తాడని, అతడు భూమి మీద దేవుని రాజ్యమును ఆరంభిస్తాడని, మరియు ఆయన నీతిగల పరిపాలన ద్వారా ఆయనయందు విశ్వాసముంచు ప్రతివారికి ఆయన విమోచనను తెస్తాడని దేవుడు వాగ్దానము చేశాడు.

చివరిగా, ఆరవ నిబంధనా నిర్వహణ యేసు దినములలో ఆరంభమై ఆయన తిరిగివచ్చునంత వరకు కొనసాగుతుంది. లూకా 22:20, హెబ్రీ. 9:15 మరియు 12:24లో మనము చూచునట్లు ఈ నిర్వహణను బైబిలు సాధారణంగా "నూతన నిబంధన" అని పిలుస్తుంది. ఈ కృపా నిబంధన యొక్క నిర్వహణలో, విమోచన కార్యమంతా పూర్తిగా నెరవేర్చబడింది. పాపమునకు బలి అర్పించుటకు మరణిస్తానని వాగ్దానము చేయబడిన పాత్రను యేసు నెరవేర్చాడు. తండ్రి ఆయన బలిని అంగీకరించాడు. మరియు తమ విమోచకునిగా యేసును విశ్వసించు ప్రతివారికి పరిశుద్ధాత్మ విమోచనను అన్వయిస్తున్నాడు.

> రక్షణకు ఎల్లప్పుడూ కుమారుడే మార్గమైయున్నాడు. యేసు పరిచర్య కాలమునకు అనుబంధములో విమోచన చరిత్ర యొక్క కాల క్రమములో మీరు నివసించిన సమయము ఆ దృష్టి పునర్విమర్శ కలిగినదో లేదో నిర్థారిస్తుంది, క్రొత్త నిబంధనలో ఉన్న మనము కూడా యేసు పరిచర్యలో నెరవేర్చబడిన



వీడియోలు, అధ్యయన మార్గదర్శిలు, మరియు ఇతర నిధుల కొరకు థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్ ను thirdmill.org నందు సందర్శించండి.

> వాగ్దానములను వెనుకకు తిరిగి చూస్తాము. లేక పాత నిబంధనలో నివసించిన ప్రజలు మనకు కలిగినంత నిశ్చయమైన అవగాహన లేకుండా ఎదురు చూశారు, కాని యేసు యొక్క వ్యక్తిత్వములో నెరవేర్చబడిన లేక ముగింపుపొందిన దేవుని వాగ్దానములకు అనుగుణంగా ఎదురు చూశారు. కాబట్టి, అవును, యేసే ఎల్లప్పుడూ మన రక్షణ యొక్క ఆధారమైయున్నాడు.
>
> — డా. రోబ్ లిస్టర్

> క్రీస్తు రాకడకు ముందు పాత నిబంధనలో ప్రజలు వేరే విధముగా రక్షణ పొందారా అని ఆలోచన చేయువారు అనేకమంది ఉన్నారు. కొందరు ప్రభుత్వము ద్వారా రక్షించబడ్డారు, లేక కొందరు ధర్మశాస్త్రము ద్వారా రక్షింపబడ్డారు, లేక కొందరు ఇతర మార్గముల ద్వారా, అనగా పరిపాలన ద్వారా మరియు ఇశ్రాయేలు ప్రజలలో భాగమైయుండుట ద్వారా రక్షింపబడ్డారు అని అనేక మంది అనేక విధాలుగా జవాబిస్తుంటారు. కొందరు సున్నతి ద్వారా రక్షణ పొందియుండవచ్చు. అయితే మనలను నిజముగా రక్షించు ఒక కార్యమునకు ఇవన్నీ సిద్ధపాటుగా మాత్రమే ఉన్నాయని బైబిలు స్పష్టముగా బోధిస్తుంది. బలుల వ్యవస్థ ఎంత స్పష్టముగా ఉన్నను, అది ఎంత ప్రాముఖ్యముగా ఉన్నను, దేవుని వైపుకు తిరగని హృదయములు కలిగియుంటే వారు బలులు అర్పించుట మానివేయాలని ప్రవక్తలు స్వయంగా ప్రకటించారు. మరియు ఎద్దుల రక్తమును మేకల రక్తమును పాపమును తొలగించలేదు అని హెబ్రీ పత్రిక స్పష్టము చేస్తుంది. ఒకే బలి ఈ పని చేయగలదు. మరియు అది క్రీస్తు వ్యక్తిత్వములోని ప్రత్యేకత ద్వారా కలుగుతుంది. ఆయన ఒకే వ్యక్తిత్వములో ఉన్న దైవ మానవుడు. ఈ వ్యక్తిత్వములో ఉన్న ఏకత్వము మాత్రమే దేవుని కొరకు మనలను విమోచించగలదు.
>
> — డా. థామస్ నెట్టెల్స్

విమోచనను గూర్చి దైవిక హేతువు మరియు వాగ్దానములను మనము చూశాము కాబట్టి, విమోచనను సాధించుటకు ప్రత్యేకముగా, నజరేయుడైన యేసుగా ఆయన నరావతారము ద్వారా కుమారుడు చేసిన కార్యమును పరీక్షించుటకు మనము సిద్ధముగా ఉన్నాము.

## కార్యము

యేసు విమోచన కార్యములోని నాలుగు అంశములను మనము చూద్దాము: దేవుని రాజ్యమును ఆయన ఆరంభించుట; తండ్రికి ఆయన విధేయుడగుట; ఆయన పునరుత్థానము; మరియు ఆయన ఆరోహణము. మొదటిగా దేవుని రాజ్యమును ఆయన ఆరంభించుటను చూద్దాము.

## దేవుని రాజ్యమును ఆరంభించుట

పాత నిబంధన అంతటిలో, వారి విరోధులను సమూలంగా నాశనం చేసి వారిని ఆశీర్వాదములతో కూడిన నిత్య జీవములో స్థాపించుటకు ఒక నాటకీయ విధముగా భూమి మీదికి దేవుడు రాజ్యమును తెచ్చు రోజు కొరకు దేవుని ప్రజలు ఎదురు చూశారు. అది మానవాళికి ఇవ్వబడిన వాస్తవిక బాధ్యత నెరవేర్చబడు దినమవుతుంది. దేవుడు తన సృష్టిని సంపూర్ణంగా పునరుద్ధరిస్తాడు, మరియు ఆయన చిత్తము పరలోకమందు నెరవేరుచున్నట్లే భూమి మీద కూడా నెరవేర్చబడుతుంది.

ఇశ్రాయేలు యొక్క పునరుద్ధరణను గూర్చి, మానవాళి మరియు సృష్టిని గూర్చి మాట్లడునప్పుడు పాత నిబంధన ప్రవక్తలు దానిని ప్రభువు దినము లేక అంత్య దినములు అని పిలచేవారు. దేవుని రాజ్యమును అంత్య దినములలోనికి నడిపించు ముఖ్య వ్యక్తిగా మెస్సీయను లేక క్రీస్తును వారు గుర్తించారు. క్రొత్త నిబంధన ప్రకారం, దేవుని కుమారుడైన యేసు భూమి మీద దేవుని రాజ్యమును స్థాపించుటకు వచ్చిన ఎంతో కాలముగా ఎదురుచూస్తున్న మెస్సీయ అయ్యున్నాడు.

ఆయన దినములలోనే తాను భూమి మీదికి దేవుని రాజ్యమును తెచ్చితినని యేసు బోధించాడు. ఉదాహరణకు, మత్తయి 12:28లో, ఆయన ఇలా అన్నాడు, "నిశ్చయముగా దేవుని రాజ్యము మీ యొద్దకు వచ్చియున్నది," అనగా అది అప్పటికే వచ్చియున్నది. మరియు లూకా 16:16లో, "ప్రతివాడును ఆ రాజ్యములో బలవంతముగా జొరబడుచున్నాడు" అని చెబుతూ ప్రజలు దేవుని రాజ్యములోనికి అప్పటికే ప్రవేశించుచున్నారని బోధించాడు.

దేవుని రాజ్యము అప్పటికే వచ్చియున్నది అను ఆలోచనను యేసు దినములలోని అనేకమంది ప్రజలు తిరస్కరించారు, ఎందుకంటే అది అందరు గుర్తించు — అనగా భూలోక క్రమమును పూర్తిగా భౌతికముగా స్పష్టముగా తలక్రిందలు చేయు — తిరస్కరించలేని భూలోక సత్యముగా ఉండాలని వారు ఆశించారు. అయితే వేరొక విధముగా రాజ్యము వచ్చియున్నదని యేసు బోధించాడు.

లూకా 17:20-21లో ఆయన చెప్పిన మాటలను వినండి:

> ఆయన దేవుని రాజ్యము ప్రత్యక్షముగా రాదు. ఎందుకనగా ఇదిగో దేవుని రాజ్యము మీ మధ్యనే యున్నది గనుక, ఇదిగో యిక్కడనని, అదిగో అక్కడనని చెప్ప వీలుపడదని వారికి ఉత్తరమిచ్చెను (లూకా 17:20-21).

స్పష్టముగా, దేవుని రాజ్యమును యేసు సంపూర్ణతలో తీసుకొని రాలేదు. ఆయన ఆ కార్యమును ఆరంభించాడు అంతే. కాబట్టి, ఆయన ఆరంభించిన దానిని పూర్తి చేయుట కొరకు — అనగా దేవుని రాజ్యమును పూర్తి చేయుటకు — ఎదురుచూస్తున్నాము. అయితే అది సుదీర్ఘ ప్రక్రియయైయున్నది. మత్తయి 13, మార్కు 4 మరియు లూకా 13లోని ఉపమానములలో యేసు బోధించినట్లు, దేవుని రాజ్యము నిదానముగా ఎదుగు విత్తనమును, లేక రొట్టెను నిదానముగా పొంగించు పులిసిన పిండిని పోలియున్నది. ఈ ఉపమానముల కోవలో, దేవుని రాజ్యము నాటబడింది అని, భవిష్యత్తులో యేసు తిరిగివచ్చు వరకు కోత దినము సంభవించదని మనము చెప్పవచ్చు.

నరవతారము దాల్చిన దేవుని కుమారుడైన యేసు భూమి మీద దేవుని రాజ్యమును స్థాపించాడని క్రొత్త నిబంధన బోధిస్తుంది. ఆయన మహిమలో తిరిగివచ్చినప్పుడు, ఈ దుష్ట యుగము సమూలంగా నాశనమవుతుంది అని, క్రొత్త ఆకాశము క్రొత్త భూమి దేవుని ప్రజలకు సంపూర్ణ



వీడియోలు, అధ్యయన మార్గదర్శిలు, మరియు ఇతర నిధుల కొరకు థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్ ను thirdmill.org నందు సందర్శించండి.

పునరుజ్జీవము కలిగిస్తుంది అని అది నిశ్చయతతో బోధిస్తుంది. ఇది మనకు గొప్ప నిరీక్షణను నిశ్చయతను కలిగించాలి. పతనమైన లోకములో, దుష్టత్వము గెలుస్తుంది అని, మనము ఊరకనే శ్రమపొందుచున్నామని కొన్నిసార్లు అనిపిస్తుంది. అయితే దేవుడు న్యాయమును నిత్యము వరకు ఆలస్యము చేయడు. ఆయన శత్రువుల మీద ఆయన అంతిమ తీర్పును ఇచ్చు దినము రాబోవుతుంది. ఆయన లోకములో నుండి తుదకు పాపమును, శ్రమను మరియు మరణమును కడిగివేస్తాడు. మరియు ఆయన నమ్మకమైన ప్రజలను ఆయన రాజ్యములో నిత్య స్వాస్థ్యమునిచ్చి ప్రతిఫలమిస్తాడు. అనేక అద్భుతములు మరియు బోధల ద్వారా యేసు తనను తాను రుజువుచేసుకున్నాడు, మరియు మన రాజ్య ఆశీర్వాదములకు సంచకరువుగా పరిశుద్ధాత్మను కూడా అనుగ్రహించాడు. కాబట్టి, తన రాజ్యమును స్థాపించుటకు మరియు మన సంపూర్ణ స్వాస్థ్యమును అనుగ్రహించుటకు ఆయన తిరిగి వస్తాడనే నిశ్చయతను మనము కలిగియుండవచ్చు.

యేసు దేవుని రాజ్యమును ఏ విధముగా ఆరంభించాడో చూశాము కాబట్టి, తండ్రి పట్ల ఆయన కలిగియున్న విధేయతను ఇప్పుడు చూద్దాము.

## విధేయత

ఈ పాఠంలో ఇంతకు ముందు, మానవాళి పాపములో పడిపోవుట వలన కలిగిన పరిణామాలను మనము చూశాము. ఆదాము నిబంధనా నాయకునిగా మానవాళి అంతటికి ప్రాతినిధ్యమును వహించాడు కాబట్టి ఆదాము మొదటి పాపము యొక్క అపరాధము మానవాళి అంతటి మీదికి వచ్చింది. దేవునితో తెగిపోయిన సహవాసమును మరియు మన రక్షణను మనము సంపాదించుకొను యోగ్యతకు ఆటంకం కలిగించు దుర్నీతిని మనము అనుభవించాము.

ముఖ్యముగా, మన విమోచకునిగా యేసు యొక్క పాత్రలో ఆదాము విఫలమైన చోట సఫలమగుట ముఖ్యమైన విషయముగా ఉన్నది. యేసు తండ్రికి సంపూర్ణ విధేయతలో జీవించి సిలువ మీద మరణించాడు. ఆయన చూపిన విధేయత ద్వారా, ఆదాము కోల్పోయిన ఆశీర్వాదములను ఆయన పొందుకున్నాడు. మరియు ఆ ఆశీర్వాదములను ఇప్పుడు ఆయన తన నమ్మకమైన ప్రజలతో పంచుకొనుచున్నాడు. రోమా. 5:12-19లో ఈ యేసు మరియు ఆదామునకు మధ్య ఉన్న ఈ పోలికెలను గూర్చి పౌలు స్పష్టముగా మాట్లాడాడు. మరియు 1 కొరింథీ 15:45లో, పౌలు ఆయనను "కడపటి ఆదాము" అని కూడా పిలచాడు.

యేసు తన జీవితమంతా కనుపరచిన విధేయతలోని రెండు విషయములను గూర్చి వేదాంతవేత్తలు తరచుగా మాట్లాడతారు. ఒక వైపున, అవమానము మరియు శ్రమల జీవితమునకు సమర్పించుకొని తుదకు సిలువ మీద మరణించుట ఆయన చూపిన పరోక్ష విధేయతను సూచిస్తుంది. పాపముకు జీతము మరణమని దేవుడు న్యాయముగా పెట్టిన ఆంక్షను సిలువ మీద ఆయన పొందిన మరణము పాటించింది. ఆయన చూపిన పరోక్ష విధేయతలో, యేసు మనకు ప్రత్యామ్నాయముగా ఉన్నాడు. మన అపరాధమును ఆయన భరించాడు, అనగా ఆయన ఖాతాలో జమ చేసుకున్నాడు. తద్వారా ఆయన దేవుని దృష్టిలో అపరాధిగా ఎంచబడి, మన స్థానములో మరణించాడు. ఆయన చేసిన ఈ ఒక్క కార్యము మన పాపములకు పరిహారమును చెల్లించింది, తద్వారా దేవుని తీర్పు మరియు ఉగ్రత



వీడియోలు, అధ్యయన మార్గదర్శిలు, మరియు ఇతర నిధుల కొరకు థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్ ను thirdmill.org నందు సందర్శించండి.

నుండి మనము తప్పించుకోగలిగితిమి. అది మన కొరకు పాప క్షమాపణను సంపాదించి, ధర్మశాస్త్రమను కాడి నుండి మనలను విడిపించింది.

రోమా. 5:18-19లో పౌలు ఇలా వ్రాస్తున్నాడు:

> కాబట్టి తీర్పు ఒక్క అపరాధమూలమున వచ్చినదై, మనుష్యులకందరికిని శిక్షావిధి కలుగుటకు ఏలాగు కారణమాయెనో, ఆలాగే ఒక్క పుణ్య కార్యమువలన కృపాదానము మనుష్యులకందరికిని జీవ ప్రదమైన నీతి విధింపబడుటకు కారణమాయెను. ఏలయనగా ఒక మనుష్యుని అవిధేయత వలన అనేకులు పాపులుగా ఏలాగు చేయబడిరో, ఆలాగే ఒకని విధేయత వలన అనేకులు నీతిమంతులుగా చేయబడుదురు (రోమా 5:18-19).

ఇక్కడ పౌలు ఖచ్చితముగా ఆదామును యేసును పోల్చాడు. ఒకప్పుడు ఆదాము మనకు ప్రతినిధిగా ఉన్నట్లే యేసు కూడా మనకు ప్రతినిధిగా ఉన్నాడు కాబట్టి, సిలువ మీద యేసు అర్పించిన బలియాగము దేవుని యొక్క న్యాయమైన శిక్ష నుండి మనలను విడిపించి, ఆయన మనలను నీతిమంతులుగా చూచునట్లు చేస్తుంది.

యేసు చూపిన రెండవ రకమైన విధేయత ప్రత్యక్ష విధేయత. ఇది తండ్రి ఆజ్ఞాపించిన ప్రతిదానికి ఆయన జీవితములో చూపిన విధేయత. ఆయన నరవతారములో, యేసు దేవుని ధర్మశాస్త్రమును పరిపూర్ణముగా నెరవేర్చాడు. ఆయన ఎన్నడును పాపము చేయలేదు, మరియు ఎల్లప్పుడూ దేవుడు ఆజ్ఞాపించిన దానినే చేశాడు. అదే విధముగా మన అపరాధము కూడా సిలువపై యేసు మీద మోపబడినది, మరియు ఆయన నీతిగల విధేయత మన మీద మోపబడినది. వేదాంతవేత్తలు చాలా సార్లు దీనిని "న్యాయసంబంధమైన నీతి" అని పిలుస్తారు, పాపము యొక్క ప్రభావము నుండి మనము పూర్తిగా విమోచన పొందకున్నప్పటికీ మనము నీతిమంతులుగా ప్రకటించబడితిమి అని దీని అర్థము. మనము ఆయన శరీరధారియైన యేసు వలె — అనగా మనము ఆయన పరిపూర్ణమైన జీవితమును జీవించినట్లు, మరియు ఆయన చేసిన సత్క్రియలను మనము చేసినట్లు — దేవుడు మనలను చూస్తాడు. ఫలితంగా, దేవునితో మన అనుబంధము పునరుద్ధరించబడింది. మన రక్షణను మనము సంపాదించకొనకుండా దుర్నీతి మనలను ఆపుచున్నప్పటికీ, యేసు చేసిన కార్యము ఆధారంగా దేవుడు మనకు రక్షణ ఆశీర్వాదమును ప్రతిఫలంగా ఇస్తాడు.

> మన పాపపు జీవితము నుండి, "ఉగ్రత సంతానము"గా పతనమైన స్థితి నుండి మనము విడిపించబడుటకు, సమస్యను పరిష్కరించుటకు బైబిలు చెబుతున్నట్లు మనకు దేవుడు కావాలి. మనము నిస్సహాయులము, నిరీక్షణ లేనివారము, మన సొంత సమస్య అయిన పాపమును పరిష్కరించలేకుండా ఉన్నాము. అయితే దేవుడు తన కృపలో మన సమస్యలను పరిష్కరిస్తాడు. మరియు మనకు ప్రతినిధిగా ఉండుటకు ఆయన కుమారుని పంపుట ద్వారా ఆయన దీనిని చేస్తాడు. కుమారుడైన దేవుడు మనిషిగా వచ్చి పరిపూర్ణమైన విధేయతా జీవితమును జీవించి, సిలువపై పరిపూర్ణ మరణమును పొంది, సమాధి నుండి తిరిగి లేచి, మన నిమిత్తము మరణమును జయించాడు. ఈ నూతన సృష్టిలో అనగా యేసు



వీడియోలు, అధ్యయన మార్గదర్శిలు, మరియు ఇతర నిధుల కొరకు థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్ ను thirdmill.org నందు సందర్శించండి.

> ప్రతినిధిగా ఉన్న ఈ పునరుత్థాన విమోచనా జీవితములో ప్రథమ ఫలములుగా ఉండుట ద్వారా మాత్రమే మనము విమోచింపబడగలము. ఆయనను నమ్ముట ద్వారా, పతన స్థితి నుండి విమోచించబడిన మానవాళికి ప్రాతినిధ్యము వహించు నూతన మనుష్యుడైన, కడపటి ఆదాము అయిన క్రీస్తుయందు విశ్వాసముంచుట ద్వారా మనము దీనిలో పాలుపంచుకోగలము. కాబట్టి, ఆయన చేసిన విమోచన కార్యము ద్వారా మనకు ప్రాతినిధ్యము వహించిన దైవ-మానవుడైన క్రీస్తుయందు విశ్వాసముంచుట ద్వారా, మనము విమోచన పొందగలము.
>
> — డా. కే. ఎరిక్ థోయెన్స్

దేవుని రాజ్యము మరియు విధేయత ఆధారంగా యేసు చేసిన కార్యమును మనము చూశాము కాబట్టి, మరణము నుండి ఆయన పొందిన పునరుత్థానమును ఇప్పుడు చూద్దాము.

## పునరుత్థానము

యేసు శరీర పునరుత్థానము ఆయన చేసిన విమోచనా కార్యమునకు మూలమైయున్నది. మరణము నుండి తిరిగి లేచుట ద్వారా, యేసు స్వయంగా మరణమును జయించాడు, మరియు ఆయన యందు విశ్వాసముంచు వారందరికీ నిత్యముండు భౌతిక జీవితమును స్థిరపరచాడు.

1 కొరింథీ. 15:20-21లో యేసు పునరుత్థానమును పౌలు ఏ విధముగా వివరించాడో వినండి:

> ఇప్పుడైతే నిద్రించినవారిలో ప్రథమఫలముగా క్రీస్తు మృతులలోనుండి లేపబడియున్నాడు. మనుష్యుని ద్వారా మరణము వచ్చెను గనుక మనుష్యుని ద్వారానే మృతుల పునరుత్థానమును కలిగెను (1 కొరింథీ. 15:20-21).

ఆదాము చేసిన పాపము మరణమును కలిగించింది. అయితే యేసు మరణము నుండి లేచినప్పుడు, ఆయనయందు విశ్వాసముంచు వారందరు పునరుత్థానము పొందుతారని ఆయన హామీ ఇచ్చాడు. మరియు ఆయన తిరిగి వచ్చినప్పుడు, మన విమోచకుడు కలిగియున్న మహిమగల శరీరములలో మనము నిత్యము జీవిస్తాము.

యేసు పునరుత్థానమును గూర్చిన ఈ అవగాహనను మనస్సులో ఉంచుకొని, ఆయన చేసిన విమోచన కార్యములోని నాల్గవ అంశమును చూద్దాము: పరలోకమునకు ఆరోహణమగుట.

## ఆరోహణము

ఆయన పునరుత్థానుడైన తరువాత, నలుబది దినముల పాటు యేసు శిష్యులకు ప్రత్యక్షమై, వారికి దేవుని రాజ్యమును గూర్చి బోధించాడు. మరియు ఈ సమయము ముగింపులో, ఆయన శరీరముతో పరలోకమునకు ఎక్కిపోయాడు. ఈ విషయమును గూర్చి లూకా 24:50, 51 మరియు అపొ. 1:3-11 వంటి చోట్ల వ్రాయబడియున్నది.

ఆరోహణము కనీసం రెండు కారణముల వలన యేసు యొక్క విమోచనా కార్యమునకు ప్రాముఖ్యమైయున్నది. ఒక వైపున, రాజుగా సింహాసనాసీనుడగుటకు ఆయన పరలోకమునకు



వీడియోలు, అధ్యయన మార్గదర్శిలు, మరియు ఇతర నిధుల కొరకు థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్ ను thirdmill.org నందు సందర్శించండి.

ఆరోహణమయ్యాడు. తండ్రి యొక్క సేవక రాజుగా ఆయన సృష్టి అంతటిని, ముఖ్యమైన ఆయన ప్రజలైన సంఘమును ఆయన పాలించుచున్నాడు. 1 కొరింథీ. 15:23-25; హెబ్రీ. 12:2 మరియు 1 పేతురు 3:22 వంటి చోట్ల ఈ వివరములు ప్రస్తావించబడ్డాయి.

మరొక వైపు, పరలోక దేవాలయములో బలిని పూర్తి చేసి, తండ్రి సన్నిధిలో ఆయన ప్రజల కొరకు మధ్యవర్తిగా ఉండుటకు విజ్ఞాపన చేయుటకు అనుమతి ఇచ్చింది కాబట్టి ఆరోహణము ప్రాముఖ్యమైనది. మధ్యవర్తిగా ఆయన పాత్రలో, సిలువలో ఆయన ఇచ్చిన బలిని యేసు తండ్రికి జ్ఞాపకము చేస్తాడు, తద్వారా తండ్రి ఆయనయందు విశ్వాసముంచు ప్రజలను క్షమిస్తూ వారిని దీవిస్తాడు. దీనిని గూర్చి మనము హెబ్రీ. 7:25-26, మరియు 9:11-28 వంటి చోట్ల చూస్తాము.

ఇప్పుడు, ఒక విధముగా, సృష్టికి ముందు ఆయన తండ్రితో చేసిన విమోచనా నిబంధన ద్వారా కుమారుడు ఎల్లప్పుడూ మన మధ్యవర్తిగా ఉన్నాడు. కాని పరలోకమునకు ఆరోహణమైన తరువాత కుమారుడు ఒక విశేషమైన రీతిలో మన మధ్యవర్తి అయ్యాడు.

మధ్యవర్తిగా యేసు పాత్రను 1 తిమోతి 2:5-6లో పౌలు ఏ విధంగా వివరించాడో వినండి:

> దేవుడొక్కడే, దేవునికిని నరులకును మధ్యవర్తియు ఒక్కడే; ఆయన క్రీస్తుయేసను నరుడు. ఈయన అందరి కొరకు విమోచన క్రయధనముగా తన్నుతానే సమర్పించుకొనెను (1 తిమోతి 2:5-6)

నరవతారము దాల్చిన దైవ కుమారుడైన యేసు క్రీస్తు పాపుల కొరకు బలిగా మరణించాడు. మరియు ఆయన మన కొరకు సిలువలో చెల్లించిన క్రయధనము తరచుగా మన జీవితములకు అనువర్తింపజేయుటకు ఇప్పుడు ఆయన తండ్రి సింహాసనము ఎదుట విజ్ఞాపనము చేయుచున్నాడు. హెబ్రీ 7:25లో ఇలా వ్రాయబడియున్నది:

> ఈయన తన ద్వారా దేవుని యొద్దకు వచ్చువారి పక్షమున, విజ్ఞాపనము చేయుటకు నిరంతరము జీవించుచున్నాడు గనుక వారిని సంపూర్ణముగా రక్షించుటకు శక్తిమంతుడై యున్నాడు (హెబ్రీ 7:25).

> కుమారుడైన యేసు నామమున గాక మరి ఏ నామమున రక్షణ లేదు. మొట్టమొదటిగా, మత నాయకులలో ఏ ఒక్కరు కూడా యేసు క్రీస్తు యొక్క పరిపూర్ణ స్థితిని చేరుకోలేదు, మరియు వారిలో ఏ ఒక్కరు కూడా నిత్యులు కారు. అంతేగాక, దేవునికి మానవునికి మధ్య అర్హత కలిగిన మధ్యవర్తి యేసు మాత్రమే అనునది మరింత ప్రాముఖ్యమైన విషయము. ఈ లోకములోని మతములు మరియు తత్వములు మనకు మంచి జీవిత నియమాలను ఇవ్వగలవు. అయితే యేసు క్రీస్తు మాత్రమే దేవుని దగ్గర నుండి వచ్చి దేవుని యొద్దకు తిరిగి వెళ్లువాడు. ఆయన మాత్రమే దేవునితో మనలను సమాధానపరచి, మన పాపములను మోయగలడు. ఈ విధంగా, ఆయన నైతికముగాను లేక తత్వశాస్త్ర భావనలో మాత్రమేగాక ఆయన వ్యక్తిత్వములో ఆయన దేవునికి మానవునికి మధ్య మధ్యవర్తియైయున్నాడు. బైబిలు పరిభాషలో, యేసు మాత్రమే దైవ-



వీడియోలు, అధ్యయన మార్గదర్శిలు, మరియు ఇతర నిధుల కొరకు థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్ ను thirdmill.org నందు సందర్శించండి.

**మానవుడు, మానవాళికి విమోచకుడు మరియు ఈ పరిపూర్ణ స్థితిని ఏ ఒక్కరు కూడా తమ వ్యక్తిగత కృషితోను నైతిక ప్రవర్తనలతోను చేరుకోలేరు.**

— డా. స్టీఫెన్ ఛాన్, అనువాదం

మనమంతా జీవితములో శ్రమలను సంఘర్షణను ఎదుర్కొంటాము. దేవుడు మన ప్రార్థనలను వినుచున్నాడా అని మనము ఆశ్చర్యపడుతుంటాము. అయితే మన సందేహాల మధ్యలో కూడా, మన పాపముల నుండి మనలను విమోచించు వెలను చెల్లించుట కొరకు యేసు మరణించాడని బైబిలు నిశ్చయతను కలుగజేస్తుంది. మనకు నిత్య జీవమునిచ్చుటకు ఆయన తిరిగిలేచాడు. మన లాభము కొరకు ఆయన రాజ్యమును పాలించుటకు, మరియు మన కొరకు నిరంతర విజ్ఞాపన చేయుటకు పరలోకమందున్న ఆయన సింహాసనమునకు ఎక్కి వెళ్లాడు. దీని అర్థము జీవితము ఎల్లప్పుడూ సులభంగా ఉంటుంది అని కాదు — అది అలా ఉండదు. అయితే మన విమోచకుడు ఎల్లప్పుడూ మన విజ్ఞాపనలను వింటాడు, మన మీద సానుభూతి చూపుతాడు, మనలను ప్రేమిస్తాడు అని దీని అర్థము, మరియు ఆయన అనుగ్రహించు రక్షణలో మనము భద్రముగా ఉన్నాము.

నిత్యత్వములో యేసును, సృష్టి మరియు విమోచనలో ఆయన చేసిన కార్యమును మనము చూశాము కాబట్టి, మన అంతిమ అంశమును చర్చించుటకు మనము సిద్ధముగా ఉన్నాము: భూమ్యాకాశముల భవిష్యత్ ముగింపు.

## ముగింపు

భూమ్యాకాశముల యొక్క ముగింపులో యేసు యొక్క భవిష్యద్ రాకడ, మరియు ఆ కాలము మొదలు అంతములేని భవిష్యత్తు వరకు కొనసాగు మన రక్షణ యొక్క అంతిమ ఘట్టమునకు సంబంధించిన విషయములు ఉన్నాయి. దానిలో దేవుని శత్రువులందరినీ సమూలంగా నాశనం చేయుట, ఆయన ప్రజల యొక్క అంతిమ ఆశీర్వాదము, దేవుని విమోచించబడిన ప్రజలు నిత్యము నివసించుటకు సృష్టి యొక్క నూతనపరచబడుట ఇమిడియున్నాయి. క్లుప్తంగా, లోకము దేవుని యొక్క మహిమకరమైన భూలోక రాజ్యముగా ఉండు కాలమది.

భూమ్యాకాశముల ముగింపును గూర్చి బైబిలు బోధనలను మూడు దశలలో పరీక్షిద్దాము. మొదటిగా, యేసు యొక్క రాకడను వివరిద్దాము. రెండవదిగా, భూమ్యాకాశములు ముగియునప్పుడు సంభవించు ఇతర సన్నివేశములను చూద్దాము. మరియు మూడవదిగా, ముగింపు యొక్క నిత్య పరిణామములను మనము వివరిద్దాము. యేసు రాకడతో ఆరంభిద్దాము.

## యేసు రాకడ

భూమి మీదకు యేసు యొక్క మొదటి రాకడ గొప్ప నమ్రతను కనుపరచింది. లోకములోని అనేక చోట్ల ఆయనను గూర్చిన వార్త తెలియలేదు. ఆయన నివసించిన స్థలములలో కూడా, లౌకిక చరిత్రకారులు ఆయనను గూర్చి పెద్దగా వ్రాయలేదు. అయితే ఆయన రెండవ రాకడ వేరుగా ఉంటుంది. మత్తయి 24:30లో యేసు ఇలా సెలవిచ్చాడు:

> అప్పుడు మనుష్య కుమారుడు ప్రభావముతోను మహా మహిమతోను ఆకాశ మేఘారూఢుడై వచ్చుట చూచి (మత్తయి 24:30)

1 థెస్స. 4:16లో పౌలు చెబుతున్నట్లు:

> ఆర్భాటముతోను, ప్రధానదూతశబ్దముతోను, దేవుని బూరతోను పరలోకమునుండి ప్రభువు దిగివచ్చును; క్రీస్తునందుండి మృతులైన వారు మొదట లేతురు (1 థెస్స. 4:16).

యేసు రాకడ విధానమును గూర్చి ఇది మరియు ఇతర లేఖన భాగములు కనీసం నాలుగు వివరాలను ఇస్తాయి. మొదటిగా, అది వ్యక్తిగత మరియు భౌతిక రాకడగా ఉంటుంది. ఇప్పుడు మనము నివాసముంటున్న ఈ లోకములోనికే మన ప్రభువైన యేసు క్రీస్తు తిరిగి వస్తాడు. ఆయన పరలోకమునకు ఆరోహణమైన రీతిలోనే తిరిగి వస్తాడని అపొ. 1:11 తెలియజేస్తుంది, అనగా ఆయన మేఘముల మీద దిగివస్తాడు.

రెండవదిగా, ఆయన రాకడ బహిరంగముగాను దృశ్యమైనదిగాను ఉంటుంది. ఆయనను ప్రతివారు చూస్తారు, మరియు సార్వత్రిక దేవుని బూరధ్వని ద్వారా మరియు ప్రధానదూత స్వరము ద్వారా ఆయన ప్రకటించబడతాడు.

మూడవదిగా, యేసు రెండవ రాకడ జయవంతమైనదిగా ఉంటుంది. ఆయన బలమైన విజయునిగా తిరిగి వస్తాడు. మరియు మత్తయి 16:27, 24:31, మరియు 25:31 వంటి వాక్యభాగాల ప్రకారము దేవదూతలు ఆయనకు పరిచారము చేస్తారు.

నాల్గవదిగా, యేసు రాకడ ఊహించని వేళలో జరుగుతుంది అని లేఖనము బోధిస్తుంది; మనము ఊహించిన సమయములో అది కలుగదు. వాస్తవానికి, మత్తయి 24:36 ప్రకారం, రెండవ రాకడ యొక్క తేది తండ్రికి మాత్రమే తెలుసు. కాబట్టి, తామే క్రీస్తు అని చెప్పుకొనువారిని, లేక ఆయన ఎప్పుడు తిరిగివస్తాడో తెలుసు అనువారిని విశ్వాసులు నమ్మకూడదు.

యేసు రాకడను గూర్చిన ఈ అవగాహనను మనస్సులో ఉంచుకొని, ముగింపులో ఆయన ఆరంభించు సంఘటనలను మనము చూద్దాము.



వీడియోలు, అధ్యయన మార్గదర్శిలు, మరియు ఇతర నిధుల కొరకు థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్ ను thirdmill.org నందు సందర్శించండి.

## సంఘటనలు

యేసు తిరిగివచినప్పుడు కనీసం మూడు ముఖ్యమైన సంఘటనలు జరుగుతాయి: సాధారణ పునరుత్థానము, అంతిమ తీర్పు, మరియు సృష్టి నూతనపరచబడుట. సాధారణ పునరుత్థానముతో ఆరంభించి ఈ సంఘటనలను ఒక్కొక్కటిగా చూద్దాము.

### సాధారణ పునరుత్థానము

క్రీస్తు తిరిగివచ్చునప్పుడు, మరణమునొందిన ప్రతి ఒక్కరు తిరిగి లేస్తారు. దుష్టులకు మరియు నీతిమంతులకు నిత్యము ఉండు నూతన శరీరములు ఇవ్వబడతాయి. దీనిని గూర్చి యోహాను 5:28-29లో స్పష్టముగా వ్రాయబడినది, అక్కడ యేసు ఇలా సెలవిచ్చాడు:

> ఒక కాలము వచ్చుచున్నది; ఆ కాలమున సమాధులలో నున్నవారందరు ఆయన శబ్దము విని మేలు చేసినవారు జీవపునరుత్థానమునకును, కీడుచేసినవారు తీర్పు పునరుత్థానమునకును బయటకి వచ్చెదరు (యోహాను 5:28-29).

ఇదే విధమైన ఆలోచనలను ప్రకటన 20:13లో మనము చూడవచ్చు, అక్కడ శరీరములు నాశనమైనవారికి కూడా పునరుత్థానము కలుగుతుంది అని మనకు బోధించబడింది. ఎవ్వరు కూడా విడిచిపెట్టబడరు; తీర్పునొందుటకు మానవజాతి అంతా తిరిగిలేస్తుంది.

విశ్వాసుల యొక్క పునరుత్థాన శరీరముల విషయములో, వారు పాపము మరియు భ్రష్టత్వము నుండి స్వతంత్రులవుతారని లేఖనము బోధిస్తుంది. పాపము ఇక ఎన్నడూ మన శరీరములలో ఉండదు, మరియు మనము నిత్యము ఆరోగ్యవంతులుగా జీవిస్తాము. ఫిలిప్పీ. 3:20-21లో పౌలు బోధించుచున్నట్లు:

> ప్రభువైన యేసుక్రీస్తు . . . మన దీనశరీరమును తన మహిమగల శరీరమునకు సమ రూపము గలదానిగా మార్చును (ఫిలిప్పీ. 3:20-21).

మన అంతిమ స్థాయిలో, యేసు మరణము నుండి తిరిగిలేచిన తరువాత పొందుకొని ఇప్పుడు కలిగియున్న మహిమకరమైన శరీరములను మనము కూడా పొందుకుంటాము.

అవిశ్వాసుల శరీరములు కూడా నిత్యముంటాయి గాని, అవి పాపము నుండి విమోచన పొందవు. బదులుగా, పాపమునకు ఫలితంగా దేవుడిచ్చిన శాపములను వారి శరీరములు అనుభవిస్తూనే ఉంటాయి. వాస్తవానికి, వారు తీర్పు పొందినప్పుడు ఈ శాపము ఎదుగుతుంది. యోహాను 5:28-29, మరియు అపొ. 24:15 వంటి చోట్ల వలె అవిశ్వాసుల యొక్క శారీరక పునరుత్థానమును గూర్చి లేఖనము మాట్లాడుతుంది; మత్తయి 5:29-30, మరియు 10:28లో వారి శారీరక శిక్షను గూర్చి లేఖనము ప్రస్తావిస్తుంది.

యేసు తిరిగివచ్చునప్పుడు సంభవించు రెండవ ముఖ్యమైన సంఘటన అంతిమ తీర్పు.



వీడియోలు, అధ్యయన మార్గదర్శిలు, మరియు ఇతర నిధుల కొరకు థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్ ను thirdmill.org నందు సందర్శించండి.

## అంతిమ తీర్పు

సాధారణ పునరుత్థానము తరువాత అంతిమ తీర్పులో తన శత్రువులందరినీ సమూలముగా నిర్మూలము చేసి, తనకు నమ్మకముగా ఉన్న ప్రజలందరినీ దీవించుట ద్వారా యేసు రాజుగా తన అధికారమును శక్తిని కనుపరుస్తాడు. అంతిమ తీర్పులో ప్రతి మానవుడు పాలుపంచుకుంటాడు; దానిని ఎవ్వరు తప్పించుకోలేరు. ప్రసంగి 12:14; మత్తయి 12:36-37; 2 కొరింథీ. 5:10; మరియు ప్రకటన 20:12-13 వంటి లేఖన భాగములలో ఇది స్పష్టము చేయబడింది. ప్రతి మానవుడు తీర్పును పొందునట్లే, తీర్పు సమయములో ప్రతి వ్యక్తి యొక్క వ్యక్తిగత జీవితములోని ప్రతి విషయము పరిగణలోనికి తీసుకోబడుతుంది అని ఈ లేఖన భాగములు సూచిస్తాయి. ప్రతి ఆలోచన, మాట మరియు కార్యము విశ్లేషించబడుతుంది.

మానవాళి పతనమై పాపములో ఉన్నది గనుక, తన సొంత యోగ్యత ఆధారంగా దేవుని ఎదుట నిలువబడు ప్రతి మానవుడు ఈ తీర్పులో శిక్షించబడి, నిత్య నరకములోనికి పడవేయబడతాడు. అయితే శుభవార్త ఏమిటంటే, విశ్వాసము మూలముగా కృప ద్వారా క్రీస్తులో క్షమాపణ పొందిన ప్రతి ఒక్కరు క్షమించబడి నిత్య స్వాస్థ్యమును పొందుకుంటారు.

యోహాను 3:18 ఈ విషయమును ఇలా తెలియజేస్తుంది:

> ఆయనయందు విశ్వాసముంచువానికి తీర్పు తీర్చబడదు; విశ్వసింపనివాడు దేవుని అద్వితీయకుమారుని నామమందు విశ్వాసముంచలేదు గనుక వానికి ఇంతకు మునుపే తీర్పు తీర్చబడెను (యోహాను 3:18).

యోహాను 5:24; 1 కొరింథీ. 11:32; మరియు 2 థెస్స. 2:12 వంటి చోట్ల ఇదే ఆలోచన పునరావృతం చేయబడింది.

> ఈ విమోచన కార్యములో న్యాయాధిపతిగా కుమారుని యొక్క పాత్ర నిర్వచనము ఆధారముగా దేవుని ప్రేమను మనము అతిగా ఉద్ఘటించు శోధనను తొలగించుటలో సహాయపడుతుంది అని నేను అనుకుంటాను. దేవుడు స్వాభావికముగా పరిశుద్ధుడైయున్నాడు, మరియు పరిశుద్ధతలో రెండు ముఖ్యమైన విషయములు ఉన్నాయి: ఆయన నీతిగల ప్రమాణములు మరియు ఆయన కరుణగల ప్రేమ. కాబట్టి సిలువ మీద ప్రేమతో తనను తాను అర్పించుకొనుటకు కుమారుడు దిగి వచ్చుట విమోచన కార్యమునకు కేంద్రమైయున్నది. అయితే ఆ విమోచనలో, ఆయన పరిశుద్ధుడు మరియు నీతిమంతుడు అను సత్యమును, మరియు ఆయన ప్రమాణములు ఎన్నడు మారలేదు అనే సత్యమును మనము ఎదుర్కోవాలి. తోట నుండి నేటి వరకు వారు ఒకే విధముగా ఉన్నారు. మనమంతా పాపము చేశాము. కాబట్టి న్యాయాధిపతి యొక్క న్యాయము సిలువ మరియు యేసు క్రీస్తు యొక్క విమోచన కార్యమును గూర్చి మనము కలిగియున్న అవగాహనలో ముఖ్య భూమికను పోషించాలి. ఇది లేకుండా, మనము పాపమును విషయమును కుదించినట్లవుతుంది. ఆ పాపము నుండి పశ్చాత్తాపము మరియు రక్షకుని

యొక్క అవసరతలను మనము అర్థము చేసుకోలేము. ఇది కేవలం మనలను ప్రేమించు దేవుడు మన సమస్యల నుండి మనలను విడిపించుటకు మాత్రమే వచ్చినట్లుగా చేస్తుంది. సిలువ మీద యేసు చేసిన కార్యము, మరియు ఒక వ్యక్తి రక్షణ పొందిన తరువాత కూడా ఆ విశ్వాసి జీవితములో ఆయన చేయు కొనసాగు కార్యము యొక్క సంపూర్ణ అవగాహన కొరకు ప్రభువైన యేసు యొక్క న్యాయము మరియు నీతి మూలములుగా ఉన్నాయి. మానవ చరిత్ర యొక్క ముగింపులో కూడా మనము యేసును న్యాయాధిపతిగా కలుసుకోబోతున్నాము. కాబట్టి మన జీవితములన్నీ కూడా ఈ ప్రేమ యొక్క పరిశుద్ధత మరియు పరిశుద్ధ నీతి యొక్క ఆధీనములో ఉన్నాయి, మరియు ఆయన తన న్యాయములోను, కరుణలోను మనకు ప్రతినిధిగా ఉన్నాడు.

— డా. బిల్ ఉరి

చివరిగా, యేసు తిరిగివచ్చునప్పుడు జరుగు మూడవ ముఖ్య సంఘటన ఏమనగా సృష్టి నూతనపరచబడుట.

## సృష్టి నూతనపరచబడుట

యేసు మానవాళికి న్యాయము తీర్చి అవిశ్వాసులను తొలగించునట్లే, ఆయన సృష్టిని శుద్ధిచేసి నూతనపరుస్తాడు. సృష్టి నూతనపరచబడుటను 2 పేతురు 3:10-13 ఈ విధముగా వివరిస్తుంది.

> ఇవన్నియు ఇట్లు లయమై పోవునవి గనుక, ఆకాశములు రవులుకొని లయమైపోవు నట్టియు, పంచభూతములు మహావేండ్రముతో కరిగిపోవునట్టియు, దేవుని దినపు రాకడకొరకు కనిపెట్టుచు, దానిని ఆశతో అపేక్షించుచు, మీరు పరిశుద్ధమైన ప్రవర్తనతోను భక్తితోను ఎంతో జాగ్రత్తగలవారై యుండవలెను. అయినను మనమాయన వాగ్దానమునుబట్టి క్రొత్త ఆకాశములకొరకును క్రొత్త భూమికొరకును కనిపెట్టు చున్నాము; వాటియందు నీతి నివసించును (2 పేతురు 3:10-13).

మానవాళి యొక్క విమోచన సృష్టియావత్తు మీద ప్రభావము చూపుతుంది, మరియు రోమా. 8:22-23లో ఇలా వ్రాయబడియున్నది, "అయినను మనమాయన వాగ్దానమునుబట్టి క్రొత్త ఆకాశములకొరకును క్రొత్త భూమికొరకును కనిపెట్టు చున్నాము; వాటియందు నీతి నివసించును. ఆత్మ యొక్క ప్రథమ ఫలముల నొందిన మనము కూడ, దత్త పుత్రత్వము కొరకు, అనగా మన దేహము యొక్క విమోచనము కొరకు కనిపెట్టుచు, మనలో మనము మూలుగుచున్నాము." ఆదాము చేసిన పాపమునకు ఫలితంగా సృష్టి యావత్తు నిష్ఫలతకు లోనైయ్యింది. ఈ నిష్ఫలత జాడ్యములోను, గలిబిలిలోను,

> మరణములోను ప్రత్యక్షపరచబడింది. పౌలు చెబుతున్నట్లు, నేడు సృష్టి అనుభవించు ఈ కార్యము ఒక స్త్రీ యొక్క ప్రసవ వేదనను పోలియున్నది, అనగా ఏదో ఒకటి రాబోవుచున్నది — దీనిలో నుండి ఏదో ఒకటి పుడుతుంది — మరియు సృష్టి అంతా విమోచించబడి పునరుద్ధరించబడుతుంది. మరియు ఆ వాస్తవికత యొక్క నెరవేర్పు కొరకు ఆత్మ యొక్క ప్రథమ ఫలములను కలిగి, కుమారులుగా దత్తతు పొందుటకు, దేహ విమోచన కొరకు ఎదురుచూచుచున్న మన వలెనె ఎదురుచూస్తుంది. మహిమకరమైన స్థితిలో మరణము, పాపము మరియు నాశనము లేకుండా విశ్వాసి పునరుద్ధరణ పొందు విధముగానే, అదే సమయములో సృష్టి కూడా బంధకముల నుండి విమోచన పొంది మనము ఇప్పుడు మన చుట్టూ చూచుచున్న మరణము లేక నాశనము లేక జాడ్యము లేని నూతన ఆకాశము మరియు నూతన భూమిగా మారిపోతుంది.
>
> — రెవ. జిమ్ మాప్పెల్స్

ప్రకటన 22:3 ప్రకారం, ఈ భూమ్యాకాశములు నూతనపరచబడుట పాపము యొక్క ఉనికిని శాపమును పూర్తిగా నిర్మూలము చేస్తుంది. మానవ పతనము యొక్క పరిణామములన్నీ తుడిచివేయబడతాయి, మరియు దేవుని ప్రజలు పాపము, శ్రమ, అనారోగ్యము లేక మరణము లేకుండా జీవిస్తారు. దేవుడు ప్రతి బాష్పబిందువును తుడిచివేస్తాడని కూడా ప్రకటన 21:4 బోధిస్తుంది. సృష్టి యావత్తు దేవుని వాస్తవిక ప్రణాళికలోనికి తిరిగి వెళ్తుంది, మరియు ఆయన నిత్య రాజ్యములో ఆయన ప్రజలు నిత్య జీవ బహుమానమును పొందుకుంటారు. మరియు ప్రకటన 21, 22లో వర్ణించబడిన నూతన యెరూషలేము ఆ రాజ్యమునకు రాజధానిగా ఉంటుంది.

ప్రకటన 22:2 ఈ నూతన యెరూషలేములోని ఒక భాగమును ఈ విధముగా వర్ణిస్తుంది:

> ఆ నదియొక్క ఈవలను ఆవలను జీవవృక్షముండెను; . . . ఆ వృక్షము యొక్క ఆకులు జనములను స్వస్థపరచుటకై వినియోగించును (ప్రకటన 22:2).

ఏదెను వనములో జీవ వృక్షము నాటబడినదని ఆదికాండము 2-3 అధ్యాయములు తెలియజేస్తాయి. ప్రత్యేకముగా, దేవుడు ఆదాము హవ్వలను ఏదెను వనములో నుండి త్రోలివేసినప్పుడు, కొంత వరకు దాని ఫలమును తినకుండా వారిని నిషేధించుటకు ఆయన అలా చేశాడని ఆది. 3:22-24 బోధిస్తుంది. అయితే క్రీస్తు తిరిగి వచ్చినప్పుడు, అంతిమ తీర్పు తరువాత, జీవవృక్ష ఫలము మరొకసారి మానవాళికి లభ్యమవుతుంది, మరియు దేవుని యొక్క మహిమగల పరిపాలనలో మనకు నిత్య శాంతిని ఆరోగ్యమును కలిగిస్తుంది.

> సృష్టిలో దేవుని స్వరూపమును కలిగిన సృష్టముగాను సృష్టిని యేలువానిగాను మానవునికి సృష్టికి అనుబంధం ఏర్పడింది. కాబట్టి, దేవుని ఆధీనంలో ఆదాము హవ్వలు సృష్టిని పాలించువారిగా నియమించబడ్డారు, మరియు వారి మధ్యను వారు పాలించు లోకము మధ్యను ఒక అనుబంధం ఏర్పడింది. ఆదాము హవ్వలు

> పాపములోనికి పడిన తరువాత, దాని యొక్క పర్యవసానములు ఆదాముకు మాత్రమే గాక సృష్టికి కూడా అన్వయించబడ్డాయి. ఇదే విధముగా, మానవాళి యొక్క అంతిమ విమోచనలో, రోమా. 8వ అధ్యాయము చెబుతున్నట్లు ఆదాము హవ్వలు ఆరంభములో చేసిన పాపము ద్వారా నాశనమగునట్లు సృష్టి చెరలోనికి కొనిపోబడినట్లు, మానవాళి అంతిమ విమోచనను పొందుకునప్పుడు ఆ పాప పరిణామముల నుండి సృష్టి కూడా విమోచించబడుతుంది. కాబట్టి స్వరూపమైన పరిపాలకునికి మరియు వారు పాలించు సృష్టికి మధ్య అనుబంధం ఉంది. పాపము విషయములో, మానవ పాప అనుభవ విషయములో, సృష్టి అదే అనుభవములోనికి పడిపోవుట విషయములో, మరియు సృష్టి కూడా చెర నుండి విమోచించబడు విధముగా మానవాళి పాపము నుండి విమోచన పొందు విషయములో ఆ ప్రభావము ముడిపడియున్నది.
>
> — డా. రోబ్ లిస్టర్

క్రీస్తు రాకడ విధానమును మరియు సంఘటనలను ఇప్పటి వరకు మనము చూశాము కాబట్టి, దాని ఫలితములను ఇప్పుడు చూద్దాము.

## ఫలితములు

ఈ పాఠం యొక్క ఆరంభములో, క్రీస్తులో ఆయన రాజ్యము ద్వారా ఆయన మహిమను ప్రదర్శించి ఘనతపొందుటకు దేవుడు విశ్వమును సృజించాడని చెబుతూ సృష్టి నిమిత్తము దేవుడు కలిగియున్న ఉద్దేశమును క్రోడీకరించాము. యేసు రాకడ యొక్క ఫలితములు ఈ ఉద్దేశము యొక్క అంతిమ నెరవేర్పు అవుతాయి. సమస్త పూర్ణతలో దేవుని రాజ్యమును తెచ్చుటకు, దేవుడు ప్రేమించువారిని మరియు దేవుని ప్రేమించి, సేవించి ఆరాధించు నమ్మకమైన ప్రజలను పూర్ణులను చేయుటకు యేసు తిరిగివచ్చుచున్నాడు.

> తన కొరకు ప్రజలను పునరుద్ధరించుకొనుట మానవాళి యొక్క విమోచనలో దేవుడు కలిగియున్న అంతిమ లక్ష్యమైయున్నది. ఆ పునరుద్ధరణ ఆదాము హవ్వలు ఏదెను తోటలో కలిగియుండిన సహవాసము కంటే ఎక్కువ పరిపూర్ణముగాను మరింత గొప్పగాను ఉంటుంది. మానవాళి పతనమైన తరువాత, దేవుడు వారికి *ప్రోటో-ఇవాంగిలియోస్,* లేక సువార్తను గూర్చిన మొదటి వాగ్దానమును ఇచ్చాడు, మరియు సర్పము యొక్క తలను చితకద్రొక్కుటకు స్త్రీ సంతతి నుండి పుట్టు విమోచకుని గూర్చి మాట్లాడాడు. మిగిలిన లేఖనమంతా ఆ పునరుద్ధరణ ప్రక్రియ యొక్క విశదీకరణగా ఉన్నది. ఇశ్రాయేలు దేశము ఆ పునరుద్ధరణలో భాగమైయున్నది మరియు ఆ పునరుద్ధరణ యొక్క చిత్రమైయున్నది. కాబట్టి సార్వత్రికత కలిగియున్న సంఘము ఈ పునరుద్ధరణకు

> మరింత ఉన్నతమైన చిత్రముగా ఉన్నది. చివరిగా, క్రీస్తు యొక్క రెండవ రాకడలో నూతన ఆకాశము మరియు నూతన భూమి పునరుద్ధరించబడతాయి మరియు దానిలో దేవుడు మానవాళితో అనగా విశ్వాసము ద్వారా క్రీస్తును ఎరిగిన వారందరితో సూటిగా సహవాసము చేస్తాడు, మరియు ఆ పరిపూర్ణమైన లోకములో సాతానుడు ఇక దాడి చేయడు, పాపము మరి ఎన్నుడును ఉండదు, మరియు వారు నిత్యము దేవుని పరిపూర్ణముగా మహిమపరుస్తారు.
>
> — డా. జెఫ్ లోమాన్

యేసు భూమ్యాకాశములను ముగింపులోనికి తెచ్చుట వలన కలుగు ఫలితములను అనేక విధాలుగా క్రోడీకరించవచ్చు, కాని ఈ పాఠంలో మనము వాటిని రెండు భాగములుగా విభజించుదాము. మొదటిగా, ముగింపులో కలుగు దేవుని మహిమను మనము పరిగణిద్దాము. రెండవదిగా, మానవులు అనుభవించు విమోచనా ఆనందమును మనము చూద్దాము. మొదటిగా దేవుని మహిమను చూద్దాము.

## దేవుని మహిమ

> మన విమోచన కార్యమును జరిగించినందుకు త్రియేక దేవుడు నిత్యత్వములో మహిమను పొందుతాడని నా ఆలోచన. దేవుడు దీనిని ఆయన మహిమ నిమిత్తము, ఆయన న్యాయమును ఆయన నీతిని, ఆయన మార్పులేని గుణమును, మరియు ఆయన ధర్మశాస్త్రము యొక్క పరిపూర్ణమైన పరిశుద్ధతను కనుపరచుట కొరకు మాత్రమే గాక, ఆయన జ్ఞానవంతుడని మరియు ఆయన గుణములను కలిగియుంటూనే క్షమించి, కరుణ చూపి పాపులను నీతిమంతులుగా తీర్చగలడని చూపించుట కొరకు దీనిని చేశాడు. "నీలా క్షమించు దేవుడు ఎవరు, నీలా కృప చూపువారెవరు?" అని ప్రవక్త ప్రశ్నించుచున్నాడు. కాబట్టి ఇది దేవుని మహిమ కొరకు జరుగుతుంది. ఇది పాపుల రక్షణ నిమిత్తము జరుగుతుంది, కాని దీని యొక్క అంతిమ ఫలితము ఏమిటంటే, నిత్యత్వములో దేవుని మహిమ మరి ఎక్కువ పరిమాణములలో కనుపరచబడుట.
>
> — డా. థామస్ నెట్టెల్స్

క్రీస్తు తిరిగి వచ్చునప్పుడు, దేవుని రాజ్యము మీద రాజుగా ఆయన యొక్క పరిపాలన ఉన్నత స్థాయికి, అత్యంత గౌరవప్రదమైన స్థాయికి చేరుకుంటుంది. మానవాళి అంతా యేసు యొక్క పరిపాలనను గుర్తించి ఆయన అధికారము ఎదుట సాగిలపడినప్పుడు దేవునికి మహిమను తెచ్చు లక్ష్యము చేధించబడుతుంది. ఫిలిప్పీ. 2:9-11లో పౌలు ఇలా వ్రాశాడు:

> అందుచేతను పరలోకమందున్నవారిలో గాని, భూమిమీద ఉన్నవారిలో గాని, భూమి క్రింద ఉన్నవారిలో గాని, ప్రతివాని మోకాలును యేసునామమున

> వంగునట్లును, ప్రతివాని నాలుకయు తండ్రియైన దేవుని మహిమార్థమై యేసుక్రీస్తు ప్రభువని ఒప్పుకొనునట్లును, దేవుడు ఆయనను అధికముగా హెచ్చించి, ప్రతి నామ మునకు పైనామమును ఆయనకు అనుగ్రహించెను (ఫిలిప్పీ. 2:9-11).

దేవుని యొక్క దయ ఆయనకు మహిమను కలిగిస్తుంది ఎందుకంటే, ఆయన ప్రేమ మరియు దయలో, ఆయన మారుమనస్సుపొందిన పాపులను క్షమించి వారిని ఊహకు అందని విధముగా ఆశీర్వదిస్తాడు. దీనికి ప్రత్యుత్తరముగా, ఆయనను మనము మహిమపరచి ఆయన మంచితనమును ప్రకటిస్తాము. ఎఫెసీ. 2:6-7లో పౌలు చెబుతున్నట్లు:

> క్రీస్తుయేసునందు ఆయన మనకు చేసిన ఉపకారముద్వారా అత్యధికమైన తన కృపా మహదైశ్వర్యమును రాబోవు యుగములలో కనుపరచునిమిత్తము, క్రీస్తుయేసునందు మనలను ఆయనతోకూడ లేపి, పరలోకమందు ఆయనతోకూడ కూర్చుండబెట్టెను (ఎఫెసీ. 2:6-7)

యేసు తిరిగివచ్చునప్పుడు, మన రాజభక్తికి ప్రతిఫలమివ్వబడుతుంది, మరియు దేవునికి నమ్మకముగా ఉన్న ప్రజలందరు నూతన ఆకాశమును నూతన భూమిని స్వాధీనపరచుకుంటారు, అక్కడ ఏదెను తోటలో ఆదాము హవ్వలు అనుభవించిన దేవుని ప్రసన్నత కంటే ఉన్నతమైన ప్రసన్నతను మనము అనుభవిస్తామని ప్రకటన 21:1-5 బోధిస్తుంది.

> పతనమునకు ముందు, నిశ్చయముగా మానువులు దేవునితో స్వతంత్రతతో కూడిన నిరాటంకమైన అనుబంధమును ఆస్వాదించారు. అయితే మానవాళి పతనమైన తరువాత, పతనమునకు ముందు మనము దేవునితో అనుభవించిన అనుబంధము కంటే ఉన్నతమైన మరియు పరిపూర్ణమైన అనుబంధమును అనుభవించుటకు ఒక విమోచన కార్యమును దేవుడు సిద్ధపరచియుంచాడు అనే ఒక భావన ఉన్నది. ఆదాము దేవుని స్నేహితుడు అని పిలువబడ్డాడు, అయితే కుమారుడు అని పిలువబడే యోగ్యత ప్రతి విశ్వాసికి లభించింది, మరియు తిరిగి తోటలోనికి వెళ్లుటకు ఇష్టపడని విధముగా ఈ అనుబంధములో మరింత అన్యోన్యత ఉన్నది అనే సత్యమును అనేక మంది చూపారు. మనము నూతన యెరూషలేము వైపునకు ప్రయాణించుచున్నాము, మరియు బైబిలు వేదాంతశాస్త్రమంతటిలో ఆ గొప్ప ప్రదేశమైన నూతన యెరూషలేము, అనగా నూతన ఆకాశము మరియు నూతన భూమి వైపుకు ప్రగతి జరుగుతుంది, మరియు అది మునుపటి ప్రదేశమునకు తిరిగి వెళ్లుట కాదు.
>
> — డా. సైమన్ వైబర్ట్

> పతనము నిజముగా జరిగింది కాబట్టి మనము ఇప్పుడు బాగున్నామా లేదా అను ప్రశ్న విషయములో, మానవుని యొక్క పతనము, దేవుని నుండి కలిగిన

> తిరస్కరణ ఒక విషాదకరమైన సంఘటన అని గుర్తించుట ఎంతో ప్రాముఖ్యమైయున్నదని నా ఆలోచన. అది ఒక దుఃఖకరమైన విషయం; అది పరలోకములోని గొప్ప రాజుకు విరోధముగా చేసిన ఒక ఘోరమైన ద్రోహము. కాబట్టి, పతనము యొక్క ఘోరమైన విషాదమును మనము చిన్నబుచ్చాలని ఆశించుట లేదు. కాని దేవుని సార్వభౌమ ప్రణాళిక కార్యరూపము దాల్చుట మనము చూచినప్పుడు, తుదకు ఆదాము హవ్వలు తోటలో నిష్కళంకులుగా అనుభవించినదాని కంటే ఉన్నతమైన ఫలితమును మనము అనుభవించగలమని మనము చూడవచ్చు. ఎందుకంటే విమోచన పొందిన తరువాత, మనము పొందుకొనేది ఒక నిష్కళంకమైన స్థితి కాదుగాని, మనము స్వయంగా త్రియేక దేవునితో సహవాసములోనికి తేబడతాము, అనగా క్రీస్తులో మన విమోచన ద్వారా, క్రీస్తుయందు కలిగియున్న విశ్వాసము ద్వారా, తండ్రి, కుమారుడు మరియు పరిశుద్ధాత్మ నిత్యము నుండి కలిగియున్న త్రియేక సహవాసములోనికి మనము ఆహ్వానించబడతాము, మరియు మనము దైవిక స్వభావములో పాలివారమై క్రీస్తుకు తోటివారసులమవుతాము. కాబట్టి నిశ్చయముగా, క్రీస్తులో మనము కలిగియున్న స్థితిని మనము పరీక్షించినప్పుడు, ఆదాము హవ్వలతో మనము తోటలో ఉండియుంటే అనుభవించియుండు స్థితి కంటే అది ఉన్నతమైన స్థితిగా ఉన్నది. కాబట్టి పతనము మూలముగా అద్భుతమైన సార్వభౌమ ఆశీర్వాదములు కలుగుతాయి. అది కష్టతరమైనది కాదని అర్థము కాదు, కాని దేవుని సార్వభౌమ మంచితనము మరియు శక్తి మూలముగా అది నిశ్చయముగా మనము వేరే విధముగా కలిగియుండిన దాని కంటే ఉన్నతమైన దానిని మనకు అందిస్తుంది.
>
> — డా. కే. ఎరిక్ థోయెన్స్

అవును, యేసు రాకడలో దేవునికి మహిమను తెచ్చు మరొక కోణము ఉన్నది, మరియు అది సర్వమానవాళికి ఒక హెచ్చరికగా ఉండాలి. ఆయన ప్రజలను ఆశీర్వదించుటతో పాటుగా, ఆయనను విమోచకునిగాను రాజుగాను త్రిరస్కరించిన ప్రతి వారినీ ప్రభువు శపిస్తాడు. వారికి కలుగు శిక్ష ఆయనకు మహిమను తెస్తుంది ఎందుకంటే అది ఆయన పరిశుద్ధత యొక్క గౌరవమును కాపాడుతుంది, ఆయన న్యాయమును కనుపరస్తుంది, మరియు ఆయన ప్రజలను పాపము యొక్క సన్నిధి నుండి బాధ నుండి విడిపిస్తుంది. ప్రకటన 19:1-2 వంటి లేఖనభాగముల ప్రకారం, దుష్టుల తీర్పును చూసి దేవుని నీతిమంతులు ఆనందిస్తారు. అయితే అప్పటి వరకు, క్రైస్తవులు ఈ ఆలోచనలను బట్టి సాధారణంగా ఆనందించరు. బదులుగా, ఈ ఘోరమైన శిక్షను వీలైనంతమంది తప్పించుకొనుటకు క్షమాపణ సువార్తను మరియు క్రీస్తులో రక్షణను ప్రకటించుటకు మనలను మనము సమర్పించుకుంటాము.

ముగింపులో కలుగు దేవుని మహిమను ఇప్పటి వరకు మనము పరీక్షించాము కాబట్టి, విశ్వాసులు అనుభవించు విమోచనా ఆనందమును గూర్చి బైబిలు ఏమి బోధిస్తుందో చూద్దాము.



వీడియోలు, అధ్యయన మార్గదర్శిలు, మరియు ఇతర నిధుల కొరకు థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్ ను thirdmill.org నందు సందర్శించండి.

## విమోచనా ఆనందము

విశ్వాసులు విమోచనలో పొందుకొను ఆనందము యొక్క మూడు స్థిరమైన నిధులను గూర్చి బైబిలు ప్రస్తావిస్తుంది. మరియు వీటిలో అత్యంత గొప్పది దేవునితో మనము కలిగియుండు సంపూర్ణ సహవాసము అను సత్యము కావచ్చు.

ఏదెను తోటలో పాపము చేసిన తరువాత, ఆదాము హవ్వలు ఒకరి నుండి ఒకరు మరియు దేవుని నుండి దాగుకున్నారు. దేవుడు వారిని శపించినప్పుడు, వారు ఆయన ప్రత్యేక సన్నిధి నుండి త్రోసివేయబడ్డారు. అయితే ముగింపులో, యేసు మానవ స్వభావమును పునరుద్ధరిస్తాడు, తద్వారా దేవుని యొక్క ప్రత్యేకమైన సన్నిధిలోనికి భౌతికముగా మనము అనుమతించబడతాము, మరియు ఆయన మహిమను మన సొంత కన్నులతో చూడగలుగుతాము. యోహాను 17:24; 1 యోహాను 3:2; మరియు ప్రకటన 21:3 వంటి వాక్య భాగములలో ఇది స్పష్టముగా బోధించబడింది.

నాలుగవ శతాబ్దపు బిషప్ అయిన అగస్టిన్ తాను వ్రాసిన *ది సిటీ అఫ్ గాడ్,* 22వ పుస్తకము,30వ అధ్యాయములో ఈ ఆశీర్వాదమును ఏ విధంగా క్రోడీకరించాడో వినండి.

> మంచితనమునకు కర్త అయిన దేవుడు స్వయంగా దాని ప్రతిఫలమైయుంటాడు; ఎందుకంటే ఆయన తనను తాను వాగ్దానము చేసుకున్నాడు, దాని కంటే ఉన్నతమైనది మేలైనది మరొకటి లేదు. ప్రవక్త ద్వారా ఆయన ఇచ్చిన మాట అయిన "నేను మీ దేవుడనైయుండును, మీరు నా ప్రజలైయుందురు," మరియు "నేను వారి సంతృప్తినైయుందును, నేను ప్రజలు ఘనముగా ఆశించివాడనైయుందును — జీవము, ఆరోగ్యము, పోషణ, పుష్కలత, మహిమ, ఘనత, సమాధానము, మరియు సమస్తమైన మేలు" అను మాటకు వేరొక అర్థము ఏముంటుంది? ఇది కూడా అపొస్తలుడు చెప్పిన "దేవుడు సర్వమైయున్నాడు" అను మాటకు సరైన అనువాదమైయున్నది. మన ఆశలన్నిటికీ ఆయన గమ్యమైయుండాలి ఆయనను అంతము లేకుండా చూడాలి, కపటము లేకుండా ప్రేమించాలి, అలసిపోకుండా ఆరాధించాలి. ఈ ఆప్యాయతల యొక్క వ్యక్తీకరణ, ఈ ఉద్యోగము, నిశ్చయముగా నిత్య జీవమును పోలియున్నది, మరియు ఇది సార్వత్రికమైనది.

విశ్వాసులు అనుభవించు రెండవ విమోచనా ఆనందము ఒకరితో ఒకరు పూర్ణమైన సహవాసమును అనుభవించుట.

దేవునితో మన అనుబంధమును నాశనము చేయుటతో పాటుగా, ఆదాము చేసిన పాపము మానవ అనుబంధములను నాశనము చేసింది. మనము పూర్తిగా విమోచింపబడినప్పుడు దేశములు స్వస్థత పొందుతాయని ప్రకటన 22:2 ప్రకటిస్తుంది. యుద్ధములు ఆగిపోతాయి, అన్యాయము అంతరించిపోతుంది, మరియు అనుబంధములు సంపూర్ణముగా పునరుద్ధరించబడతాయి. లోకమంతా సమాధానకరమైన, స్నేహపూర్వకమైన, ఒకరినొకరు సేవించు మరియు ప్రేమించు కౌటంబిక ప్రజల సమాజముగా మారిపోతుంది.

చివరిగా, మూడవ విమోచనా ఆనందము ఏమనగా నూతన ఆకాశమును నూతన భూమిని క్రీస్తుతో కూడా మనము పాలిస్తాము అనే సత్యము.

2 తిమోతి 2:12లో పౌలు దీనిని ప్రస్తావిస్తూ, ఇలా వ్రాశాడు:

> సహించినవారమైతే ఆయనతో కూడ ఏలుదుము (2 తిమోతి 2:12).

క్రీస్తుతో మనము పాలించుటను గూర్చి ప్రకటన 2:26-27, 3:21, మరియు 22:5 వంటి లేఖన భాగములు కూడా ప్రస్తావిస్తాయి.

ఆదాము హవ్వలు దేవుని స్వరూపములో చేయబడి దేవుని ఆధీనములో సృష్టిని పాలించుటకు వారు ఏదెను తోటలో ఉంచబడ్డారు. అయితే ఆదాము చేసిన పాపము యొక్క శాపము మరియు భ్రష్టత్వము దేవుని ఉన్నతమైన ఉద్దేశములను జరిగించు విధముగా ఈ కార్యమును నెరవేర్చకుండా మానవాళిని అభ్యంతరపరచింది. అయితే యేసు, ఆయన చేసిన బలియాగము ద్వారా విధేయత ద్వారా, ఆదాము చేయని కార్యమును చేయుట ఆరంభించాడు. ఇప్పుడు ఆయన మన నిబంధనా అధిపతిగా ఉండి, సర్వసృష్టిని పాలించుచున్నాడు. మరియు లోకము యొక్క ముగింపులో, దేవుని మహిమపరచు విధముగా సృష్టి యంతటికి ప్రయోజనకరమైన విధముగా తుదకు విమోచింపబడిన మానవాళి సృష్టిని పరిపాలిస్తుంది.

> క్రైస్తవులమైన మనము మన భవిష్యత్తు నిరీక్షణకు, సంపూర్ణ విమోచనకు నిరీక్షణ కలిగిన ఆత్మతో స్పందించవచ్చు. నిరీక్షణ అనునది భావార్థకమైన భవిష్యత్తు కొరకు నిశ్చయతతో కూడిన ఎదురు చూపైయున్నది. మరియు నిరీక్షణ యొక్క ఒక విశేషమైన అభ్యాసికమైన స్వభావము ఏమనగా అది మనలను ఉత్తేజపరుస్తుంది, అది మనకు ఓరిమి కలిగిస్తుంది, అది మనకు హుషారు కలిగిస్తుంది, మరియు అది మనకు వర్తమాన కాలములో నిశ్చయతతో కూడిన ఎదురుచూచు ఆనందమును అనుగ్రహిస్తుంది మరియు మనకు వాగ్దానము చేయబడినది వాస్తవమవుతుంది. మనము ఇప్పుడు పడు శ్రమకు కలుగు నిశ్చయమైన ఫలితమును గూర్చి ఆలోచించినప్పుడు అది మనలను మరింత ఉత్సాహపరుస్తుంది, కాని మన మితమైన దృష్టికోణములో స్వాభావికముగా మనకు అది అనిశ్చితిగా అనిపించవచ్చు.
>
> — డా. గ్లెన్ స్కోర్గి

## ముగింపు

విమోచకుడైన యేసును గూర్చిన ఈ పాఠంలో, మనము దేవుని కుమారుడైన యేసు క్రీస్తు యొక్క వ్యక్తిత్వమును మరియు కార్యమును నాలుగు వేర్వేరు కాలములలో పరిగణించాము:



వీడియోలు, అధ్యయన మార్గదర్శిలు, మరియు ఇతర నిధుల కొరకు థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్ ను thirdmill.org నందు సందర్శించండి.

నిత్యత్వము, విశ్వమును సృష్టించుటకు ముందు; సృష్టి యొక్క ఆరంభ కాలము, విశాలమైన విమోచనా యుగము, మరియు భవిష్యత్తులో సంభవించు ముగింపు యుగము.

నిస్సందేహముగా యేసు క్రీస్తు చరిత్ర యంతటిలో అత్యంత ఆసక్తికరమైన, క్లిష్టమైన మరియు ప్రాముఖ్యమైన వ్యక్తిత్వమైయున్నాడు. మరియు ఆయన నేడు కూడా సజీవుడైయున్నాడు. ఆయన సృష్టియంతటికి రాజైయున్నాడు, మరియు పరలోక సింహాసనము నుండి పాలించుచున్నాడు. ఆయనను మనము సంపూర్ణంగా అర్థము చేసుకొని ఆయనను పూర్తిగా ప్రశంసించాలని ఎన్నడును కోరలేము. అయితే ఈ పాఠంలో ఇవ్వబడిన అవలోకనము ఆయనను ఘనపరచు విధముగాను ప్రజలకు మేలు చేయు విధముగాను యేసును గూర్చి ఆలోచించుటకు మనలను సిద్ధపరుస్తుంది అని ఆశించుచున్నాము.



వీడియోలు, అధ్యయన మార్గదర్శిలు, మరియు ఇతర నిధుల కొరకు థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్ ను thirdmill.org నందు సందర్శించండి.